www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 203 | శనివారం | 12 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

మూసవీడి కొత్త ఒరవడి

సర్పంచ్‌లకు శిక్షణ, చట్టంపై అవగాహన : సిఎం కెసిఆర్

- సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఫిబ్రవరి-మే వరకు పూర్తిస్థాయి శిక్షణ
- గ్రామ సమగ్ర వికాసానికి సర్పంచ్‌లే కీలకం
- ప్రతి గ్రామానికి కొత్త చట్టం తెలుగు ప్రతులు
- పూర్తిస్థాయి బడ్జెట్‌లోనే పంచాయతీలకు నిధులు

మన తెలంగాణ /హైదరాబాద్

ఇప్పుడు మూడు దశల్లో ఎన్నికలు జరిగిన తర్వాత కొత్తగా ఎన్నికయ్యే సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దే విషయంలో వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచడం లక్ష్యంగా కొత్తగా రూపొందించిన పంచాయతీరాజ్ చట్టంపై అన్ని పంచాయితీల సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు అవగాహన కల్పించాలని, ప్రతీ గామ పంచాయతీకి కొత్త చట్టం తెలుగు ప్రతులను అందజేయాలని చెప్పారు. కొత్తగా నియామకమయ్యే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కలిసికట్టుగా పని చేయడానికి అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచులు ఇంతకాలం కొనసాగిన మూస పద్ధతిలో కాకుండా, గ్రామాల సమగ్ర వికాసానికి పాటుపాడే ఉద్యమకారులుగా మారాలని కెసిఆర్ ఆకాంక్షించారు. సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే అంశంపై ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, కాలె యాదయ్య, సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయని ప్రతీ గ్రామానికి ఒక కార్యదర్శిని నియమించడం కోసం పంచాయతీ కార్యదర్శులు తరువాయి 6లో



వివిధ సెట్ల సారథులు

ఎంసెట్ కన్వీనర్‌గా జెఎన్‌టియు రిజిస్ట్రార్ యాదయ్య

ఇసెట్ : జెఎన్‌టియు రెక్టార్ గోవర్ధన్

పిఇసెట్ : వి సత్యనారాయణ

ఐసెట్ : రాజేశం

లాసెట్, పిజి లాసెట్ : జిబి రెడ్డి

పిజి సెట్ : ఎం కుమార్

ఎడ్‌సెట్ : టి మృణాళిని

2

ఆకాశంలో ఆమె

భారత మానవ సహిత గగన్‌యాన్ యాత్రికులలో ఒక మహిళ

2021 డిసెంబర్ నాటికి పంపాలని నిర్ణయం : ఇస్రో శివన్



బెంగళూరు: భారతదేశ పుతొట్టతొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్ యాన్‌కు రంగం సిద్ధం అయింది. 2021 డిసెంబర్ నాటికి గగన్‌యాన్ ప్రయోగం చేపట్టాలని తలపెట్టారు. దీనికి సంబంధించిన వివరాలను ఇస్రో తరువాయి 6లో

అలోక్ వర్మ రాజీనామా



- బలిపశువును చేశారంటూ ఆవేదన

16

డేరా బాబా దోషి



- జర్నలిస్టు హత్య కేసులో గుర్మీత్ రామ్ రహీమ్‌కు శిక్ష 17న వెల్లడి

14



భారతీయులకు అనువుగా హెచ్1బిలో మార్పులు : ట్రంప్

16

అంబులెన్స్ నుజ్జు

ముగ్గురు దుర్మరణం, నలుగురికి తీవ్రగాయాలు, ఓఆర్ఆర్ రక్తసిక్తం



7

ధరణి ఓకే

త్వరలో అన్ని జిల్లాల్లో అమలు



3



డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు రోహింగ్యాల

అరెస్టు

ఏడు డ్రగ్స్ ప్యాకెట్లు, రూ. 26,000 నగదు స్వాధీనం

2

శ్రవణం, దంత క్రాంతి

ఇఎన్‌టి, డెంటల్ పరీక్షలకు పేర్లు ప్రతిపాదన

రూ. 3000 వినికిడి యంత్రాలు ఉచితం

3

వచ్చే విద్యా సంవత్సరానికి గిరిజన వర్సిటీ

జూలై నుంచి తరగతులు

ఆరు కోర్సులు, ఒక్కొక్క దానికి 30మంది విద్యార్థులు

6

'సెట్'ల కన్వీనర్ల నియామకం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వివిధ కోర్సుల్లో చేరడానికి విద్యార్థులకు నిర్వహించే ఎనిమిది ప్రవేశ పరీక్షలకు శుక్రవారం కన్వీనర్లను నియమించింది. ఈ మేరకు మండలి చైర్మన్ పాపిరెడ్డి ప్రకటన విడుదల చేశారు. మే నెల 3, 4, 6 తేదీల్లో ఇంజనీరింగ్ కోర్సుల కోసం, 8, 9 తేదీల్లో వ్యవసాయ కోర్సుల కోసం నిర్వహించే ఎంసెట్ ప్రవేశ పరీక్ష కన్వీనర్‌గా జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్యను కన్వీనర్‌గా నియమించారు. మొత్తం ఎనిమిది రకాల ప్రవేశపరీక్షలకు విడివిడి కన్వీనర్లను నియమించారు. ఎంసెట్ ప్రవేశ పరీక్షకు ప్రొఫెసర్ యాదయ్య, మే 11న జరిగే 'ఇ సెట్' పరీక్షలకు జెఎన్‌టియు రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్, మే 20న జరిగే 'పి ఇ సెట్' పరీక్షలకు కాకతీయ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. వి.సత్యనారాయణ, మే 23, 24 తేదీల్లో జరిగే 'ఐ సెట్' పరీక్షలకు కాకతీయ యూనివర్శిటీ కామర్స్ విభాగాధిపతి ప్రొ. రాజేశం, మే 26న జరిగే 'లా సెట్', 'పిజి లా సెట్' ప్రవేశ పరీక్షలకు ఒయుకు చెందిన లా కళాశాల డీన్ ప్రొ. జిబి రెడ్డి, మే 27, 29 తేదీల్లో జరిగే 'పిజి సెట్' పరీక్షకు ఒయు సివిల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఎం.కుమార్, మే 30, 31 తేదీల్లో జరిగే 'ఎడ్‌సెట్' ప్రవేశ పరీక్షకు ఒయు ఎడ్యుకేషన్ కళాశాల డీన్ టి.మృణాళినిలను కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన పాపిరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.


సిఎం కెసిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ తూర్పు శాసనసభ్యులు నన్నపునేని నరేందర్


శుక్రవారంనాడు ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసిన చేవేళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య. ఈ సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీ వార్డులను పెంచాలని, ఎంఎంటిఎస్ రైలును లింగంపల్లి నుండి వికారాబాద్ వరకు పొడిగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటర్ల నమోదు బంద్

- నామినేషన్ల కంటే ముందే ఈ ప్రక్రియ పూర్తి
- ఇఆర్‌ఒ నెట్‌లో సాంకేతిక సమస్యలు
- అసెంబ్లీ పోలింగ్ శాతం.. లోక్‌సభలోనూ రిపీట్
- పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్రానికి రూ.350 కోట్లు
- కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించిన సిఇఒ రజత్ కుమార్



మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల పర్వం ప్రారంభం కావడాని కంటే ముందే ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి ఇఆర్‌ఓ నెట్‌లో ఫ్రీజ్ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించారు. కేవలం పోటీలో ఉండే అభ్యర్థికి మాత్రం రిటర్నింగ్ అధికారి అనుమతితో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో కూడా మార్పులు లేకుండా నామినేషన్ల కంటే ముందే ఫ్రీజ్ చేయాలన్నారు. అలాగే ఇఆర్‌ఒ నెట్‌లో ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుంటేనే వినియోగంలో ఉంచాలని స్పష్టం చేశారు. ఇంటి నెంబర్‌తో ఓటురుగా ఉన్నారో లేదో చూసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నామని, ఇందుకు రూ.350 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. 500 ఓట్ల కంటే తక్కువ తేడాతో అన్ని వివిప్యాట్‌ల స్లిప్పులను ఖచ్చితంగా లెక్కించేలా చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో శుక్రవారం జరిగిని సిఇఒల కాన్ఫరెన్సులో ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నకిలీ ఓటర్లను గుర్తించడానికి, అభ్యంతరాలను పరిష్కరించడానికి రాష్ట్రంలో తొలిసారిగా ఇఆర్‌ఒ నెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధానంగా ప్రస్తావించిన సిఇఒ ఒక్కో దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేందుకు కనీసంగా 15 నిమిషాల నుంచి 20 నిమిషాల సమయం తీసుకుందని పేర్కొన్నారు. ఇఆర్‌ఒ నెట్ కారణంగా ఓటరు తుది జాబితా ప్రకటించే సమయంలో అనేక ఇబ్బందులు పడ్డామని వివరించారు. ఇబ్బందులను అధిగమించేందుకు సిడాక్ ఇంజనీర్లు పనిచేస్తున్నప్పటికీ ఇఆర్‌ఒ నెట్ అలాగే మొరాయించిందన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ఇఆర్‌ఒ నెట్‌లో అప్‌లోడ్ చేసేందుకు సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. ఒకవేళ అప్‌లోడ్ అయినప్పటికీ లాగిన్ చేసిన తరువాత వివరాలు కనిపించని సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అలాగే 18 సంవత్సరాలు కంటే తక్కువగా ఉండి ఓటుకు నమోదు చేసుకున్న వారి వివరాలు డిఇఒ డాష్ బోర్డులో కనిపించినప్పటికీ, ఇఆర్‌ఒ నెట్ లాగిన్‌లో కనిపించడం లేదన్నారు. అలాగే కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే (ఫామ్–6) వారికి ఇంగ్లీష్‌లో ఒక పేరు తెలుగులో మారేప్పటికీ అచ్చు తప్పులు వస్తున్నట్లు గుర్తించారు. ఓటర్లు తప్పుగా నమోదు చేసిన వివరాలను సరి చేసేందుకు 8ఎ ఫామ్ వివరాలు ఇఆర్‌ఒ నెట్‌లో ప్రాసెస్ కాలేదని ప్రతీదానికి ఏదో ఒక సాంకేతిక సమస్య తలెత్తిందని వివరించారు.

3.9 శాతం పోలింగ్ పెంచాం

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 73.40 శాతం పోలింగ్ నమోదైందని సిఇఒ ఇసికి వివరించారు. గత 2014 ఎన్నికలతో చూస్తే 3.9 శాతం పెరిగిందని, దీనినే లోక్‌సభ ఎన్నికల్లోనూ కంటిన్యూ చేస్తామన్నారు. 2009 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో 67.96 శాతం, లోక్‌సభకు 67.93 శాతం, 2014 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో 69.50 శాతం, లోక్‌సభకు 68.71 శాతం పోలింగ్ నమోదైంది.

1000 ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్

గ్రామీణ ప్రాంతాల్లో 1000 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఉండాలని సిఇఒ రజత్ కుమార్ ఇసికి సూచించారు. ప్రస్తుతం ఈ సంఖ్య 1200గా ఉంది. ఫలితంగా పోలింగ్ సమయం ముగిసినప్పటికీ గంటల కొద్దీ ఓటర్లు క్యూ లైన్‌లో నిల్చోవాల్సి వస్తుందని, అందులో భాగంగానే ఈ సంఖ్యను కుదించాలన్నారు.

వివిప్యాట్‌కు లెడ్ లైట్

వివిప్యాట్‌ల సాంకేతికత తలనొప్పిగా మారిందని సిఇఒ ఇసికి వివరించారు. ఎక్కువ వెలుతురు పడితే పనిచేయడం లేదని ఇందుకు బ్యాలెట్ యూనిట్‌కు లెడ్‌లైట్ ఉంచి, దాని సహాయంతో వివిప్యాట్‌లో ముద్రించే స్లిప్పులను చూసే అవకాశం కల్పించాలన్నారు. అలాగే చాలామంది ఓటర్లకు ఇవిఎంలపై ఓటు వేయడంపై అవగాహన లేనందున అన్ని పోలింగ్ స్టేషన్‌లలో కార్డు బోర్డు సహాయంతో డమ్మీ బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు.

మావోయిస్టుల కొరియర్ ప్రకాష్ అరెస్ట్

పిస్టోలు, 6 తూటాలు స్వాధీనం





మనతెలంగాణ/మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో గల మర్రిగూడెం గ్రామనికి చెందిన మావోయిస్టు పార్టీ కొరియర్ బత్తుల ప్రకాష్ అలియాస్ ప్రదీప్ అరెస్ట్ చేసి అతని వద్ద ఒక పిస్టోలు, 06 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి నంధ్యాల కోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా టౌన్ పోలిస్ స్టేషన్‌లో జరిగిన మిడియా సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రకాష్ వివిద విప్లవ పార్టీలలో పని చేస్తు పలు మార్లు పోలిసులకు చిక్కినట్లు తెలిపారు. తరుచుగా భూవివాధంలో తలదూర్చేవాడని, ఉమ్మడి జిల్లాలో దత్తాలపల్లి, నల్లబెల్లి పోలిస్‌స్టేషన్‌లో పలు కేసులు ఉన్నట్లు పెర్కోన్నారు..కొంతకాలంగా మావోయిస్టు నేత హరిభూషన్‌కు అయుధాలను సరాఫరా చేస్తు కోరియారుగా పని చేశారని అన్నారు.ఇద్దరు మిత్రులు ఈసం నాగేశ్వర్‌రావుతో బాటు ప్రకాష్‌గంగారం అటవీ ప్రాంతంలో అయుధాలతో సంచరిసూ కొత్తగూడెం మండలం పరిధిలో గుంజేడు ముసలమ్మ దేవాలయ సమీపంలో పక్క సమాచారంతో కొత్తగూడ ఎస్పై తాహెర్‌బాబా చకాచక్యంగా వ్యవరించి పట్టుకొని అతని వద్ద ఉన్న ఒక ఫస్టోల్ 06 తూటాలను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఇతనిని అరెస్టు చేసినప్పటికి పద్ధతి మార్చుకోకుండా దళాలలకు అయూధాల సరఫరా కొనసాగిస్తున్నారని అన్నారు. బత్తుల ప్రకాష్ అరెస్ట చెసిన గూడురు సిఐ బాలజి కొత్తగూడ ఎస్పై తాహెర్‌బాబా తమ సిబ్బందిని అభినంధిస్తూ రివార్డులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి నరేష్‌కు మారు,'సిఐ రవి,ఎస్సైలు పాల్గొన్నారు.

ఇద్దరు రోహింగ్యాల అరెస్ట్

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: శరణార్థులుగా వచ్చిన ఇద్దరు యువకులు డ్రగ్స్ సరఫరా చేస్తుండగా రాచకొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఏడు డ్రగ్స్ ప్యాకెట్లు, రూ.26,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విలువ రూ. 2 లక్షలు ఉంటుంది. ఒక ప్యాకెట్‌లో 190 ట్యాబ్లెట్లు ఉంటాయి. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యాలు అబిబస్ రెహమాన్ రంగారెడ్డి జిల్లా, బాలాపూర్‌లో ఉంటూ సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. మసీద్ సమీపంలో ఉంటున్న మహ్మద్ రహీం హాస్టల్‌లో పనిచేస్తున్నాడు. ఇద్దరు కలిసి మయన్మార్, థాయిలాండ్, బంగ్లాదేశ్ నుంచి డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేసి నగరానికి తీసుకు వచ్చి బాలాపూర్‌లోని ఫాతీమా మజీద్, రాయల్ కాలనీలో అవసరం ఉన్న వారికి విక్రయిస్తున్నారు.

సిఎల్‌పి నేత ఎంపిక కత్తిమీద సామే

- ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై కసరత్తు
- 16న శాసనసభా పక్ష సమావేశం



మన తెలంగాణ/హైదరాబాద్: సిఎల్‌పి నాయకుడి ఎంపిక రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి కత్తిమీద సాములా మారింది. ఈ పదవికి ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై టిపిసిసి తీవ్ర స్థాయిలో కసరత్తు చేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన గెలిచిన ఎమ్మెల్యేల్లో కొందరు అధికార టిఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే టిఆర్‌ఎస్‌కు చెందిన అగ్ర నాయకులతో వారు సంప్రదింపులు సైతం చేసినట్లుగా అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ అనంతరం వారు ఏ క్షణంలోనైనా టిఆర్‌ఎస్ గూటికి చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది. దీంతో పండుగ అనంతరం పార్టీలో ఎవరు ఉంటారో....ఎంత మంది కాంగ్రెస్‌ను వీడుతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఎవరిని ఎంపిక చేస్తే పార్టీకి ఎలాంటి పరిమాణాలు ఉంటాయోనన్న ఆందోళన టిపిసిసి నేతల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో సిఎల్‌పి నాయకుడి ఎంపిక విషయంలో అచితూచి నిర్ణయం తీసుకోనున్నారు. దీని కారణంగానే సిఎల్‌పి నాయకుడి ఎంపిక విషయంలో టిపిసిసి మరింత జాగ్రత్త పడుతోంది. కాగా ప్రస్తుతం ఈ పదవిని పార్టీ సీనియర్ నాయకుడు, మదిర నియోజకవర్గం నుంచి విజయం సాధించిన భట్టి విక్రమార్క ఆశిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ పదవి కోసం భట్టి ఇప్పటికే టిపిపిసి ఇన్‌ఛార్జీ కుంతియాతో పాటు పలువురు జాతీయ నాయకులను కలుసుకుని వారి ఆశీస్సులు పొందినట్లు తెలుస్తోంది. కాగా సిఎల్‌పి పదవిని మాజీ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు నల్గొండ జిల్లాకు చెందిన మరో సీనియర్ నాయకుడు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి సైతం ప్రధానంగా ఆశిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే కోమటిరెడ్డి బ్రదర్స్, శ్రీధర్‌బాబు టిఆర్‌ఎస్ నేతలతో టచ్‌లో ఉన్నారన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో పెద్దఎత్తున సాగుతోంది. ఈ నేపథ్యంలో సిఎల్‌పి పదవిని భట్టి విక్రమార్కకు అప్పగించాలన్న నిర్ణయానికి టిపిసిసి వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇదే అంశంపై ఈ నెల 16వ తేదీన తలపెట్టిన సిఎల్‌పి సమావేశంలో ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని కూడా తీసుకుని శాసనసభా పక్ష నాయకుడిని ఎంపిక చేయాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోందని సమాచారం.


ఎన్‌ఐఎ కస్టడీకి శ్రీనివాసరావు

మన తెలంగాణ/హైదరాబాద్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఎన్‌ఐఎ కస్టడికి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. కేంద్ర ప్రభుత్వం జగన్‌పై దాడి కేసును ఎపి పోలీసుల నుంచి ఎన్‌ఐఎకు బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది.ఈ నేపథ్యంలో శుక్రవారం నిందితుడు శ్రీనివాసరావును విజయవాడలోని ఎన్‌ఐఎ కోర్టులో హాజరుపరిచారు.ఇంత వరకు జగన్ కేసులోని నిందితుడు శ్రీనివాసరావును కస్టడికి ఇవ్వాలని ఎన్‌ఐఎ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం వారం రోజుల పాటు శ్రీనివాసరావును కస్టడికి అనుతించింది. న్యాయస్థానం కొన్ని షరతులను విధించింది. శ్రీనివాస రావును మూడు రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించి నివేదిక ఇవ్వాలని, నిందితునిపై థర్డ్ డిగ్రి ప్రయోగించకూడని స్పష్టం చేసింది. నిందితుడు కోరితే న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని ఆదేశాలిచ్చింది.

ఆన్‌లైన్‌లో ఓటరు స్లిప్పులు

మన తెలంగాణ/హైదరాబాద్: ఓటరు స్లిప్పులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును నేరుగా టిఎస్‌ఇసి.ఒఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మోక్షం నాలుగు రకాలు



చినజీయర్ స్వామీజీ

మనతెలంగాణ/ సిటీబ్యూరో : జీవుడుకి కర్మబంధం తొలగితే లభించే మోక్షాన్ని నాలుగు రకాలుగా వర్ణించాయి వేదాలు అని, అందులో సాలోక్యం, సారూప్యం, సామీప్యం, సాయుజ్జియం అని ఈ నాలుగు దశలుగా మోక్షం ఉంటుందని ప్రముఖ ఆద్యాత్మిక గురువు శ్రీదండి చిన జీయర్ స్వామీజి చెప్పారు. నగరంలోని నందగిరిహిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో శుక్రవారం 27వ రోజు తన ప్రవచనాలను వినిపించారు. మొట్టమొదట జీవుడు కర్మకృతమైన ఈ లోకాన్ని వదిలి కర్మ సంపర్కం లేని లోకానికి వెళ్తాడని, భగవంతుడు ఎక్కడ ఎప్పుడూ ఓ స్వరూపాన్ని ధరించి ఉంటాడో అక్కడకు జీవుడు చేరుతాడని, ఆలోకాన్ని 'సాలోక్యం' అని సమాన లోకగతుడు అగుట అని అర్థం అంటారని, భగవంతుడు ఏ రూపంలో ఉంటాడో... జీవుడు కూడా ఆ రూపం వస్తుంది దీనిని 'సారూప్యం, లేదా సాధర్మియం' అని అంటారని భగవద్గీతలో దేవుడు తెలిపారని ఆయన వివరించారు. 'మమ సాధర్మియం ఆగత:' అని భగవద్గీతలో స్పష్టం చేశారని, 'స్వర్గేపి న ఉపజాయంతే' స్వర్గమంటే సృష్టి. బ్రహ్మ సృష్టిలోకి జీవుడు రాడని, ఇవన్నీ ప్రళయంలోకి చేరాల్సిందేనని 'ప్రళయే నవ్యదంతి చా' అని ఆయన తెలిపారు. గోపాల చారి స్వామి నా గురువు అని, పరమపదానికి జీవుడు వెళ్ళే ముందు విరజా అనే స్థానం ఉంటుందని, ఆ విరజా స్థానంలోకి చేరగానే సూక్ష్మ శరీరం జీవుడిని వదిలేస్తుందని, జీవుడు వరజా దాటి ఆవలకి చేరుతాడని దానిని భగవంతుడుండే లోకం దీనిని 'నిత్యవిభూతి' యని, ఈవలిదంతా 'లీలావిభూతి' అని అంటారని, జీవుడు నిత్యవిభూతిలోకి చేరగానే ఉత్తర క్షణంలో అమానవా అని ఒక శక్తి విశేషం వీడిని



స్పృశిస్తుందని, దీనితో అతడికి దైవ రూపం వస్తుందని, జీవుడిని స్వాగతించేందుకు అందరూ వస్తారని, ఆలోకంలో రెండు రకాల జీవరాశులుంటాయని ఆయన తెలిపారు. వెరజా తీరానికి భగవంతుడు కూడా వెళ్తాడని అక్కడి రెండు రకాల జీవరాశుల్లో ఒకటి ఎప్పుడూ అక్కడే ఉండే జీవరాశి 'నిత్యసూరులు' అని, రెండవరకం 'ముక్త జీవులు' అని అంటారని, ఈ రెండు రకాల వారు కూడా ఒకే పోలికతో ఉంటారని, జీవుడిని భగవంతుడుండే యోగపీఠం వద్దకు తీసుకెళ్తారని జీయర్ స్వామీ వెల్లడించారు. 'వైకుంఠం పరమపదం మోక్షం' అని ఉపనిషత్తు తెలుపుతుందని ఇదంతా 'సారూప్యం' అంటారని, ఈ సారూప్యం ద్వారా భగవంతుడి వద్దకు జీవుడు సమీపిస్తాడని దీనిని 'సామీప్యం' అని అన్నారని ఆయన తెలిపారు. దేవుడిని ఉపాశన చేస్తారు కానీ, దేవుడి కోసం ఉపాశన చేయరని, అలా చేసేవాడు 'ఆత్మోపాసకుడు' అని, వాడినే కేవలం అల్పమైన ఆత్మానందానికి పరిమితమవుతాడని అతడినే 'కేవలుడు' అని పేరుపెట్టారని, కేవలుడు కోరుకునే స్థితిని 'కైవల్యం' అంటారని, 'కొచిత్ కోణేవ తిష్టతి' అని అన్నారని జీయర్ స్వామీజి తెలిపారు. కైవల్యంలోకి పడితే జీవుడు ఒంటరిగా అనుభవించే అనుభూతి తమకు అవసరంలేదని తిరస్కరిస్తారని అదే కైవల్యమని ఆయన చెప్పారు. ప్రేమ అధికమైతే నియమాలు కిందివి మీదికి మీదివి కిందికి అవుతాయని దీనిని ప్రేమదశ అంటారని, జ్ఞాన దశలో ఎవరి పరిమితిలో వారుంటారని ఆయన వెల్లడించారు. 'అహం అన్నం' అన్నం అంటే అనుభవించేదని, 'అద్యతే అతిచ భూతాని తస్మాత్ అన్నం తదుచ్యతే' అని మనకు వేదం చెప్పుతుందని జీయర్ స్వామీజి విశదీకరించారు.

ధరణి ఒకే



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలోని భూ క్రయ విక్రయాలను నిర్వహించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'ధరణి' వెబ్‌సైట్ దాదాపు ఒక కొలిక్కి వచ్చింది. రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, సిసిఎల్‌ఏ (భూ పరిపాలనాశాఖ చీఫ్ కమిషనర్) వాకాటి కరుణలు శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్ళి భూముల రిజిస్ట్రేషన్లు, మార్పులు చేర్పులు, మ్యుటేషన్ తదితర అంశాలను స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. 'ధరణి' వెబ్‌సైట్ పనితీరుపై ఇద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా చేసిన సవరణలన్నీ ధరణి వెబ్‌సైట్ సెర్వర్‌లో సరిగ్గా నిక్షిప్తమవుతున్నాయో లేదో పరిశీలించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిగి, వికారాబాద్, నకిరేకల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా (పైలట్ పద్ధతిన) వినియోగిస్తున్నామని, దీనిని పరిశీలించిన తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలనుకుంటున్నట్లు రెవిన్యూ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున, భవిష్యత్తులో జరిగే భూ క్రయవిక్రయాలు పారదర్శకంగా వేగంగా జరిగేందుకోసం ధరణి వెబ్‌సైట్‌పై నిర్ణయం తీసుకున్నారని, ఇంతకాలం సాంకేతిక సమస్యలు వెంటాడినందున ఒక్కొక్కటి పరిష్కారమై ఇప్పుడు కొలిక్కి వచ్చిందని, పైలట్ పద్ధతిన అమలవుతున్న తీరును స్వయంగా ఉన్నతాధికారులే పరిశీలించినందున త్వరలోనే రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లోనూ అమల్లోకి వస్తుందని ఆ అధికారి వివరించారు. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత దాదాపు 93% రికార్డుల వివరాలను సక్రమంగా ఉన్నట్లు రెవిన్యూ శాఖ నిర్ధారించడంతో ఇక ఎప్పటికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే విధంగా, ఏ మార్పులు చేర్పులు జరిగినా వెంటనే పట్టాదారు పాస్‌బుక్‌లో కూడా మారే విధంగా 'ధరణి' వెబ్‌సైట్‌ను వినియోగంలోకి తేవాలని భావించి ఐఎల్‌ఎఫ్‌ఎస్ అనే ప్రైవేటు సంస్థకు సాఫ్ట్‌వేర్ తయారీ బాధ్యతలను అప్పగించింది. ఆ విధంగా తయారైన వెబ్‌సైట్ ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే కాకుండా తహసీల్దారు కార్యాలయంలోనూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, బదిలీలు తదితర ప్రక్రియలపై అధ్యయనం చేయగా క్షేత్రస్థాయిలో బ్యాండ్‌విడ్త్ సమస్యలు, ఇంటర్నెట్ స్పీడ్‌తో మరికొన్ని సమస్యలు, పాస్‌వర్డ్‌ను యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు, సెర్వర్‌లో నిక్షిప్తం కాకపోవడం, మార్పులు చేర్పులు జరిగినప్పుడు ఎక్కువ సమయం తీసుకోవడం, చిన్న మార్పుకోసం పదేపదే ఆప్షన్లను అడగడం... ఇలాంటి అనేక సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వాటిని పరిష్కరించడానికి దాదాపు ఏడాది కాలం పట్టింది. ఇప్పుడు వాటన్నింటినీ అధిగమించి పూర్తిస్థాయిలో వెబ్‌సైట్ సిద్ధంగా ఉన్నందున ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలులోకి తేవడంపై స్పష్టత వస్తుందని రెవిన్యూ శాఖ అధికారి పేర్కొన్నారు.

అటల్ మిషన్‌కు మన విద్యార్థులు

మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ స్థాయిలో నీతి ఆయోగ్ నిర్వహించిన 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' పోటీల్లో హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులకు గుర్తింపు లభించింది. అటల్ టింకరింగ్ మారథాన్ 2017 పేరుతో ఆరు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ఒక అంశంలో ఈ ముగ్గురు విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మకతకు గుర్తింపు లభించింది. ఆరు నెలల పాటు జరిగిన జాతీయ స్థాయి ఛాలెంజ్‌లో హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన అద్వైత్ గౌరిశెట్టి, చవ్వాకుల మణికంఠ, మల్లాపూర్ మనీష్‌లు అగ్రి టెక్నాలజీ విభాగంలో తయారు చేసిన యంత్రానికి ఈ గుర్తింపు లభించినట్లు తెలంగాణ ఇన్నోవేటివ్ సెల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ముగ్గురు విద్యార్థులను డెల్ ఇండియా కంప్యూటర్‌ల తయారీ సంస్థ డైరెక్టర్ అలోక్ ఓహ్రి శుక్రవారం సత్కరించారు. వీరికి పది నెలల పాటు డెల్ కంప్యూటర్ సంస్థ సహకారంతో నీతి ఆయోగ్ శిక్షణ ఇప్పిస్తుంది. విద్యార్థులు రూపొందించిన యంత్రాన్ని వినియోగంలోకి తీసుకెళ్ళడంతో పాటు కొన్ని యంత్రాలను తయారుచేసి మార్కెట్‌లో ఏ మేరకు ప్రతిస్పందన వస్తుందో ఈ కాలంలో నీతి ఆయోగ్ పరిశీలిస్తుంది.

శివసాయికి సన్‌షైన్‌లో చికిత్స



మన తెలంగాణ/హైదరాబాద్: పోలియో బాధితుడు శివసాయికి వైద్యసేవలందిస్తామని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చుతుంది. రామగుండానికి చెందిన పోలియోబాధితుడు శివసాయి చేసిన విజ్ఞప్తికి స్పందించి వైద్యసేవల బాధ్యతలను కెటిఆర్‌తీసుకున్నారు. ఈ నేపథ్యంలో భాగంగా బాలుడు శివసాయిని తీసుకుని టిఆర్‌ఎస్ నాయకుడు కట్టెల శ్రీనివాస్ శుక్రవారం సన్‌షైన్ ఆసుపత్రి డాక్టర్ గురువారెడ్డి దగ్గరకు తీసుకువెళ్లారు. శివసాయికి వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్ గురువారెడ్డి ఫిబ్రవరి మొదటివారంలో శస్త్ర చికిత్స చేయనున్నట్లు చెప్పారు. బాలుడు ఖచ్చితంగా నడవగలుగుతాడని గురువారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

టిఆర్‌ఎస్ కార్యకర్తలకు బీమా సౌకర్యం

- గతేడాది 297 కుటుంబాలకు బీమాచెల్లింపు
- ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు పార్టీ భరోసా
- 75 లక్షల సభ్యులతో టిఆర్‌ఎస్ శ్రేణి
- దేశానికి టిఆర్‌ఎస్ ఆదర్శం... కార్యకర్తల సంక్షేమం పార్టీ లక్ష్యం

మనతెలంగాణ/హైదరాబాద్: దేశంలోని రాజకీయ పార్టీలకు టిఆర్‌ఎస్ ఆదర్శంగా నిలిచింది. పార్టీల జెండాలు మోసేందుకు, ఓటుబ్యాంకులుగా కార్యకర్తలను ఉపయోగించుకునే రాజకీయ పార్టీ లకు గుణపాఠం నేర్పే విధంగా టిఆర్‌ఎస్ కార్యకర్తలకు భరోసా ఇస్తూ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. పార్టీ కార్యకర్తల సంక్షేమానికి బీమాను ప్రవేశపెట్టడంతో పాటు ప్రిమియం పార్టీ కట్టి వారి కష్టాల్లో భాగస్వామ్య మవుతుంది. టిఆర్‌ఎస్ కార్యకర్తలను ఆదుకునే బాధ్యతలను పార్టీ తీసుకుంది. పార్టీసభ్యత్వంతో పాటు కార్యకర్తలకు ప్రమాద బీమాను టిఆర్‌ఎస్ వర్తింప చేస్తుంది. 75 లక్షల సభ్యత్వాన్ని నమోదుచేసి చరిత్రసృష్టించిన టిఆర్‌ఎస్ పార్టీశ్రేణుల పై దృష్టి సారించింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు చేస్తూ సభ్యులను బీమాపరిధిలోకి తీసుకువచ్చింది. నియోజకవర్గాల నాయకులు పార్టీ కేంద్ర కార్యాలయానికి 75 లక్షల సభ్యులను చేర్చుకున్నట్లు నివేదికలు, సభ్యత్వ పుస్తకాలు అందించారు. ప్రతి సభ్యునికి ప్రమాద బీమాను కల్పిస్తూ టిఆర్‌ఎస్ అధిష్ఠానం చర్యలు తీసుకుంది. 2018 సంవత్సర ముగింపు నాటికి 43.41,967 మంది సభ్యుల జాబితాను కంప్యూటరీకరించారు. అయితే కంప్యూటర్‌లో పొందుపర్చని వారు సైతం బీమాకు అర్హులుగానే పార్టీ కార్యక్రమాలను రూపొందించింది. కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృత్తి చెందితే బీమాను చెల్లిస్తుంది. నియోజకవర్గాల నాయకులు మృతిచెందిన బాధితకుటుంబాను ఓదారుస్తూ బీమా డబ్బులు ఇవ్వడంతో పాటు వారి సమస్యలను తీర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. ముగిసిన 2018వ సంవత్సరలో వివిధ ప్రమాదాల్లో మృత్తి చెందిన 460 మంది కుటుంబాల నివేదికలను పరిశీలించి బీమా డబ్బులను నియోజకవర్గాల టిఆర్‌ఎస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబాలకు అందిస్తుంది. ఇప్పటివరకు 297 మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున స్థానిక నాయకులు బీమా డబ్బులు ఇచ్చారు. మిగతావారికి మరో 15 రోజుల్లో అందించనున్నట్లు సంబంధిత పార్టీ నాయకులు తెలిపారు. మృతుడికి సంబంధించిన ప్రమాదాల నివేదికలు ఆలస్యం కావడంతోనే మిగతావారికి చెల్లింపులు కొద్దిగా ఆలస్యం అయినట్లు తెలుస్తుంది. టిఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఎంతో గౌరవంగా భావిస్తూ లక్షలాధిమంది కార్యకర్తలు పార్టీబాట పట్టడం దేశంలో తొలిసారిగా భావిస్తున్నారు. ఇప్పటివరకు దేశంలోని రాజకీయ పార్టీలు కార్యకర్తలతో పనులు చేయించుకుని అధికారంలోకి రాగానే మరిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. దేశంలో ప్రధానపార్టీలుగా,జాతీయ పార్టీలుగా గొప్పలు చెప్పుకుంటున్న కొన్నిపార్టీలు ప్రజలకు ఇచ్చేవాగ్దానాల మాదిరిగానే కార్యకర్తలకు హామీలు ఇచ్చారే కానీ ప్రమాదాల్లో వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో టిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ప్రవేశపెట్టిన బీమా తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలమాదిరిగానే దేశానికి దిక్సూచిగా మారింది. టిఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్తలు రోడ్డుప్రమాదాలు, విద్యుత్ షాక్, పాముకాటు, అగ్ని ప్రమాదం, చెట్లపైనుంచి పడటం, పిడుగుపాటు, నీటి ప్రమాదం, రైలుప్రమాదం, బిల్డింగ్ పైనుంచి పడటం, వడదెబ్బ తదితర కారణాలతో మృతి చెందిన మృతుడి కుటుంబానికి బీమా రూ.2 లక్షలు లభించేవిధంగా రూపొందించిన పథకాన్ని పార్టీ అమలుచేస్తుంది. టిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు గౌరవంగా జీవించేందుకు అనేక పథకాలను పార్టీ అమలు చేస్తుందని టిఆర్‌ఎస్ బీమావిభాగం కన్వీనర్ టివిఆర్ శాస్త్రీ తెలిపారు. పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికి బీమా సౌకర్యాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులను అతిత్వరలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. బీమా పథకాన్ని అమలుచేస్తున్న తొలి రాజకీయ పార్టీ టిఆర్‌ఎస్ అని ఆయన తెలిపారు.



శ్రవణం, దంత క్రాంతి

- ఈఎన్‌టి, దంత వైద్య పరీక్షలకు పేర్లు ప్రతిపాదన
- రూ. 3 వేలు ధర పలికే వినికిడి యంత్రాలు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయం
- చెవి, ముక్కు, గొంతు సహా దంత ఉపకరణాలన్నీ ఉచితంగా ఇచ్చే యోచన

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న మరో ప్రతిష్ఠాత్మక పథకం చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టి) పరీక్షలకు 'శ్రవణం' అని, దంత వైద్య పరీక్షలకు 'దంత క్రాంతి' అనే పేర్లను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతిపాదిస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలను త్వరలో జరిగే సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. అయితే ముఖ్యమంత్రి ఈ పేర్లను ఆమోదిస్తారా లేక కొత్త పేర్లను సూచిస్తారా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈఎన్‌టి, దంత వైద్య పరీక్షలను నిర్వహణకు మార్గదర్శకాలు రూపొందించటంపై అధికార యంత్రాంగం తర్జనభర్జన పడుతున్నారు. శిబిరాల నిర్వహణకు ఎంత బడ్జెట్ అవసరమవుతుంది, ఎలాంటి యంత్ర పరికరాలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది, సిబ్బందిని ఎంత మొత్తంలో సమీకరించుకోవాల్సి ఉంటుంది తదితర అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఈఎన్‌టి, దంత వైద్య పరీక్షలను ఎప్పటి నుంచి ప్రారంభించాలన్న దానిపై కూడా అధికారులకు ఇంకా స్పష్టత లేదు. ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా తేదీ ఖరారు అవుతుందని, ఎప్పుడు ప్రారంభించినా తగిన ఏర్పాట్లు చేయడంపై ప్రాథమిక స్థాయిలో చర్చలు జరిపినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఒకరు తెలిపారు. 'కంటివెలుగు' పథకం కింద రీడింగ్ గ్లాసులు, నిర్దిష్ట దృష్టి దోషానికి అనుగుణమైన కళ్లద్దాలను ఉచితంగా ఇస్తున్నట్లే ఈఎన్‌టి, దంత వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి అవసరమైన ఉపకరణాలను కూడా ఉచితంగానే ఇవ్వాలని సర్కారు యోచిస్తోంది. వినికిడి లోపంతో బాధపడేవారికి అవసరమైన ఉపకరణాల ధర బహిరంగ మార్కెట్లో రూ. 2,500 నుంచి రూ. 3 వేల వరకు ఉంటున్నందున ఉచితంగానే ఇచ్చినట్లయితే ప్రభుత్వ ఖజానాపై పడే భారం గురించి ఇప్పటికే చర్చించామని ఆ ఉన్నతాధికారి తెలిపారు. వీటి అవసరం చాలా తక్కువ మందికి ఉంటుంది. కాబట్టి అధునాతన యంత్రాలను సరఫరా చేసే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. కొత్త రకం వినికిడి యంత్రాలు చెవికి బ్లూటూత్ పెట్టినట్లుగానే ఉండే ఉపకరణాల ధర రూ. 3,500 పైగా ఉండొచ్చని పేర్కొన్నారు. యువకులకు వీటి అవసరం ఉంటుందని, సాధారణంగా చెవి పరీక్షలు చేస్తే ఒక శాతం నుంచి రెండు శాతం మందికి వినికిడి లోపం ఉండే అవకాశముందని, ఆ ప్రకారం రాష్ట్రంలో లక్షన్నర మంది వినికిడి లోపంతో బాధపడొచ్చని అంచనా. వారందరికీ వినికిడి యంత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు.



ఆరోగ్యశ్రీ కింద కాక్లర్ ఆపరేషన్లు

చెవికి సంబంధించిన కాక్లర్ ఆపరేషన్ అత్యంత ఖరీదైన వ్యవహారం. ప్రైవేటు ఆసుపత్రుల్లో దీనికి రూ. 6 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే అటువంటి సమస్య ఉన్నవారికి ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చి ఉచితంగానే చేయాలనే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం కంటి వెలుగు కింద చేసే క్యాటరాక్ట్ ఆపరేషన్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంధత్వ నివారణ పథకం నిధుల ద్వారా జరుగుతున్నాయి. కాబట్టి ఏదో ఒక పథకం పరిధిలోకి తీసుకొచ్చి చేయాలనేది సర్కారు ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇటీవల రెండు దశల్లో ఈఎన్‌టి, దంత పరీక్షల పైలెట్ ప్రాజెక్టును నిర్వహించారు. ఆ రెండు దశలు కూడా రెండు విధాలుగా నిర్వహించారు. వాటి నుంచి వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి కొన్ని నిర్ణయాలు తీసుకొంటున్నట్టు తెలుస్తోంది. అలాగే గొంతు క్యాన్సర్ల చికిత్స కూడా కీలకమైంది. వీటిని కూడా ఆరోగ్యశ్రీ ద్వారా కానీ ఇతరత్రా పద్ధతుల ద్వారా కానీ చేయాలని భావిస్తున్నారు. పొగ తాగే వారిలో కొందరికి గొంతు క్యాన్సర్లు సాధారణమైంది. కాబట్టి వీటిపైనా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇక దంత సమస్యలకు సంబంధించి పుచ్చిపోయిన పళ్లను తీయడం, కొత్త వాటిని పెట్టడం చేయాల్సి ఉంటుంది. అయితే ఇవన్నీ కూడా గ్రామాల్లో చేసే పరిస్థితి ఉండదు. వాటినీ నిర్దేశించిన ఆసుపత్రులకు రిఫర్ చేయాలని భావిస్తున్నారు. అందు కోసం ఆయా ఆసుపత్రులతో ఒప్పందం చేసుకోనున్నారు. ఆమేరకు వారిని పిలిపించి మాట్లాడుతున్నారు.

ఆదాయంలోనూ తనదైన స్టాంప్

- అంచనాలకు మించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం
- తొమ్మిది నెలలు...11 లక్షల రిజిస్ట్రేషన్లు
- రూ.4,800 కోట్ల ఆదాయం
- మార్చి వరకు మరో రూ.2 వేల కోట్లు రానున్నట్టు అంచనా

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆదాయంలోనూ, డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేయడంలోనూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసికాల్లో (9 నెలల వ్యవధిలో) రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 4,800 కోట్ల మేర ఆదాయం సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే తొమ్మిది నెలల కాలానికి రూ. 3,376 కోట్ల ఆదాయం మాత్రమే లభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇరవై శాతం వృద్ధి నమోదైనట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ చిరంజీవులు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో 201415 ఆర్థిక సంవత్సరంలో ఏడున్నర లక్షల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయని, ప్రభుత్వానికి రూ. 2,750 కోట్ల మేర ఆదాయం వచ్చిందని తెలిపారు. ఆ స్థితి నుంచి ఇప్పుడు రాష్ట్రం పురోగతి సాధించిందని, మరో మూడు నెలల్లో సుమారు రెండు వేల రిజిస్ట్రేషన్ల ద్వారా ఇంకా రూ. 2000 కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. గతేడాది మార్చిలో బడ్జెట్ సమర్పించే సమయానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.5,000 కోట్ల రాబడి వస్తుందని అంచనా వేశామని, అయితే దానికంటే అధికంగానే రెవిన్యూ సమకూరుతుందని సంతోషం వ్యక్తం చేశారు. వార్షిక బడ్జెట్ అంచనాల్లో ఇప్పటికే 85 శాతం సాధించామని, రానున్న మూడు నెలల్లో ఇంకా పెరుగుతుందని, వందశాతం లక్ష్యాన్ని అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, హైదరాబాద్ జిల్లాల్లోనే ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగాయని, ఆదాయం కూడా ఈ జిల్లాల నుంచే ఎక్కువగా వచ్చిందని పేర్కొన్నారు.





గత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,200 కోట్ల ఆదాయం

గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి (పన్నెండు నెలల కాలం) తమ శాఖ ద్వారా రూ. 5,200 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని, 11.50 లక్షల డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయని, కానీ ఈ లక్ష్యాన్ని దాదాపుగా ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాల్లోనే సాధించామని వ్యాఖ్యానించారు. గత ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలల కాలానికి 10.86 లక్షల వరకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, రూ.3,376 కోట్లు మాత్రమే సమకూరినట్టు తెలిపారు. మూడేళ్లుగా వ్యవసాయ భూముల్లో పెట్టుబడి పెట్టిన వారు చాలామంది 300 నుంచి 400 శాతం, స్థలాలు కొన్నవారు 100 నుంచి 200 శాతం రాబడి సాధించినట్లు తెలిపారు. మిగతా నగరాలతో పోలిస్తే హైదరాబాద్ చుట్టుపక్కల నుంచే ఈ శాఖకు అధికంగా రాబడి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ. 1,938 కోట్ల మేర ఆదాయం వచ్చిందని, ఆ తర్వాతి స్థానాల్లో మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలు ఉన్నాయని చిరంజీవులు తెలిపారు.

ఆర్థిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎడిజి జితేందర్

మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో నిత్యం వెలుగుచూస్తున్న ఆర్థిక నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎడిజి జితేందర్ వివరించారు. అనతికాలంలో తమ సొమ్మును రెట్టింపు చేసుకోవాలనుకునే వారిని టార్గెట్ చేసుకుని మల్టీలెవల్ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయని 'మన తెలంగాణ ప్రతినిధి' కి తెలిపారు. ఇటీవల కాలంలో మల్టీలెవల్ మార్కెటింగ్, హీరాగోల్డ్ ఫైనాన్స్, మనీ సర్క్యులేషన్, కరక్కాయ, మునక్కాయ,ఆన్‌లైన్ వ్యాపారం తదితర మోసాలకు సామాన్య ప్రజలు గురవుతున్నారన్నారు. గతంలోనూ కరక్కాయ, మునక్కాయ స్కీంల పేరిట కోట్లాది రూపాయలు మోసం చేసిన సంస్థలపై దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు భరోసా కల్పించామన్నారు. తాజాగా క్యూనెట్ పేరిట నిరుద్యోగులను ట్రాప్ చేసి చైన్ సిస్టమ్ ద్వారా ప్రైజ్ మనీ, కమీషన్లు వస్తాయని నమ్మించి కోట్లాది రూపాయలు మోసం చేశారన్నారు. నిరుద్యోగులు, నిరక్షరాస్యులకు డబ్బు ఆశ చూపి సులభంగా డబ్బు సంపాదించవచ్చని, ఎఫ్‌ఎంఎల్‌సీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని, సభ్యులను చేర్పిస్తే కమీషన్ వస్తుందని ఆశపెట్టి పెద్ద ఎత్తున దోచుకుంటున్నారని ఆయన తెలిపారు. అలాగే అధిక శాతం వడ్డీ చెల్లిస్తామని వినియోగ దారులకు ఎరవేస్తూ హీరాగోల్డ్ దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడిందన్నారు. హైదరాబాద్ నగరంలో రోజుకో మోసం వెలుగు చూస్తున్నా సామాన్యులు మోసపోతూనే ఉన్నారన్నారు.

సిబిఐతో వికృత క్రీడ!


సంపాదకీయం

సుప్రీంకోర్టు తీర్పుతో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) డైరెక్టర్‌గా తిరిగి నియమితుడైన తర్వాత రెండు రోజుల్లోనే అలోక్ వర్మను మళ్లీ తొలగించడం, తనకిచ్చిన కొత్త పదవిలో చేరడానికి నిరాకరించి ఆయన రాజీనామా చేయడం దేశ నేర శోధన వ్యవస్థకు మాయని మచ్చగా నిలిచిపోతుంది. ఇందుకు బాధ్యత ఎవరిదయినప్పటికీ కీలకమైన ఒక అత్యున్నత సంస్థ ఇలా వీధినపడి భ్రష్టుపట్టిపోవడం, ఈ పరిస్థితి తల ఎత్తకుండా దానిని కాపాడేవారు కరువవ్వడం ఎంతైనా బాధ కలిగించే అంశం. దేశంలో నేర దర్యాప్తు రంగానికి శిఖర సమానమైన సంస్థ, ఎక్కడ ఏ అక్రమం, అవినీతి, ఉల్లంఘన జరిగినా దాని లోతులు తవ్వి సత్యాన్ని నిక్కచ్చిగా వెలికితీసే గురుతర బాధ్యత కలిగిన ఒక చక్కని నిర్మాణం ఈ విధంగా దాని అగ్రాధినేతల మీదనే అవినీతి ఆరోపణలతో చెదలుపట్టి అప్రతిష్ఠ మూటకట్టుకోవడం కంటే శోచనీయం వేరొకటి ఉండదు. రెండున్నర మాసాలకు పైగా నిర్బంధ సెలవు అనుభవించిన అలోక్ వర్మను తిరిగి సిబిఐ డైరెక్టర్‌గా నియమించినప్పుడు సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి రాని ఆయన అవినీతికి సంబంధించిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) నివేదికాంశాలు ఉన్నత నిర్ణయాధికార సంస్థ (హైపవర్డ్ కమిటీ) భేటీలోనే బహిర్గతం కావడం, దాని ఆధారంగా ఆయనను సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించి అగ్నిమాపక దళ డైరెక్టర్ జనరల్‌గా నియమించడంలోని ఔచిత్యం ఏమిటనేదానికి వివరమైన సమాధానం ఆవశ్యకత కలుగుతున్నది. సివిసి నివేదికాంశాలు సుప్రీంకోర్టుకు తెలియవా? తెలుసుకోడానికి తగిన ప్రయత్నం జరగలేదా ? అనే ప్రశ్నలు సహజం.

అలోక్ వర్మ పునర్నియామకానికి అర్హుడని నిర్ధారణకు వచ్చినందువల్లనే కదా సుప్రీంకోర్టు ఆయనకు తిరిగి ఆ పదవి చేపట్టే అవకాశమిచ్చింది. మరి అంతలోనే, ఆయన పదవీ కాలం ముగియనున్న ఈ నెలాఖరువరకైనా ఆగకుండా ఎందుకు తొలగించినట్టు? వర్మ అవినీతిపరుడనే నిర్ధారణకు హైపవర్డ్ కమిటీ వచ్చినదే నిజమైతే అటువంటి వ్యక్తిని మరో అత్యున్నత బాధ్యతాయుత పదవిలో ఎందుకు నియమించినట్టు? చూసేవారికి ఇది కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆడుకున్న వినోద క్రీడ అనే మాదిరి అభిప్రాయం కలిగి ఉంటే ఆక్షేపించవలసిందేముంది? బిజెపి పార్లమెంటు సభ్యులు సుబ్రహ్మణ్యన్ స్వామి స్వయంగా రంగంలోకి దిగి అలోక్ వర్మను తొందరపడి తొలగించవద్దు, తప్పుడు న్యాయ సలహాలను విని మరో తప్పు చేయొద్దు అని ప్రధాని నరేంద్ర మోడీకి గురువారం నాడే సలహా ఇచ్చారు. అలోక్ వర్మ పై ఆరోపణలు చేసిన మాజీ అడిషనల్ డైరెక్టర్ రాకేశ్ అస్థానా ఇచ్చిన సమాచారం ఆధారంగానే సివిసి నివేదికను వండిందని కూడా స్వామి అన్నారు.

సుప్రీంకోర్టు సూచించిన మేరకు వర్మ భవిష్యత్తును నిర్ణయించడానికి హైపవర్డ్ కమిటీని సమావేశపరచడం వరకు కేంద్ర ప్రభుత్వం సవ్యంగానే నడుచుకున్నది. సిబిఐ డైరెక్టర్ నియామకం, తొలగింపు లేదా సెలవు మీద పంపడం వంటి చర్యలేవైనా తీసుకునే అధికారం హైపవర్డ్ కమిటీకి మాత్రమే ఉంటుందని, ప్రభుత్వం నేరుగా నిర్ణయం గైకొనడానికి వీలులేదని సుప్రీంకోర్టు గీసిన గిరిని ప్రభుత్వం గౌరవించడం ముదావహం. అయితే సుప్రీంకోర్టు ఎవరి నియామకాన్నైతే కొట్టివేసిందో అదే నాగేశ్వర్ రావును తిరిగి ఇన్‌చార్జ్ సిబిఐ డైరెక్టర్‌ను చేయడం, ఆయన బాధ్యతలు చేపట్టగానే అలోక్ వర్మ చేసిన బదిలీలన్నింటినీ రద్దు చేయడం వంటి చర్యలు ప్రతీకార ధోరణినే రుజువు చేస్తున్నాయనే అభిప్రాయానికి తావిస్తున్నాయి. సాక్షాత్తు దేశ ప్రధాని ఆధ్వర్యంలో జరిగిన హైపవర్డ్ కమిటీ భేటీ నిర్ణయాలు ఒకింత హుందాగా, ఆదర్శనీయంగా ఉంటే బాగుండుననే భావన కలగడం ఎంతైనా సహజం. అసలీ వివాదమే అలోక్ వర్మ, అస్థానాల మధ్య విభేదాల నుంచి అంకురించినట్టుగా రూపు కట్టించారు. అస్థానా గతంలో దేశ అత్యున్నత అధికార పీఠంలోని వారి కనుసన్నలలో నడుచుకున్నవాడనే విమర్శ కూడా ఒక దశలో వినిపించింది. ఈ నేపథ్యంలో హైపవర్డ్ కమిటీ నిర్ణయం మరింత మెరుగ్గా వెలువడి ఉంటే బాగుండేదేమోనని అనిపిస్తే తప్పు పట్టవలసిన పని లేదు. సిబిఐ వంటి మచ్చలేకుండా ఉండవలసిన వ్యవస్థకు ఇంత బురద అంటడం, పాలకులు దానిని మరింత మురికి చేశారనే భావనకు చోటివ్వడం ఆందోళనకరం. సిబిఐ అధినేతను నిర్దాక్షిణ్యంగా తొలగించడం దాని 55 ఏళ్ల చరిత్రలో ఇది తొలిసారి కావడమే దేశ నాయకత్వాన్ని బోనులో నిలబెడుతున్న అంశం.

అగ్నిగుండం మీద అస్సాం!



బిజెపి మిత్రపక్షాలను వరుసగా కోల్పోతోందా? నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ నుంచి మరో మిత్రపక్షం తప్పుకుంది. అస్సాం గణసంగ్రామ్ పరిషద్ ఎన్‌డిఎతో తెగతెంపులు చేసుకుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ బిల్లును అస్సాం గణసంగ్రామ్ పరిషద్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ వివాదాస్పద బిల్లు బిజెపికి దాని మిత్రపక్షాలకు మధ్య విభేదాలకు దారి తీసింది. ఈ బిల్లు 1985 అస్సాం ఒప్పందానికి విరుద్ధమైందని, దాని అతిక్రమించడమేనని అస్సాం గణసంగ్రామ్ పరిషద్ విమర్శిస్తున్నది. ఈ బిల్లును పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదిక సమర్పించింది. కమిటీ ఎలాంటి మార్పులను సూచించలేదు. దాదాపు యథాతథంగా బిల్లును ఒప్పుకుంది.

ఎన్‌డిఎ ప్రభుత్వం 2016 జులై 19వ తేదీన ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ప్రకారం అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాల నుంచి వచ్చే శరణార్థుల్లో హిందువులు, శిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు భారత పౌరసత్వం లభిస్తుంది. ముస్లిములకు మాత్రం లభించదు. అస్సాంలో జాతీయ పౌరుల జాబితాను తాజా పరుస్తున్న నేపథ్యంలో ఈ బిల్లు వచ్చింది.

చూపు

మార్చి 24, 1971 తర్వాత అస్సాం వచ్చిన అక్రమ శరణార్థులను గుర్తించడానికి ఈ కసరత్తు చేపట్టారు. ఇప్పుడు లక్షలాది మందిని గుర్తించారు. ఈ బిల్లు చట్టమైతే, అనుమానాస్పద పౌరులుగా గుర్తించిన వారిలో చాలా మందికి పౌరసత్వం లభిస్తుంది. అస్సాంలో ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందూ శరణార్థులకు పౌరసత్వం లభిస్తుంది.

బిజెపి హిందుత్వ రాజకీయాలకు ఈ బిల్లు ఎంతో అవసరం. కాబట్టి ఎప్పటి నుంచో ఈ చట్టం తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. బిజెపి ఓటు బ్యాంకును సంతృప్తి పరచడానికి, తాము చెప్పిన మాటలు నిలబెట్టుకుంటున్నామని చెప్పుకోడానికి ఈ చట్టం అవసరం. అన్నింటికి మించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు సంతృప్తి కలిగించే చర్య ఇది. పైగా ఈ బిల్లు చట్టమైతే బంగ్లాదేశ్ నుంచి హిందూ శరణార్థులు ఇంకా రావచ్చు. వారికి పౌరసత్వం లభిస్తే వారంతా బిజెపి ఓటు బ్యాంకుగా మారుతారు. కాబట్టి రాజకీయ ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఈ బిల్లు అస్సాం ఒప్పందానికి పూర్తిగా విరుద్ధమైనదని అస్సాం గణసంగ్రామ్ పరిషద్ వాదిస్తోంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చే అక్రమ శరణార్థులు వారి మతమేదైనా సరే అనుమతించరాదని వాదిస్తుంది. అస్సాంలో అక్రమ శరణార్థుల సమస్యపై తీవ్రమైన ఉద్యమం నడిచింది. ఆరేళ్ళపాటు నడిచిన ఈ ఉద్యమం చివరకు 1985లో అస్సాం ఒప్పందం రూపంలో ఒక పరిష్కారాన్ని సాధించింది. ఆ ఉద్యమ నాయకులే అస్సాం గణ సంగ్రామ్ పరిషద్ స్థాపించారు. కాబట్టి శరణార్థులు ఏ మతం వారయినా అస్సాం గణసంగ్రామ్ పరిషద్ ఒప్పుకునే ప్రసక్తి ఉండదు. అందువల్ల అది బిజెపితో మైత్రి కొనసాగించడం కష్టమైంది.

ఈ సమస్య అస్సాంలో చాలా సున్నితమైనది. అస్సామేతరులు అన్న సమస్యపైనే దశాబ్దాలుగా ఇక్కడి రాజకీయాలు నడుస్తున్నాయి. అస్సామేతరులు అన్న విషయంలో ఏ మతం వారన్న విచక్షణ లేదు. అస్సాం స్థానికులు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అస్సాం మాత్రమే కాదు నిజానికి ఈశాన్య రాష్ట్రాల్లోని వివిధ తెగలు తమ ప్రత్యేక గుర్తింపును, తమ ప్రాంతంలో జనాభా స్వరూపాన్ని మార్చడానికి ఇష్టపడడం లేదు. బయటివారు రావడం వల్ల ఇక్కడ జనాభా తూకం దెబ్బతింటుందన్న భయాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.


సిల్చార్‌లో జరిగిన ఒక ర్యాలీలో నరేంద్ర మోడీ ఈ బిల్లు తీసుకొస్తామని గట్టిగా చెప్పారు. దేశ విభజన కాలంలో జరిగిన పొరబాట్లను సవరించడానికి ఈ బిల్లు అన్నారు. అస్సాంలో బిజెపి సీనియర్ నాయకుడు హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ ఈ బిల్లు రాకపోతే కనీసం 17 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జిన్నాలు గెలుస్తారని చెప్పాడు. ఈ వ్యాఖ్యలోని మతతత్వ కోణం గమనించదగింది. అస్సాంలో ముస్లిం జనాభా చాలా ఎక్కువగానే ఉంది. కాబట్టి బంగ్లాదేశ్ నుంచి వచ్చిన, లేదా వచ్చే బెంగాలీ హిందువులను పౌరులుగా అనుమతించడం వల్ల ముస్లిం ఓట్ల ఆధిక్యాన్ని తగ్గించవచ్చు. ఈ ఓట్లన్నీ బిజెపికే పడతాయి కాబట్టి దానికిది ఎన్నికల్లో లాభిస్తుంది. ఈ లెక్కలే ఈ బిల్లు వెనుక ఉన్నాయి. ఈ వ్యాఖ్య తర్వాతనే అస్సాం గణ సంగ్రామ్ పరిషద్ ఎన్‌డిఎ నుంచి తప్పుకుంది. ఎందుకంటే, ఈ బిల్లు పెద్ద సంఖ్యలో బెంగాలీ హిందువులకు అస్సాంలో శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఇస్తుంది. అస్సాం మాజీ ముఖ్యమంత్రి ప్రఫుల్ల కుమార్ మహంతా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రకటన చేశారు. బిజెపితో మైత్రి వల్ల దానికే లాభిస్తుంది కాని తమకెలాంటి లాభం లేదని ఈ పార్టీలు గుర్తిస్తున్నాయి.

ప్రస్తుతం 126 స్థానాలున్న అస్సాం అసెంబ్లీలో బిజెపికి 61 స్థానాలున్నాయి. అస్సాం గణసంగ్రామ్ పరిషద్ బలం కేవలం 14 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. కాబట్టి అస్సాం గణసంగ్రామ్ పరిషద్ తప్పుకోవడం వల్ల బిజెపికి వచ్చిన ప్రమాదమేమీ లేదు. పైగా బిజెపికి ఇతర మిత్రపక్షాలున్నాయి. ఈ చట్టం వస్తే పశ్చిమబెంగాల్లో బిజెపి అవకాశాలు మెరుగవుతాయి. దాదాపు కోటి ఓట్లు బిజెపి గంపలో పడతాయని కొందరి అంచనా. అస్సాంలో పౌరుల జాబితా రూపొందించిన కార్యక్రమం వల్ల బెంగాలీ హిందువులు బిజెపికి దూరమయ్యారు. ఇప్పుడు ఈ చట్టం వస్తే ఈ బెంగాలీ హిందువులందరూ బిజెపికి జై కొడతారు. ఈ చట్టం వస్తే ఇక పౌరుల జాబితా విషయంలోనూ సమస్య ఉండదు. పౌరుల జాబితాలో ఇప్పుడు పేరు లేని హిందువులు, శిక్కులు తదితర ముస్లిమేతర మత సముదాయాలన్నిటికీ ఆటోమేటిగ్గా పౌరసత్వం లభిస్తుంది. వారెలాంటి పత్రాలు చూపించవలసిన అవసరం లేదు. నిజం చెప్పాలంటే ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటులనేవి లేవు. ఈ మాట స్వయంగా బిజెపి ప్రతినిధి స్వప్నానిల్ బారువా చెప్పాడు. గత పదేళ్ళుగా బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటులేవీ లేవు.

బంగ్లాదేశీలు ఇప్పుడు ఇండియాకు రావడం లేదు. అయినా ఈ పౌరసత్వ బిల్లు అవసరమేమొచ్చింది. కొత్తగా బంగ్లాదేశీలను ఆహ్వానించి పౌరసత్వం కట్టబెట్టడానికా అనే అనుమానాలు పుడుతున్నాయి. భారత రాజ్యాంగంలోని అధికరణ 14కు వ్యతిరేకమైన ఈ బిల్లు న్యాయస్థానంలో నిలబడుతుందా అంటే అనుమానమే. ఈ అనుమానాల నేపథ్యంలో అస్సాంలో ఆందోళనలు మిన్నంటుతున్నాయి. కాని ఈ బిల్లు వల్ల ఈశాన్య రాష్ట్రాల్లో మరోసారి అగ్గి రాజుకునే పరిస్థితులు కనబడుతున్నాయి. అస్సాం గణ సంగ్రామ్ పరిషద్ ఎన్‌డిఎ నుంచి తప్పుకుంది. ఎన్‌డిఎ నుంచి వరుసగా ఒకటి తర్వాత ఒకటిగా పార్టీలు బయటకు రావడం ఇటీవల ఎక్కువైంది. తెలుగు దేశం ఇంతకుముందు తప్పుకుంది. బీహారులో రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ ఎన్డీయే నుంచి బయటకు వచ్చింది. శివసేన, బిజెపి ఎడముఖం పెడముఖంగానే ఉన్నాయి. మరోవైపు ప్రతిపక్షాల సమైక్యతకు ప్రయత్నాలు గట్టిగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికలు ఆసక్తికరంగా మారతాయని చెప్పవచ్చు.

* ఆయేషా

బిజెపికి రాజకీయ సహారా



టంకశాల అశోక్
9848191767

బిజెపికి తెలంగాణ ఒక రాజకీయ సహారా ఎడారి. ఆ ఎడారిలో వారు తమ సుదీర్ఘమైన యాత్రను ప్రారంభించి చాలా కాలమైంది. ఇటీవలి అసెంబ్లీ ఫలితాలు ఆ యాత్రలో ఒక మజిలీ మాత్రమే. నాలుక పిడచకట్టుకుపోతున్న ఈ దుర్భర యాత్ర నుంచి వారికి విముక్తి లభించే సూచనలు సమీప భవిష్యత్తులో కన్పించటం లేదు. వారిని ఈ స్థితి నుంచి గట్టెక్కించగల శక్తియుక్తులు ఆ పార్టీ కేంద్ర నాయకత్వానికి కూడా లేవని స్పష్టమైపోయింది. కనుక వారిట్లా ఎడారి మోడు మనుగడ సాగించవలసిందే. ఇది పూర్తిగా వారి స్వయంకృతం.

ఈసారి జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తమ స్థానాలు 2014 నాటి 5 కన్న చాలా గొప్పగా కాకపోయినా తగినన్ని పెరగగలవని బిజెపి అంచనా వేసుకుంది. టిఆర్‌ఎస్‌పట్ల ప్రజల వ్యతిరేకత బాగా ఉందని, కనుక ఆ పార్టీకి స్వంత మెజారిటీ రాదని, బహుశా మజ్లిస్ మద్దతు ఇచ్చినా చాలదని, ఆ స్థితిలో తమ మద్దతు తప్పనిసరి కాగలదని వారనుకున్నారు. అపుడు షరతులు విధించి చక్రం తిప్పవచ్చునని ఆశించారు. ఒక వేళ టిఆర్‌ఎస్‌కు మెజారిటీ రాక, మజ్లిస్ మద్దతు కూడా చాలనట్లయితే రాజకీయాలు ఏ విధంగా సాగేవీ చెప్పలేముగాని, చివరకు ఒకవైపు టిఆర్‌ఎస్‌కు గొప్ప మెజారిటీ లభించగా బిజెపికి 5 సీట్లు 1కి తగ్గి తీవ్రమైన ఎదురు దెబ్బ తగిలింది. ఆ విధంగా అన్ని అంచనాలు తలకిందులయాయి. ఆ పార్టీ పోయిన మారు గెలిచిన సభ్యులందరిని తిరిగి నిలబెట్టటంతోపాటు, కొత్తగా టికెట్లు ఇచ్చిన వారిలో పలువురు గట్టివారే. అయినప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. తమ బద్ధ శత్రువులైన మజ్లిస్ కన్న తక్కువ స్థానంలో ఉండటమనే న్యూన స్థితిని ఈసారి పోగొట్టుకోవాలని, అధికార పక్షానికి మజ్లిస్ కన్న తాము ముఖ్యులం కావాలని ఆశించగా అదేమీ నెరవేరలేదు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తమ స్థానాలు 2014 నాటి 5 కన్న చాలా గొప్పగా కాకపోయినా తగినన్ని పెరగగలవని బిజెపి అంచనా వేసుకుంది. టిఆర్‌ఎస్‌పట్ల ప్రజల వ్యతిరేకత బాగా ఉందని, కనుక ఆ పార్టీకి స్వంత మెజారిటీ రాదని, బహుశా మజ్లిస్ మద్దతు ఇచ్చినా చాలదని, ఆ స్థితిలో తమ మద్దతు తప్పనిసరి కాగలదని వారనుకున్నారు. అపుడు షరతులు విధించి చక్రం తిప్పవచ్చునని ఆశించారు. ఒకవేళ టిఆర్‌ఎస్‌కు మెజారిటీ రాక, మజ్లిస్ మద్దతు కూడా చాలనట్లయితే రాజకీయాలు ఏ విధంగా సాగేవీ చెప్పలేముగాని, చివరకు ఒకవైపు టిఆర్‌ఎస్‌కు గొప్ప మెజారిటీ లభించగా బిజెపికి 5 సీట్లు 1కి తగ్గి తీవ్రమైన ఎదురు దెబ్బ తగిలింది. ఆ విధంగా అన్ని అంచనాలు తలకిందులయాయి. ఆ పార్టీ పోయిన మారు గెలిచిన సభ్యులందరిని తిరిగి నిలబెట్టటంతోపాటు, కొత్తగా టికెట్లు ఇచ్చిన వారిలో పలువురు గట్టివారే.

దీనంతటి నుంచి మనకు అర్థమయే విషయాలు అనేకం ఉన్నాయి. బిజెపికి తెలంగాణలో సరైన పునాది అంటూ గతంలో లేదు, ఇప్పటికీ లేదు. ఒక పార్టీకి పునాది ఏ విధంగా ఏర్పడుతుంది? వారి సిద్ధాంతాలు, ఆచరణలు ఏవో కొన్ని ప్రజా వర్గాలకు తమ ప్రయోజనాల రీత్యా, సమస్యల రీత్యా ఆకర్షణీయం కావాలి. ఆ పార్టీ నాయకత్వాలు సమర్థమైనవి, వ్యూహాలూ ఎత్తుగడల రీత్యా శక్తియుక్తులు గలవి, కష్టించి పనిచేసేవి, ఆలోచనలను అమలు పరచగలవి, పార్టీని వెంట తీసుకుపోగలవి, పార్టీ శ్రేణులకు స్ఫూర్తి కలిగించగలవి అయి ఉండాలి. దీనితోపాటు తగిన ఆర్థిక వనరులు ఉండాలి. ఇవి ఉన్నపుడు ఒక పునాది ఏర్పడటం, బలపడటం, విస్తరించటం జరుగుతుంది. అందుకు అనుగుణంగా పార్టీ కార్యకలాపాలు నిరంతరం వట్టి మాటలలోగాక క్షేత్ర స్థాయిలో సాగుతుండాలి.

ఇటువంటివి బిజెపికి లేవు. ఆ పార్టీ జనసంఘ్ రూపంలో ఉండి, తెలంగాణలో ప్రధానంగా మతపరమైన అంశాలు, వ్యూహాలు కలిసి వచ్చిన దశలో, హైదరాబాద్‌తోపాటు కొన్ని తెలంగాణ జిల్లాలలో నిజాం కాలపు మత కార్యకలాపాల వారసత్వాలు కూడా కలిసి వచ్చినందున, కొంత ఓట్ల పునాది ఉండేది. కాని అందుకు దోహదం చేసిన పరిస్థితులు ఏవీ లేక ఆ పునాది క్రమంగా బలహీనపడింది. 1980ల నుంచి ఆరంభించి ఒక వైపు టిడిపితో మైత్రి, మరొక వైపు వాజపేయి ప్రభావం, అప్పటి తరం తెలంగాణ బిజెపి నాయకుల శ్రమించే తత్వం వంటివి కలిసి రాగా తిరిగి ఒక వెలుగు వెలిగింది. కాని గమనించవలసిన కీలకమైన విషయం ఏమంటే, ఈ రెండవ దశది స్వయం ప్రకాశం కన్న చాలా ఎక్కువగా, పరిస్థితులు కలిసి వచ్చినందువల్ల కన్పించిన ఉపగ్రహపు వెలుగులే. కాని నిజమైన సమస్య మరొకటి ఉంది. నాయకత్వం కలది అయితే అట్లా కలసి వచ్చిన పరిస్థితులను అవకాశంగా మార్చుకుని పార్టీ పటిష్టతకు, విస్తరణకు పాటుపడుతుంది.

అటువంటి సానుకూల పరిస్థితులు తెలంగాణ బిజెపికి అనండి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపికి అనండి సుమారు 20 సంవత్సరాల పాటు ఉండేవి. అది ఎంత మాత్రం తక్కువ కాదు. వారు ముఖ్యంగా వాజపేయి హయాంను సద్వినియోగపరచుకుంటూ పార్టీని శక్తివంతం చేయగలమని అంటుండేవారు కూడా. కాని, వాజపేయి దశ ముగిసిన తర్వాత వెనుకకు తిరిగి సమీక్షించిన వారికి అటువంటి జాడ లేమీ కన్పించలేదు. సరి కదా, అపుడు లభించిన అవకాశాల మధ్య సంపాదనలు, అధికార కాంక్షలు, గ్రూపు రాజకీయాలు ప్రబలిపోయాయి. ఒకటో నాలుగో సీట్లకోసం, ఇతర వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇక్కడ టిడిపిని ఆశ్రయించటం ఒక సంప్రదాయంగా మారింది. మూలాలకు చెదలు పట్టాయి. సాక్షాత్తూ కార్యకర్తలు, అభిమానులకు పార్టీ నాయకత్వంపట్ల విశ్వాసం సడలిపోవటం మొదలైంది. పరిస్థితి దిద్దుబాటుకు సంఘ్ పరివార్ ప్రయత్నాలు ఏవో చేసినట్లున్నదిగాని అవి ముందుకు సాగలేదు. బిసిని అధ్యక్షుడిని చేసినా ఉపయోగపడలేదు. శూన్యం ఏర్పడింది. మరొక మాటలో అది ఒక ఎడారి స్థితి అయింది.

ఇదంతా స్థానిక నాయకత్వపు స్వయం కృతం కాగా, ఆదశలో బిజెపి జాతీయ నాయకత్వం పెద్దగా పూనుకున్నదీ లేదు. టిడిపితో వారి అవసరాలు అందుకు కొంత అవరోధమయాయి. ఈ పరిస్థితులు తెలంగాణ రాష్ట్రానికి తమ మద్దతు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభావం, ఆయన పరిపాలనలో జరగగలదని ఆశించిన మంచివల్ల మారిపోగలవని తెలంగాణ బిజెపి నాయకత్వం ఇటీవలి దశాబ్ద కాలంలో నమ్మకం పెట్టుకుంది. గమనించదగింది ఏమంటే, ఒకవేళ అటువంటిది ఏమైనా జరిగినా అది తిరిగి ఉపగ్రహం పద్ధతిలో బయటి కాంతులపై ఆశలు పెట్టుకోవటమే తప్ప తెలంగాణలో స్వయం కృషి ద్వారా స్వంత పునాదులను బలపరచుకోవటం కాదు. అనగా ఉపరితల స్థాయిలో అరకొర ప్రయోజనాలు ఏవైనా సిద్ధించినా, మౌలికంగా ఎడారి పరిస్థితి కొనసాగటమేనన్న మాట.

ఇంతకూ చివరకు ఏమీ జరగనే లేదు. 2014 ఎన్నికలలో తెలంగాణకు తమ మద్దతుగాని, మోదీ ప్రభావం గాని కలసి రాలేదు. ఆ వెనుక జిహెచ్‌ఎంసి ఎన్నికలు ఎడారిలో వడగాలివలె మారాయి. ఇటు వంటి అనుభవాలు వరుసగా ఎదురవుతున్నా బిజెపి తీరు సుతరామూ మారలేదు. దాని పర్యవసానమే ఇపుడీ అసెంబ్లీ ఫలితాలు. అధికార పక్షానికి మెజారిటీ వస్తుందా రాదా, తమ అవసరం ఉంటుందా లేదా, సోకాల్డ్ చక్రం ఎట్లా తిప్పాలి, మతం కార్డు ఏ విధంగా ఆడాలి, ఇతర పార్టీల్లో టికెట్లు రాని వారిని ఆకర్షించటం ఎలా వంటి బలహీనపు ఆలోచనలు చేసి వాటిలో గొప్ప వ్యూహంగా ఆత్మవంచన చేసుకోవటం మినహా వీరు చేసింది ఏమీ కన్పించదు. వీరు తీరు బాగా అర్థమైన జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తన నిర్దేశాలు తాను ఇవ్వటం నుంచి ఆగ్రహించటం వరకు చాలానే చేశారు. కాని అంతమాత్రాన సహారా ఎడారి బాగ్ – ఎ– అంబర్ అవుతుందా? ఇక్కడి బృందమంతా ఈ విధంగా ఉన్నపుడు.

ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఏమి చేయాలో చిత్తశుద్ధితో, ధైర్యంగా ముందు ఆలోచించి, దక్షిణాపథంలో ప్రవేశానికా తెలంగాణను గేట్ వే చేసుకోవటం గురించి ఆ తర్వాత కలలు కనాలి. అందుకోసం వారు మొదట చేయవలసింది మతం అజెండాను పక్కన పెట్టటం. అటువంటి పరిస్థితులు తెలంగాణలో లేవు. ఈ రాష్ట్రం అందుకు సిద్ధంగా లేదు. ఇక్కడి ప్రజలకు కావలసింది అభివృద్ధి, ప్రశాంతి, పరస్పర సామరస్యత. అందుకు అనుగుణంగా తమ అజెండాను, కార్యకలాపాలను మార్చుకోవాలి. ఆ తర్వాత ఆ అంశాల ఆధారంగా ప్రజలలోకి వెళ్లాలి. కష్టించి పని చేయాలి. వారి విశ్వాసాన్ని సంపాదించాలి. పునాదులు నిర్మించుకోవాలి.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

లేండి! మేల్కొనండి! గమ్యం చేరువరకు విశ్రమించకండి! అని యువతలో ఉత్తేజం నింపిన తత్వవేత్త, దేశభక్తుడు, సంఘ సంస్కర్త , ఆధునిక భారతదేశంలో ఆధ్యాత్మిక భావన తరంగాలను ప్రకాశింపజేసిన హైందవ జ్యోతి, నవయుగ వైతాళికుడు స్వామి వివేకానంద. శారీరక బలం, మానసిక ఔన్నత్యం, హృదయ సౌందర్యం అన్ని కలగలిసి మహోన్నత వ్యక్తిత్వంగా రూపుదిద్దుకున్న పుణ్యపురుషుడతడు. స్వామి వివేకానందగా ప్రసిద్ధి పొందిన నరేంద్రనాథ్ దత్తా 1863 జనవరి 12న విశ్వనాథ్ దత్తా, భువనేశ్వరి దేవి దంపతులకు కలకత్తాలో జన్మించారు.

చిన్నప్పటినుండే అమ్మ చెప్పే రామాయణ, భారత, భాగవత కథలు వినడం వలన నరేంద్రుడికి త్యాగం, దానం, దయ, ధ్యానం, ధైర్యం, భక్తి మొదలైన ఉత్తమ గుణాలు అలవడ్డాయి. నరేంద్రుడికి ఏకాగ్రత అధికం. అద్భుతమైన ధారణ శక్తి అతని విద్యాభ్యాసానికి ఎంతగానో ఉపకరించింది. యుక్తవయస్సులో అద్వైతం, సంగీతం, క్రీడా రంగాల్లో చక్కని ప్రతిభ కనబరిచేవాడు. ఏ విషయం గురించైనా హేతుబద్ధంగా ఆలోచించడం, ప్రశ్నించేతత్వం కలవాడు. ప్రశ్నించే గుణం పరిశోధనకు దారి చూపాలి అని భావించేవాడు నరేంద్రుడు. 1881లో నరేంద్రుడు ఒకరోజు మీరు దేవుడిని చూశారా? అనే ప్రశ్నతో రామకృష్ణ పరమహంసను కలుసుకున్నారు. దానికి రామకృష్ణుడు నేను దేవుడిని చూశాను. నిన్ను ఎలాగా చూస్తున్నానో అంతకంటే దగ్గరగా దేవుడిని చూశాను అని సమాధానం చెపుతాడు. అంతకుముందు ఎందరో మత నాయకులను ఈ ప్రశ్న అడిగినప్పటికీ వారెవరు రామకృష్ణుడి లాగా తడబాటు లేకుండా నమ్మకంగా సమాధానం చెప్పలేదు. దేవుడిని చూడాలనే తన కోరికకు అంత బలంగా సమాధానం దొరకడం వలన శ్రీరామకృష్ణుడి మార్గంలో వెళ్లి భగవంతుడిని దర్శించాలని నరేంద్రుడు భావించాడు. ఆ కలయికే తర్వాత భారతదేశంలో అత్యంత గొప్పనైన గురు శిష్యుల సంబంధంగా ఏర్పడింది.



తండ్రి మరణాంతరం నరేంద్రుడి కుటుంబం ఆర్థికంగా చాల కష్టాలు పడవలసి వచ్చింది. తినడానికి తిండి లేక పస్తులు ఉండే పరిస్థితులను ఎదుర్కొన్నారు. తన ఆహారం కోసం కాకుండా జ్ఞానం, భక్తి కోసం అమ్మవారిని ప్రార్థించేవాడు. రామకృష్ణుడు నరేంద్రుడి భక్తి భావంను గమనించి అతని కుటుంబానికి కూడు, గూడు, గుడ్డలోటు లేకుండా ఆశీర్వదించారు. 1886లో శ్రీ రామకృష్ణుడి మహాసమాధి తర్వాత ఆయన బోధనలను ప్రచారం చేయడానికి నరేంద్రుడు తన సహచర శిష్యులతో కలిసి సన్యాసం స్వీకరించి దేశమంతట పర్యటించి సమాజ పరిస్థితులను బాగా అవగతం చేసుకున్నారు. దేశంలో పేదరికం, అవిద్య, దీనమైన మహిళల స్థితిగతులను చూసి ఆయన చాలా ఆవేదన చెందారు. ఇటువంటి పరిస్థితులనుండి ప్రజలు బయటపడటానికి మార్గం ఏమిటి? అందుకు తను చేయవలసినది ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం వెతుక్కున్నారు. భారత దేశ పునరుత్తేజానికి ఏదైనా చేయాలని సంకల్పించాడు. ఆధ్యాత్మిక సంక్షేమం కోసం, ప్రజల సేవకై రామకృష్ణ మిషన్‌ను ఏర్పాటు చేశారు. భారతీయ ధర్మాచారాలను, సంస్కృతీ సంప్రదాయాలను పశ్చిమ దేశాలలో ప్రచారం చేసి తన మాతృదేశానికి సాయంచేయాలనినిశ్చయించుకున్నాడు.


నరేంద్రుడు హిందు మత ప్రతినిధిగా 1893లో చికాగోలో జరిగే ప్రపంచ మత సభలకు వెళ్లాలనుకున్నాడు. కానీ చేతిలో చిల్లి గవ్వకూడా లేదు. నరేంద్రుడి బోధనలతో ప్రభావితమైన ఖేత్రి ప్రాంత మహారాజు అజిత్ సింగ్ తనకు వీలైన అన్ని విధాలుగా సాయపడతానని మాట ఇచ్చారు. ఖేత్రి మహారాజు సూచన మేరకు నరేంద్రుడు 'వివేకానంద' అనే నామకరణం తో పశ్చిమ దేశ యాత్రలకు బయలుదేరాడు. సెప్టెంబర్ పదకొండు 1893 న చికాగోలో ప్రపంచ సర్వమత సమావేశం ప్రారంభమైనది. అంతకు ముందెపుడు స్వామిజీ అంత పెద్ద సమావేశంలో పాల్గొనలేదు. మనసులో చదువుల తల్లి సరస్వతీదేవిని తలచుకుంటు వణుకుతున్న పెదవులతో అమెరికా సోదర సోదరీమణులారా అంటూ వివేకానందుడు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. వెంటనే హాలు మొత్తం దద్దరిల్లే విధంగా చప్పట్లతో వివేకానందునికి అభినందనలు వెల్లువెత్తాయి. మరుసటి రోజు పత్రికలన్నీ వివేకానందుడి ప్రతిభను గొప్పగా కీర్తించాయి.హైందవ ధర్మాన్ని సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను హిందు మతాన్ని ప్రపంచ మత మహాసభలలో అవిష్కరించాడు. దీనితో అంతర్జాతీయ స్థాయి లో వివేకానందుడికి గుర్తింపు లభించింది. సర్వమానవ సమానత్వంపై అనేక ప్రదేశాలలో గంభీరమైన ఉపన్యాసాలతో ముఖ్యంగా యువతకు దేశభక్తి, ఆత్మవిశ్వాసం రగుల్కొల్పిన మహనీయుడు స్వామి వివేకానంద. భయాన్ని విడనాడండి బలాన్ని పెంచుకోండి అని, బలమే జీవితం బలహీనమే మరణం అని యువతను ఉత్తేజపరిచిన మహాయోగి అతడు. వివేకానందుడు పశ్చిమ దేశాలకు వెళ్లాడమనేది 'భారత దేశం మేల్కొంటుందనడానికి, విజయం సాధిస్తుందనడానికి మొదటి సూచన' అని శ్రీ అరబిందో అన్నాడు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించి విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రచారం చేసి మాతృదేశ అభ్యున్నతికి కొరకు స్వామిజీ కృషి చేశారు. మానవజాతికి చెందిన సమస్త లక్ష్యాలు భగవద్గీతలో ఉన్నాయని వివేకానందుడి అభిప్రాయం. తన శిష్యులకు ప్రజలకు సేవ చేయడమే జీవిత లక్ష్యం అని భోదించేవారు. ఈయన భోదనలతో ప్రభావితమైన శ్రీమతి, శ్రీ సేవియర్, గుడ్విన్, క్రిస్టిన్, మార్గరెట్ (నివేదిత) వంటి అనేక మంది విదేశీయులు సైతం శిష్యులుగా మారారు. సుభాష్ చంద్రబోస్, అరబిందో, మహాత్మా గాంధీ, రాజగోపాల చారి, అరవింద ఘోష్ లాంటి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు స్వామి వివేకానంద. రవీంద్రనాథ్ టాగూర్ మాటల్లో చెప్పాలంటే భారతదేశం గురించి తెలుసుకోవాలంటే వివేకానందుని అధ్యయనం చేయాలి. వివిధ దేశాలు సంచరిస్తూ ఉపదేశాలు ఇవ్వడం, భారత దేశములోని ప్రముఖ ప్రాంతాలన్నీ విరామం లేకుండా పర్యటించడం వలన ఆరోగ్యం క్షీణించి 1902 జులై 4న శివైక్యం చెందారు. ఆయన భౌతిక శరీరం పరబ్రహ్మాలో లీనమైనప్పటికి తాను వెలిగించిన జ్ఞాన జ్యోతి తరతరాలు వెలుగును ప్రసరిస్తూనే ఉన్నది. అతని అమృత వాక్కులు సదా ఆదర్శప్రాయం. ఆయన ఉపదేశాలు పదిల పరుచుకోదగిన అమూల్య నిక్షేపాలు. భారత ప్రభుత్వం వివేకానందుడి సేవలకు గుర్తింపుగా ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం' గా 1984లో ప్రకటించింది.

* కందుకూరి భాస్కర్
9703487088

సకుటుంబం

రొమాంటిక్ ట్రిప్..
బేబీమూన్



ఒక ఉదయం ఆ ఇంట్లోకి ఒక శుభవార్త వచ్చేసింది. వెన్నెల వెలుగులా నవ్వే పువ్వులా ఒక పాపాయి బోసి నవ్వులతో అల్లరితో ఆ పొదరింట్లోకి దంపతుల ప్రేమ కానుకగా రాబోతోంది. ఈ సందర్భాన్ని కాబోయే తల్లిదండ్రులు ఇంకో ప్రణయ యాత్రతో సెలబ్రేట్ చేసుకోవాలి అంటున్నారు వైద్యులు. దానికి వారు పెట్టిన పేరు బేబీమూన్.

ఆందోళనలూ, ఆలోచనలనూ పక్కన పెట్టి కొద్ది రోజులు ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా దంపతులు ఇద్దరూ సేదదీరడమే బేబీ మూన్. డెలివరీకి వెళ్ళే ముందు దంపతులు వెళ్ళే రొమాంటిక్ ట్రిప్ బేబీమూన్.

ఆ సమయంలో ఇష్టమైన ప్రదేశంలో ప్రశాంతంగా కొన్నాళ్ళు గడపడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. ఆ సమయంలో దంపతుల మధ్య నెలకొనే అనుబంధంతో పిల్లల మానసిక ఆరోగ్యానికి మేలు కలుగుతుందని అంటున్నారు.

పాశ్చాత్య దేశాల్లో ఈ బేబీమూన్ కొత్తమీ కాదు. ఈ బేబీ మూన్ పదాన్ని షీలాకిట్జింగర్ అనే రచయిత తొలిసారి ఉపయోగించారు. గర్భిణీకి తొమ్మిది నెలలు చాలా కీలక మైనవి. వాటిలో ప్రతి మూడు నెలల కాలాన్ని ఒక భాగంగా పేర్కొంటారు.

> అప్పటి వరకు నిష్పూచిగా ఆఫీస్‌కు పరుగులు తీసే అమ్మాయికి గర్భం దాల్చాక జీవన శైలిలోనూ ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. తన శరీరాన్ని తనే అర్థ చేసుకుంటూ ఆందోళన పడుతూ ఉంటుంది. ఆ సమయంలో ఆమె భాగస్వామి తోడ్పాటు కావాలి. తన పైన చూపించే శ్రద్ధ కావాలి. అందుకే వైద్యులు దంపతులని బేబీమూన్‌కు వెళ్ళమని సూచిస్తున్నారు.

గర్భస్థ శిశువు నాలుగు నుంచి ఆరునెలల కాలం బేబీమూన్ అనువుగా ఉంటుంది. చివరి నెలల్లో ఇతరత్రా సమస్యలు వస్తాయి. ఈ బేబీ మూన్ వెళ్ళే యాత్రలో ఏదైనా సమస్య వచ్చినా సత్వర వైద్య సహాయం దొరికేలా ఉండాలి. అలా వైద్య సదుపాయం మంచి ఆహారం, విమానాశ్రయం లేదా రైల్వే స్టేషన్ సౌకర్యం ఉన్న పర్యాటక ప్రదేశం అయి ఉండాలి.

ఆధ్యాత్మిక కేంద్రాలు మనసుని తేలిక చేస్తాయి అంటారు. మెడికల్ డాక్యుమెంట్లు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అత్యవసరమైన ఫోన్ నెంబర్లు తీసుకోవాలి. ముందుగా డాక్టర్ల ఆమోదం తీసుకోవాలి.

బేబీ మూన్‌కు ప్రకృతి సహజ సిద్ధంగా ఉండే పరిసరాలు, చక్కని గాలి, నీరు లభించే ప్రదేశాలు ఎంచుకోవాలి. మనదేశంలో గోవా, ఊటీ, ఆగ్రా, సిమ్లా, కేరళ వంటి ప్రాంతాలు చాలా అందంగా అనువుగా ఉంటాయి.

మరీ ఎక్కువ దూరాలు ప్లాన్ చేసుకోకూడదు. ఈ ట్రిప్ పూర్తిగా పుట్టబోయే బిడ్డను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఆ ప్రదేశాలను చూసి సంతోషించడమే కాక, పుట్టబోయే బిడ్డ శారీరకంగా, మానసికంగా ఎదగడం కోసం అన్న ఉద్దేశ్యాన్ని మర్చిపోకూడదు. తల్లి మానసికంగా ప్రశాంతంగా ఉంటే కడుపులో పాపాయి ప్రశాంతంగా ఉంటుంది. గర్భిణి ఒత్తిడికి దూరం అవుతుంది.

కొత్త ప్రాంతాలు చూడటం వల్ల మనసు ఉత్తేజంగా ఉంటుంది. శరీరంలో మేలు చేసే హార్మోనులు విడుదలై ఎన్నో సమస్యలను దూరం చేస్తాయి. కొన్ని ట్రావెల్ ఏజన్సీలయితే ఈ సమయంలో అనేక అవసరాలను దృష్టిలో ఉంచుకొని పేరెంటల్ స్పా, మసాజ్‌లు, యోగా థెరపీలు, చక్కని పోషకాహారం వంటివి ప్రత్యేకంగా డిజైన్ చేసి రకరకాల ప్యాకేజ్‌లు అందిస్తున్నారు.

కాబోయే తల్లిదండ్రులు పుట్టబోయే బిడ్డ గురించి మనస్ఫూర్తిగా మాటాడుకుందుకు సరికొత్త కలలు కనేందుకు ముఖ్యంగా ఒకరికోసం ఒకరు సమయం కేటాయించుకొనేందుకు ఈ బేబీ మూన్ ఒక చక్కని అవకాశం.

అప్పటి వరకు నిష్పూచిగా ఆఫీస్‌కు పరుగులు తీసే అమ్మాయికి గర్భం దాల్చాక జీవన శైలిలోనూ ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. తన శరీరాన్ని తనే అర్థ చేసుకుంటూ ఆందోళన పడుతూ ఉంటుంది. ఆ సమయంలో ఆమె భాగస్వామి తోడ్పాటు కావాలి. తన పైన చూపించే శ్రద్ధ కావాలి. అందుకే వైద్యులు దంపతులని బేబీమూన్ కు వెళ్ళమని సూచిస్తున్నారు.



ఎదుట వాళ్లను గుర్తించండి..!

స్నేహితులు, బంధువులు, భార్యాభర్తలు... ఇలా ఎవరైనా కావచ్చు. కొన్ని సందర్భాల్లో మాట్లాడుకోకుండానే ఒకరి ఆలోచనల్ని మరొకరు గ్రహించేస్తుంటారు. అవతలి వ్యక్తుల ముఖకవళికల్ని బట్టి వాళ్ళు తమ గురించి ఏమనుకుంటున్నారు లేదా ఏదైనా విషయానికి సంబంధించి వాళ్ళ ఆలోచనలు ఎలా సాగుతున్నాయి.. అన్నదాన్ని ఊహించేస్తుంటారు. అలా ఎదుటివాళ్ల ఆలోచనలల్నీ వాళ్ల మనసునీ తెలుసుకునేలా లక్షణం కొందరికి కొంత వరకూ ఉంటే ఉండొచ్చుగాక. కానీ అదే నిజమనుకుని వాటితో ఓ అంచనానికి రావడం మాత్రం మంచిది కాదు అంటున్నారు పరిశోధకులు. ఇందుకోసం వీళ్లు కొందరికి కొంతమంది వ్యక్తుల్ని చూపించి, వాళ్ల కవళికల్ని బట్టి వాళ్ల మనస్తత్వాన్నీ ఆలోచనల్నీ అంచనావేయమని చెప్పగా, వాళ్లు కచ్చితంగా చెప్పలేకపోయారట. అందుకే ఎదుటవాళ్ల ఆలోచనల్ని ఊహించి కాకుండా మాట్లాడి తెలుసుకోవడమే మేలనీ లేదంటే వాళ్ల గురించి తప్పుగా అంచానా వేసే ప్రమాదముందనీ చెబుతున్నారు.

సమయానికి తినకుంటే ప్రమాదం!



అలసిపోయి ఏ అర్ధరాత్రికో ఇంటికి చేరి, ఏదో కాస్త తిని, నిద్రలోకి జారుకునేవాళ్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. కానీ ఆలస్యంగా తిని, వెంటనే నిద్రపోవడం వల్ల క్యాన్సర్లు పెరుగుతున్నాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. తాజా కూరగాయలతో పోలిస్తే మాంసాహారం తినేవాళ్లలో క్యాన్సర్లు వచ్చే అవకాశం వచ్చే ఎక్కువన్నది తెలిసిందే. అయితే ఆలస్యంగా తినడం వల్ల కూడా ప్రోస్టేట్, రొమ్ము క్యాన్సర్లు వచ్చే అవకాశం అధిక మనేది తాజా పరిశోధనలో తేలింది. ఇందుకోసం వీళ్లు కొందరిని ఎంపిక చేసి వాళ్ల జీవనశైలిని పరిశీలించగా, రాత్రి నిద్రపోవడానికి ముందే రెండు గంటల ముందే అంటే 9 గంటల ముందే డిన్నర్ ముగించే వాళ్ళలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉందనీ, అలా కాకుండా పది గంటలు దాటాక తిని, వెంటనే నిద్రపోయే వాళ్లలో క్యాన్సర్ వచ్చే లక్షణాలు ఎక్కువగా ఉన్నట్లు తేలిందట. అంతేకాదు, కొందరు క్యాన్సర్ రోగుల జీవనశైలిని పరిశీలించినప్పుడు కూడా వాళ్ళలో చాలామంది లేటుగా తినే అలవాటు ఉన్నవాళ్లే అన్నది వెలుగు లోకి వచ్చింది. మొత్తమ్మీద క్యాన్సర్‌కీ తినే సమయానికీ సంబంధం ఉంది. అంటున్నారు సదురు పరిశోధకులు.

చిట్కాలు

* వేడి చేసి ఒక్కోసారి ముక్కు రంధ్రాల నుంచి రక్తం పడుతుంటే దానిమ్మ రసాన్ని రెండు చుక్కలు ముక్కు రంధ్రాల్లో వేస్తే మంచి ఫలితం ఉంటుంది.
* మరిగే నీటిలో ఉసిరికాయలు వేసి మరిగించి చల్లారిన తరువాత ఆ నీటితో ముఖాన్ని కడుక్కున్న తర్వాత మరోసారి చల్లని నీటితో ముఖాన్ని కడిగేస్తే ముఖ,చర్మ సౌందర్యం ఇనుమడిస్తుంది.
* టమాటోలను వంటలో ఉపయోగించే ముందు 6 నిమిషాల వరకూ వేడి నీటిలో ఉంచండి. ఇలా చేయడం వల్ల కూర చాలా రుచిగా ఉంటుంది.

నీళ్లలో పెంచేద్దాం..



మీరు విన్నది కరెక్టే. చాలా రకాల ఇండోర్ ప్లాంట్స్ మట్టిలోనే కాదు... నీళ్లల్లోనూ ఆరోగ్యంగా పెరుగుతాయి. అవేంటో వాటిని ఎలా పెంచొచ్చో తెలుసుకుందామా! తక్కువ స్థలం ఉన్నప్పుడు, కొంత నిర్వహణతోనే మొక్కల్ని పెంచాలనుకున్నప్పుడు చక్కని ప్రత్యామ్నాయం నీళ్లల్లో మొక్కల్ని పెంచడం. అందుకోసం వాటర్ మింట్, రోజ్‌మేరీ వంటి కొన్ని రకాల్నీ, చైనీస్ ఎవర్‌గ్రీన్, ఇంగ్లీష్ ఐవీ, జేడ్, పీస్‌లిల్లీ, మనీ ప్లాంట్స్, ఫిలడెండ్రాన్, క్రోటన్ వంటి మొక్కల్ని ఎంచుకోవచ్చు. ప్లాంట్స్, ఫిలడెండ్రాన్, క్రోటన్ వంటి మొక్కల్ని ఎంచుకోవచ్చు. అయితే వీటిని పెంచడానికి రాగి, ఇత్తడి, సీసం వంటి లోహపాత్రల్ని కాకుండా దళసరిగా ఉండే గాజు సీసాలు మేలు. ఎందుకంటే వీటి వేర్లకూ కాంతి అంది ఆరోగ్యంగా పెరుగుతాయి. నాచు పట్టకుండా ఉంటుంది. అయితే పాత్రను ఎంపికచేసుకున్నాక దాని అడుగున చిన్న చిన్న చిప్స్, రాళ్లు, బీడ్స్ వంటివాటితో పాటు చిన్న బొగ్గుముక్క కూడా వేస్తే నీళ్లు శుభ్రపడతాయి. నాచు పట్టకుండా, వాసన రాకుండా ఉంటుంది. మొక్క ఆరోగ్యంగా ఎదగాలంటే నైట్రోజన్ ఎక్కువగా ఉన్న ఎరువుని నీళ్లలో కరిగే రకాన్ని ఎంచుకోవాలి.





మన రంగవల్లులు



లావణ్య
ఓంనగర్ కాలనీ,హైదరాబాద్



పావని
కాళీమందిర్,హైదరాబాద్



డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పదోన్నతి పొందిన శివకుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేస్తున్న లిక్విడిక్ ఇన్ఫోటెక్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ పిఎస్ఆర్ మూర్తి. చిత్రంలో కంపెనీ ఎండి మధ్యూజాన్ కూడా ఉన్నారు

అమెరికాలో ఎమర్జెన్సీ తప్పదేమో

ట్రంప్ సంకేతాలు ..వాల్‌పై వీడని పట్టు

వాషింగ్టన్ : దేశంలో అత్యవసర పరిస్థితి విధించాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనప్రాయంగా తెలిపారు. అమెరికా – మెక్సికో సరిహద్దులలో భారీ స్థాయి గోడ నిర్మాణానికి ట్రంప్ తలపెట్టారు. అయితే దీనికి కాంగ్రెస్ నుంచి అనుమతి రాకపోవడంతో దేశంలో షట్‌డౌన్ పరిస్థితి ఏర్పడింది. దీనిని అధిగమించి తాను అనుకున్న విధంగా 5.6 బిలియన్ డాలర్ల నిధుల కేటాయింపునకు ప్రెసిడెంట్ అసాధారణ రీతిలో ఎమర్జెన్సీని తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం అయింది. దక్షిణ సరిహద్దు రాష్ట్రం టెక్సాస్‌లో శుక్రవారం ట్రంప్ పర్యటించారు. వాల్ నిర్మాణానికి చట్టపరంగా ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటారా? అని విలేకరులు ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి ట్రంప్ అవునని, దీనిపై తాను తీవ్రస్థాయిలో ఆలోచిస్తున్నట్లు , ఏదిఏమైనా సత్వర చర్యనే తీసుకుంటామని ట్రంప్ తెలిపారు. గోడ నిర్మాణాన్ని అడ్డుకునే వారు కనీస తెలివిని ఉపయోగించి చూడాల్సి ఉంది. అది భారీ వ్యయ ప్రక్రియ కాదు. అక్రమ వలసలు, లావాదేవీల నివారణతో ప్రతి ఏటా చాలా ఆదా అవుతుంది. వాల్ నిర్మాణ ఖర్చు తేలిగ్గా భర్తీ చేసుకోవచ్చు. దానికి మించి కూడా దేశానికి లాభం జరుగుతుందని ట్రంప్ చెప్పారు. ఒక్కరోజు క్రితమే ట్రంప్ అత్యంత కీలకమైన షట్‌డౌన్ చర్చల నుంచి వాకౌట్ జరిపారు. అంతకు ముందు ఆయన దేశంలో ఎమర్జెన్సీ విధించి అయినా వాల్ కట్టితీరుతామని హెచ్చరించారు. ప్రతిపక్ష డెమొక్రట్లు నిర్మాణం అడ్డుకుంటే తాము చూస్తూ ఊరుకునేది లేదని చెప్పారు. సరిహద్దు రాష్ట్రం టెక్సాస్‌లో ప్రెసిడెంట్ సందర్శనంగా ట్రంప్ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇమ్మిగ్రేషన్ అంశాన్ని తాము విస్తృతస్థాయిలో మారుస్తామని, కీలక సంస్కరణలు ఉంటాయని, దీనికి చాలా సమయం పడుతుందని, అంతేకాకుండా ఇది సంక్లిష్టం కూడా అవుతుందని తెలిపారు. 30, 35 ఏళ్లుగా ఇప్పటి వలసవిధానం, విదేశీయుల ప్రవేశ ప్రక్రియ సాగుతోందని, మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని, అయితే దీనికి ముందుగా అక్రమ ప్రవేశాలను నిరోధించేందుకు అడ్డుకట్ట అవసరం అని, కాంక్రీట్ వాల్‌తోనే ఇది సాధ్యం అవుతుందని చెప్పారు.

అద్భుతం జరిగి ఎవరైనా బతికి ఉంటారేమో!

సహాయక చర్యలు ఆపొద్దు: సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ: మేఘాలయలోని తూర్పు జయంతియా హిల్స్ జిల్లా బొగ్గుగనిలో చిక్కుకు పోయిన 15 మంది కూలీలను కాపాడేందుకు చేపట్టిన సహాయక చర్యలను కొనసాగించాలని సుప్రీం కోర్టు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను శుక్రవారం ఆదేశించింది. ఇందుకోసం నిపుణుల సాయం కూడా తీసుకోవాలని ఆదేశించింది. అక్రమంగా గనుల తవ్వకాలను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని సర్వోన్నత న్యాయస్థానం మేఘాలయ అధికారులను కోరింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను విచారిస్తున్న ఎకె సిక్రి నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు రాష్ట్రప్రభుత్వానికి పలు ప్రశ్నలను సంధించింది. అసలు అక్రమంగా గనులు తవ్వడానికి ఎవరు అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నించింది.' మీ సహాయక చర్యలను కొనసాగిస్తూనే ఉండండి. ఏదయినా అద్భుతం జరిగి గనిలో చిక్కుకున్న అందరు కానీ, కొంతమందికానీ ప్రాణాలతో బైటపడవచ్చునేమో' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గత డిసెంబర్ 13న పలువురు కూలీలు జయంతియా జిల్లాలో అక్రమంగా బొగ్గుగని తవ్వడానికి వెళ్లగా అదే సమయంలో వరదలు సంభవించి గనిలోకి నీరు ప్రవేశించింది. అదృష్టవశాత్తు అయిదుగురు ప్రాణాలతో బయటి పడగా మరో 15 మంది గనిలోపలే చిక్కుకు పోయారు. దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు వారి ఆచూకీ తెలియరాలేదు. అధిక శక్తి కలిగిన పంపుల ద్వారా ఇప్పటివరకు గనిలోపలినుంచి దాదాపు 30 లక్షల లీటర్ల నీటిని తోడారని, అయితే దగ్గర్లో నది ఉండడంతో గనిలో నీటిమట్టం ఏ మాత్రం తగ్గడం లేదని మేఘాలయ ప్రభుత్వం ఇటీవల కోర్టుకు తెలియజేసింది కూడా.

ఆకాశంలో ఆమె

(మొదటిపేజీ తరువాయి)

ఛైర్మన్ కె శివన్ శుక్రవా రం ఇక్కడ విలేకరులకు తెలిపారు. మానవులను అంతరిక్షంలోకి పంపించే ఈ ప్రయోగం భారత్‌కు తొలి ప్రయత్నం.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో అత్యంత విశిష్టరీతిలో తలపెట్టిన గగన్‌యాన్ 2021 మిషన్‌లో భాగంగా మహిళా వ్యోమగామిని కూడా అంతరిక్షంలోకి పంపిస్తున్నట్లు శివన్ చెప్పారు. మొత్తం ముగ్గురు సభ్యుల వ్యోమగాముల బృందంతో గగన్‌యాన్ యాత్ర జరుగుతుంది. ఈ యాత్ర లక్ష్యం సరైన రీతిలో సఫలం అయ్యేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు శివన్ వివరించారు. ప్రస్తుతానికి అన్ని పనులు సవ్యంగా జరుగుతున్నాయి. ఈ ఏడాదికి గగన్‌యాన్ అత్యంత ప్రాధాన్యతక్రమపు కార్యక్రమం. గత ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం ప్రసంగంలో ప్రధాని మోడీ భారతదేశపు విశిష్ట అంతరిక్ష ప్రయోగంగా గగన్‌యాన్ నిలుస్తుందని, దీనిని త్వరలోనే ఇస్రో శాస్త్రజ్ఞులు చేపడుతారని తెలిపారు. దీనికి అనుగుణంగానే ఇప్పుడు ఇస్రో గగన్‌యాన్‌కు 2021 డిసెంబర్‌ను సమయంగా ఖరారు చేసింది. ఇక మానవ రహిత అంతరిక్ష యాత్రకు కూడా ఇస్రో తొలిసారి సిద్ధం అయింది. ఇందులో తొలి ప్రయోగం 2020 డిసెంబర్‌లో రెండవది 2021లో ఉంటుందని శివన్ చెప్పారు. దీని తరువాత మానవులను అంతరిక్షంలోకి పంపించే కార్యక్రమం ఉంటుంది. తమ ఇస్రో బృందం అంతా అన్ని ప్రయోగాల విజయవంతానికి సర్వంసన్నద్ధంగా ఉందని తెలిపారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఇస్రో గగన్‌యాన్, మానవరహిత యాత్రలకు రూ 9023 కోట్ల రూపాయల కేటాయింపులకు ఆమోదం తెలిపిందని ఇస్రో ఛైర్మన్ గుర్తు చేశారు. గత ఏడాది విజయాలు, కొత్త ఏడాది లక్ష్యాలను ఇస్రో ప్రధాన కార్యాలయంలో సంస్థ అధినేత అన్ని కోణాలలో వివరించారు.

మూసవీడి కొత్త ఒరవడి

(మొదటిపేజీ తరువాయి)

నియామకం కూడా జరుగుతున్నదని గుర్తుచేసిన ముఖ్యమంత్రి కెసిఆర్ గ్రామాభివృద్ధిలో వీరిద్దరి పాత్ర చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందున గ్రామ పంచాయితీకు విధులు, బాధ్యతలు అప్పగించే విషయంలో కొంత జాప్యం జరగవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌నే పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి కనుక ఆ తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెడతామని, అందులోనే పంచాయితీలకు నిధులను కేటాయిస్తామని ఈ సమావేశంలో కెసిఆర్ స్పష్టత ఇచ్చారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులను కేటాయించడం సాధ్యం కాదని వివరించారు. పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమర్పించేటప్పటికల్లా సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పూర్థి స్థాయిలో శిక్షణ అందాలని, గ్రామాభివృద్ధి కోసం పాటు పడే కార్యకర్తలుగా వారిని తీర్చిదిద్దాలని అధికారులకు స్పష్టం చేశారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ, 'ఆస్కి', మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ తదితర సంస్థల ద్వారా శిక్షణ ఇప్పించాలని సిఎం సూచించారు.

అయోధ్య రాముడికి కాంగ్రెస్ అడ్డంకులు

బిజెపి జాతీయ సదస్సులో అమిత్ షా దాడి • ఆలయ నిర్మాణంలో వెనుకంజ లేదు • యుపి కూటమితో బెదిరిపోం



న్యూఢిల్లీ : అయోధ్యలో రామాలయ నిర్మాణంపై బిజెపి పట్టుదలతో ఉందని, అయితే కాంగ్రెస్ అడ్డుపడుతోందని పార్టీ అధ్యక్షులు అమిత్ షా విమర్శించారు. రామాలయం సాధ్యమైనంత త్వరగా నిర్మాణం జరగాల్సిందే. భారతీయుల ఆకాంక్షలు తీరాల్సిందే. దీనికి తమ పార్టీ కట్టుబడి ఉంది. అయితే కాంగ్రెస్ అవరోధాలు సృష్టిస్తోందని షా ఆరోపించారు. దేశ రాజధానిలో శుక్రవారం ప్రారంభం అయిన పార్టీ జాతీయ మండలి సమావేశాలను ప్రారంభిస్తూ అమిత్ షా మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు, యుపిలో ఎస్‌పి, బిఎస్‌పి సారధ్యపు కూటమి , కోటా వంటి పలు అంశాలపై ఆయన మాట్లాడారు. అయితే ప్రధానంగా రామాలయ నిర్మాణమే బిజెపి ధ్యేయమనే విషయాన్ని స్పష్టం చేశారు. ప్రస్తుత స్థలిలోనే రాముడికి గుడి కట్టి తీరాల్సిందేనని, ఇందులో ఎటువంటి సందేహాలకు , జాప్యాలకు ఆస్కారం ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. తాము రామాలయం కోసం పట్టుపడుతూ ఉంటే ప్రతిపక్ష కాంగ్రెస్ వారు ఏదో విధంగా అడ్డుపుల్లలు వేస్తున్నారని విమర్శించారు. కోర్టుల ద్వారా వివాదానికి సత్వర పరిష్కారం అయ్యేందుకు వీలుండగా కాంగ్రెస్ పాచికలతో దీనికి అడ్డుకట్టలు పడుతున్నాయని అన్నారు. స్థానిక రామ్‌లీలా మైదాన్‌లో బిజెపి జాతీయ సదస్సు ప్రారంభోపన్యాసంలో అమిత్ షా అయోధ్యలో రామాలయ నిర్మాణంపై ఉద్ఘాటించినప్పుడు, మందిరానికి తాము కట్టుబడి ఉంటామని తెలిపినప్పుడు సభికుల నుంచి హర్షాతిరేకపు చప్పట్లు మార్మోగాయి. పార్టీ శ్రేణులన్నింటిలోనూ రామాలయ నిర్మాణ ప్రతిధ్వని ఉందని, అది ఇప్పుడు వ్యక్తం అవుతోందని షా తెలిపారు. అంతా అనుకున్న చోటనే ఆలయం కట్టితీరడం జరుగుతుందని, దీనిపై సందేహాలకు, కొందరి భేషజాలకు తావు లేదని చెప్పారు. సుప్రీం కోర్టులో ఈ వివాదం త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు తమ పార్టీ అన్ని విధాలుగా యత్నిస్తోందని షా తెలిపారు. ఈ నెల 29వ తేదీనే అత్యున్నత న్యాయస్థానంలో కేసు విచారణకు తేదీ ఖరారు చేసిన విషయాన్ని షా గుర్తు చేశారు. పలు కీలక అంశాలతో పాటు అయోధ్యపై కూడా కాంగ్రెస్‌కు కూడా నిర్దిష్ట వైఖరి లేనట్లుగా ఉందని, అయోధ్యపై వారి నిర్దిష్ట అభిప్రాయం ఏమిటో దాగుడుమూతలు లేకుండా చెప్పాల్సి ఉందన్నారు. ప్రతిపక్షంగా ప్రజల పట్ల ఈ బాధ్యతను నిర్వర్తించాల్సి ఉందన్నారు. ప్రధాని మోడీ, పార్టీ ఇతర అగ్రనేతల సమక్షంలో బిజెపి అధ్యక్షులు రామాలయ నిర్మాణం అంశాన్ని ప్రస్తావించారు. వివాదాన్ని రాజ్యాంగపరంగా పరిష్కరించుకోవాలనే తమ పార్టీ కోరుకొంటోందన్నారు.

మోడీ శక్తి ఏమిటో యుపితో తేలింది

దేశ రాజకీయ అధికార ప్రక్రియలో కీలక పాత్ర పోషించే ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్ష కూటమి ఏర్పాటుతోనే మోడీ బలం ఏమిటనేది తెలిసిందని అమిత్ షా చెప్పారు. యుపిలో ఎస్‌పి, బిఎస్‌పిలు జట్టు కడుతున్నాయి. ఈ దిశలో శనివారం కీలక ప్రకటన వెలువడుతుంది. ఇంతకాలం శత్రువులుగా ఉన్న రెండు పార్టీలు ఇప్పుడు మిత్రులుగా మారుతున్నాయి. ప్రధాని మోడీని ఓడించడం కుదరదని తెలిసిపోయింది కాబట్టే ఈ పార్టీలన్నీ కలిసి అడ్డగోలుగా కూటమిలకు దిగుతున్నాయని షా విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ఓ వైపు, ఇతర పార్టీలు మరో వైపు నిలిచి తలపడేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. బలీయమైన మోడీ ఓ వైపు...మిగిలిన పార్టీలన్నీ మరో వైపు నిలుస్తున్నాయన్నారు.

మూడో పానిపట్టు యుద్ధం గెలవాలి

రాబోయే లోక్‌సభ ఎన్నికలు మూడో పానిపట్టు యుద్ధం వంటివని, ఈ ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఉందని అమిత్ షా తేల్చిచెప్పారు. కొన్ని యుద్ధాల ఫలితాలు తరువాతి పరిణామాలు శతాబ్దాలుగా నిలిచి ఉంటాయని, ఈ ఎన్నికలను మూడో పానిపట్టు యుద్ధంగా భావించి ఇందులో గెలిచితీరాలని బిజెపి శ్రేణులకు అమిత్ షా పిలుపు నిచ్చారు. ఈసారి ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరుగా ఉంటుందని చెప్పారు. బిజెపి పేదల పక్షాన ఉందని, ప్రతిపక్షం కేవలం అధికార దాహంతో ఒక్కటి అవుతోందని రెండింటి సిద్ధాంత వైరుద్ధ్యాలను తేల్చుకోవల్సి ఉందన్నారు. రాఫెల్ డీల్‌లో అవినీతి ఉందని రాహుల్, సోనియా గాంధీలు ఆరోపిస్తున్నారని , అయితే వేరే కేసులో బెయిల్‌పై ఉన్న వారు ప్రధాని మోడీపై ఏ అర్హతతో నిందలకు దిగుతారని ప్రశ్నించారు. అధికారం దక్కడం లేదనే నిరాశతో రాహుల్ అదేపనిగా రాఫెల్ గురించి మాట్లాడుతున్నారని , అసలు స్కామ్‌లేనప్పుడు ఆయన దేని గురించి మాట్లాడుతున్నట్లు తెలియడం లేదన్నారు. పార్టీ జాతీయ సదస్సులో ముగింపు ఉపన్యాసం ప్రధాని మోడీ శనివారం వెలువరిస్తారు.

డేరాబాబా దోషి



జర్నలిస్టు హత్య కేసు

పంచకుల : జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతి హత్యకేసులో డేరాబాబా గుర్మీత్ రామ్ రహీంను ప్రత్యేక సిబిఐ న్యాయస్థానం దోషిగా ఖరారు చేసింది. గుర్మీత్‌తో పాటు మరో ముగ్గురు కూడా దోషులుగా నిర్ధారణ అయినట్లు స్థానిక ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తెలిపింది. వీరికి శిక్షలను ఈ నెల 17వ తేదీన ప్రకటిస్తారు. పూరా సచ్ పత్రికలో జర్నలిస్టు ఛత్రపతిని సిర్సాలోని ఆయన నివాసంలో 2002 అక్టోబర్ 24వ తేదీన అతి దగ్గరి నుంచి కాల్చి చంపారు. డేరా సచ్చా సౌదా ఆశ్రమంలో తలదాచుకుంటున్న ఓ మహిళను డేరా బాబా లైంగికంగా వేధించి, అత్యాచారం జరిపినట్లు తెలిపే ఆకాశరామన్న లేఖను ఈ పత్రికలో ప్రచురించారు. ఈ లేఖను సేకరించి డేరా బాబా అక్రమాలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టు ఛత్రపతి కీలక పాత్ర పోషించారు. దీనిపై కక్ష పెంచుకుని డేరా బాబా కొద్ది నెలల తరువాత ఈ జర్నలిస్టును హత్య చేసినట్లు ప్రాధమిక సాక్ష్యాధారాలు లభించినందున దోషిగా ఖరారు చేసినట్లు న్యాయస్థానం తెలిపింది. డేరా మేనేజర్ క్రిషన్ లాల్ తన లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను , వాకీటాకీని హత్యకు సమకూర్చినట్లు సిబిఐ దర్యాప్తు క్రమంలో తేలింది. డేరా అధినేత గుర్మీత్ సమక్షంలోనే డేరాకు చెందిన ఇద్దరు షూటర్లు కుల్దీప్ సింగ్, నిర్మల్ సింగ్‌లు జర్నలిస్టుపై కాల్పులకు దిగినట్లు, తీవ్రంగా గాయపడి తరువాత మృతి చెందినట్లు ఈ కేసు తీర్పు నేపథ్యంలో తెలిపారు. 51 ఏండ్ల డేరా బాబా అత్యాచారం కేసులో 20 సంవత్సరాల శిక్ష పడి ఇప్పుడు రొహతక్‌లోని సునారియా జైలులో ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో కూడా ఆయన దోషిగా ఖరారు అయ్యారు. భద్రతా కారణాలతో గుర్మీత్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కేసులో విచారించారు. మిగిలిన ముగ్గురు నిందితులు స్వయంగా కోర్టుకు వచ్చారు. తీర్పు నేపథ్యంలో జైలు పరిసరాలలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గతంలో ఘటనలను దృష్టిలో పెట్టుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూశారు. రెండేళ్ల క్రితం హర్యానాలోని సిర్సాలో గుర్మీత్‌ను దోషిగా ప్రకటించినప్పుడు ఆయన శిష్యగణం ప్రేరేపించిన హింసాకాండలో 40 మంది మృతి చెందారు. ఎందరో గాయపడ్డారు

మందుపాతరకు ఆర్మీ మేజర్, ఇద్దరు జవాన్ల బలి

శ్రీనగర్ : కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు మందుపాతర (ఐఇడి) పేలుడు ఘటనల్లో భారతీయ ఆర్మీ మేజర్, ఇద్దరు జవాన్లు మృతి చెందారు. రాజౌరీ జిల్లాలోని రూప్‌మతి ఫార్వర్డ్ పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది.భారతీయ సైనాన్ని లక్ష్యంగా చేసుకునే ఈ ప్రాంతంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు ఈ మందుపాతరను అమర్చినట్లుగా అనుమానిస్తున్నారు. సాయంత్రం నాలుగున్నరకు, తిరిగి సాయంత్రం ఆరున్నరకు పేలుళ్లు మరో వైపు రాజౌరీ జిల్లాలోనే ఎల్‌ఒసి వెంబడి జరిగిన స్నిపర్ కాల్పుల దాడిలో భారతీయ సైన్యానికి చెందిన పోర్టర్ ఒకరు మృతి చెందారు. కాల్పులకు దిగింది పాకిస్థాన్‌కు చెందిన సరిహద్దు కార్యాచరణ బృందం (బ్యాట్) అని అనధికారిక వార్తలతో వెల్లడైంది. ఈ బ్యాట్ బృందం ఉగ్రవాదులు, పాకిస్థానీ సైనిక సిబ్బందితో కలిసి ఏర్పడింది. నియంత్రణ రేఖ వెంబడి నౌషెరా సెక్టార్‌లో ఐఇడి పేలుడులో సైనిక అధికారి, ఇద్దరు సైనికులు బలి అయిన విషయాన్ని రక్షణ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ నిర్ధారించారు. మందుపాతరను ఎవరు అమర్చి ఉంటారనేది ఆయన వెల్లడించలేదు.

సింథటిక్ మాంజపై నిషేధం

మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో పతంగుల ఎగురవేత కోసం సింథటిక్ మాంజతో పాటు నైలాన్‌తో కూడిన దారాలను వాడకూడదని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మాంజ ఉత్పత్తి, విక్రయం, రవాణా, నిల్వతో పాటు అమ్మకాలను పూర్తిగా నిషేధించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. దీనికి సంబంధిం చి రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా ఉత్తర్వులను జారీ చేశారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్వులను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

వచ్చే విద్యా సంవత్సరానికి గిరిజన విశ్వవిద్యాలయం

- జూలై నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు
- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు
- ఆరు కోర్సులు..... 30 మంది చొప్పున విద్యార్థులు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయానికి సంబంధించిన తరగతులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె.జోషి తెలిపారు. సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ తరగతుల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరు కోర్సులను ప్రారంభించి 30 మంది విద్యార్థుల చొప్పున జూలై నుంచి తరగతులను ప్రారంభించాలని సూచించారు. గిరిజన సంక్షేమం, విద్యా, అటవీశాఖలతో పాటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అధికారులతో గిరిజన యూనివర్శిటీకి సంబంధించిన అంశంపై శుక్రవారం సిఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ జోషి మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా జాగారం వద్ద ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తరగతుల నిర్వహణను చేపట్టాలన్నారు. ఇందుకు అనుగుణంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అధికారులు తాత్కలిక నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో స్థానిక గిరిజన యువత కోసం 30 శాతం సూపర్ న్యూమరీ సీట్లను కేటాయించాలన్నారు. విశ్వ విద్యాలయంలో ప్రధానంగా బిఎ (హోటల్ మేనేజ్‌మెంట్), బిసిఎ, ఎంసిఎ, ఎంబిఎ (మార్కెటింగ్, ప్యాకేజింగ్, అటవీ ఉత్పత్తులకు సంబంధించి ప్రత్యేకత అంశాలు) బిబిఎ, మాస్టర్ ఇన్ ట్రైబల్ కల్చరర్ ఫోల్‌కోర్ తదితర కోర్సులలో తరగతులను ప్రారంభించాలన్నారు. యూనివర్శిటీ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం చేపట్టాలన్నారు. ఈ విశ్వ విద్యాలయం ద్వారా స్థానిక గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయం ఏర్పాటు నిమిత్తం భూ సేకరణకు సంబంధించిన పది కోట్ల రూపాయలను గిరిజన సంక్షేమశాఖ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలన్నారు. అటవీశాఖకు సంబంధించిన భూమిలో అటవీ చట్ట నిబంధనలలో అనుమతించిన మేరకు గిరిజన సంస్కతికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విశ్వ విద్యాలయ కమిటీలో ఉన్నత విద్య, గిరిజన సంక్షేమం, అటవీశాఖ ముఖ్య కార్యదర్శులను సభ్యులుగా నియమించాలని సూచించారు. యూనివర్శిటి నిర్మాణానికి సంబంధించిన తగిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా, కమిషనర్ క్రిష్టినా చొంగ్తు, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, అదనపు అటవీ సంరక్షణ అధికారి రఘువీర్, ఏటూరు నాగారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చక్రధర్ రావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా 'అక్షర' 6వ వార్షికోత్సవం





మన తెలంగాణ/హస్తినాపురం: ఎల్.బి.నగర్‌లోని అక్షర ఇంటర్నేషనల్ స్కూలు క్యాంపస్‌లో శుక్రవారం సాయం త్రం 6వ వార్షికోత్సవ వేడుకలు రాపోస్డి 2019 పేరిట అత్యంత ఘనంగా జరిగాయి. ప్రముఖ క్రీడా శిక్షకులుగా పేరొందిన హిమాంశు చతుర్వేది ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా ప్రఖ్యాత యువ పర్వతారోహకురాలు కుమారి జాహ్నవి శ్రీపెరంబుదూరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిమాంశు చతుర్వేది మాట్లాడుతూ క్రీడలను క్రీడా సంబంధ విషయాలు ఎప్పుడు ప్రచారం చేసే తాను, అక్షర ఇంటర్నేషనల్ స్కూళ్లలో విద్యా విషయాలతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత లభిస్తుందని తెలిసి, చాలా సంతోషించానని చెప్పారు. అక్షర విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో క్రీడల్లో రాణించడం గర్వించదగిన విషయమని చెప్పారు. ఆ దిశలో అక్షర స్కూళ్ల అక్షర స్పోర్ట్స్ అకాడమీలకు అంకురార్పరణ చేసి విద్యార్థులకు వివిధ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నందుకు తాను అక్షర యాజమాన్యాన్ని అభినందిస్తునన్నారు. అక్షర అంతర్నేషనల్ స్కూల్స్ గ్రూప్ ఛైర్మన్ ఎ.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ అక్షర స్కూళ్లలో అకాడమిక్ విషయాలతో పాటు ప్రత్యేకంగా విద్యార్తులకు క్రీడా స్ఫూర్తి కలిగేలా, ఆరోగ్యకరమైన జీవనశైలి లభించేలా వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అక్షర సంస్థల సీ.ఈ.ఓ.ఎ.మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ 6వ వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులకు, విద్యార్థులకు తల్లిదండ్రులకు, సహచర సిబ్బందికి, శ్రేయాభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ప్రఖ్యాత యువ పర్వతారోహకురాలు కుమారి జాహ్నవి శ్రీపెరంబుదూరు తన పర్వతారోహణకు సంబంధించిన అనుభవాలను పంచుకున్నారు. చిన్న వయసులోనే తన తండ్రితో కలిసి పర్వతారోహణలో పాల్గొనేదానినని తెలిపారు. ప్రస్తుతం తాను 7 ఖండాల్లో ఉన్న 7 ఎత్తైన పర్వతాల్ని అధిరోహించడానికి మిషన్ 7 సమ్మిద్ అనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. లక్ష్యసాధనలో అక్షర గ్రూపు అందిస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో అతిథులు చేతుల మీదుగా అక్షర గ్రూపుకు సంబంధించిన 6వ పాఠశాల అక్షర ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్, క్యాంపస్ యొక్క ఎలివేషన్ డిజైన్లను ఆవిష్కరించారు. ప్రస్తుతం కరీంనగర్ క్యాంపస్ భవన నిర్మాణం శర వేగంతో సాగుతోందని ప్రకటించి 201920 విద్యా సంవత్సరం నుండి ప్రారంభం కాబోతందని ప్రకటించారు. అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ ఎల్‌బినగర్ ప్రిన్సిపల్ రమణి వారణాసి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం వార్షిక నివేదికను వివరించి భవిష్యత్ ప్రణాళికను తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ హైమావతి వందన సమర్పణ చేసి ఇక్కడ జరుతున్న వేడుకను విశ్వవ్యాప్తంగా అందరూ వీక్షించేలా అక్షర ఇంటర్నేషనల్ స్కూల్, ఎల్‌బినగర్ యూట్యూబ్ ఛానెల్, ఫేస్ బుక్‌లో లైవ్ ప్రసారానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాదాపు 1500 మంది తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను, ఆసక్తికరమైన నాటికలను, సంగీత రూపకాలను, బృంద గీతాలను, ముకాభినయన ప్రదర్శనలను వీక్షించారు.



ఆ జిల్లాలో పంచాయతీలే ఎక్కువ...

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని కొత్తగూడం జిల్లాలో మొదటి విడతగా జరుగుతున్న పంచాయితీల్లో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెంలో మొత్తం 479 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 454 పంచాయతీలను షెడ్యూల్డ్ ప్రాంతంలో, మరో 25 పంచాయతీలను నాన్ షెడ్యూల్డ్ కేటగిరి కింద విభజించారు. కాగా ఈ నెల 21న మొదటి విడతగా 174 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే 174 పంచాయతీలకుగానూ వచ్చిన నామినేషన్ల సంఖ్య 276 మాత్రమే. ఈ నామినేషన్ల సంఖ్య అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మేడ్చల్ వంటి జిల్లాలో మొదటి విడతగా 33 గ్రామపంచాయితీలకు ఎన్నికలు జరుగుతుండగా, వచ్చిన నామినేషన్ల సంఖ్య 199. అలాంటిది కొత్తగూడెంలో మాత్రం ఒక పంచాయతీకి మూడు చొప్పున నామినేషన్లు రాలేదని స్పష్టం గా తెలుస్తోంది. ఈ జిల్లాలో దాదాపుగా పంచాయతీల్లో తొంభైశాతం వరకు షెడ్యూల్డ్ ప్రాంతంలోనే ఉన్నాయి. దీని కారణంగానే ఆయా గ్రామపంచాయతీలు ఆదివాసులు, గిరిజనలకు రిజర్వుడు కావడం వల్ల నామినేషన్ల సంఖ్య పెరగలేదని తెలుస్తోంది. ఇక కొన్ని పంచాయతీలు ఏకగ్రీవం కావడం వంటి కారణాలు కూడా నామినేషన్ల సంఖ్య తగ్గడానికి కారణమైంది. ఇక వార్డులు 1,534 ఉండగా వచ్చిన నామినేషన్లు 1,227 మాత్ర మే. అంటే వార్డులకు సరిపడ నామినేషన్లు కూడా రాలేదని తెలుస్తోంది.

సర్పంచ్ అభ్యర్థులు 23,229

11 పంచాయతీలు.. 206 వార్డుల్లో 'నో' ఎలక్షన్

మన తెలంగాణ/హైదరాబాద్: మొదటి విడతలో 11 పంచాయతీల్లో ఎన్నికలు జరగడం లేదు. నోటిఫికేషన్ ప్రకారం ఆ 11 గ్రామ పంచాయతీలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడం, వేసిన వాటిల్లో సరియైనవి లేకపోవడమే ఇందుకు కారణం. మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్క్రూటిని ముగియడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం సరైన నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. దీని ప్రకారం 4479 పంచాయతీ సర్పంచ్‌లకు, 39,822 వార్డులకు మొదటి విడతలో నామినేషన్లు ఆహ్వానించారు. ఇందులో 11 పంచాయతీలకు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఐదు, మంచిర్యాల్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రెండేసి చొప్పున వాటికి నామినేషన్లు దాఖలు కాకపోవడం, వేసిన వాటిలో సరియైనవి లేకపోవడం ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో 4468 పంచాయతీ సర్పంచ్‌లకే ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే 39,822 వార్డులకు గాను 206 వార్డులకూ నామినేషన్లు రాకపోవడం, వేసిన వాటిలో సరియైనవి లేన్నట్లు ప్రకటించారు. దీంతో 39,616 వార్డులకే ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

4468 పంచాయతీలు... 23,299 అభ్యర్థులు

మొదటి విడతలో 4468 పంచాయతీలకు 23,299 మంది సర్పంచ్ అభ్యర్థులు సరైన నామినేషన్లు దాఖలు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అంటే ఒక్క పంచాయతీకి సరాసరి ఐదురుగు చొప్పున పోటీలో ఉండే అవకాశం ఉంది. అలాగే 39,616 వార్డులకు 93,501 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ లెక్కన ఇద్దరు, లేదా ముగ్గురు ఒక్క వార్డుకు పోటీ పడుతున్నారు. అయితే నామినేషన్లకు ఈ నెల 13వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంది. దీని తరువాతే పోటీలో ఉండే సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థుల జాబితా కొలిక్కిరానుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి. నాగిరెడ్డి శనివారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు.

ఆ అభ్యర్థికి ముగ్గురు పిల్లలు

రాష్ట్ర ఎన్నికల సంఘానికి వెల్లువలా ఫిర్యాదులు



మనతెలంగాణ/ హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రోజుకు సగటున 300 నుంచి 400 వరకు ఫిర్యాదులు వస్తున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. ఇందులో ప్రముఖంగా సర్పంచ్ అభ్యర్థిగా, వార్డు మెంబర్‌గా పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు పిల్లలు ఉన్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. దాదాపు అన్ని జిల్లాల నుంచి ఇదే ఫిర్యాదు ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయి. గ్రామాల్లో స్థానికంగా ఉండే గొడవల కారణంతో కొందరు నేరుగా ఎన్నికల సంఘానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తున్నారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం జూన్ 1వ తేదీ 1995 కంటే ముందు ముగ్గురు పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. కానీ ఆ తరువాత ముగ్గురు పిల్లలు ఉన్నట్లయితే పోటీ చేయడానికి అనర్హులు. మొదటి విడతలో నామినేషన్లు వేసిన కొందరు అభ్యర్థులు నిబంధనల ప్రకారం అనర్హులైనప్పటికీ, దాని నుంచి తప్పించుకునేందుకు నానా రకాల మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిసింది. ఒక అభ్యర్థి దత్తత తెచ్చుకున్నానని, బాండ్ రాసుకున్నామని ఇటు అధికారులతో, గ్రామస్తులతో చెప్పుకుంటున్నట్లు తెలిసింది.

ఇక ఓటర్ల గల్లంతు సమస్య పంచాయతీ ఎన్నికల్లోనూ వేధిస్తోంది. తాము గత 30 ఏళ్లుగా ఊరిలోనే ఉంటున్నామని, తమ ఓటు ఎలా తొలగిస్తారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందుతున్నాయి. ఓటరు గుర్తింపు కార్డులున్నాయని, జాబితాలో మాత్రం తమ పేరు లేదని, పోటీ చేసే అభ్యర్థులు కొందరు తమ పేరు తప్పుగా పడిందంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. ఇక నగదు, మద్యం పంపిణీపై అసెంబ్లీ ఎన్నికల మాదిరి పెద్దగా ఫిర్యాదులు ఏమి అందడం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ''మన తెలంగాణ''కు వివరించారు.

కరపత్రాల ముద్రణపై ఆంక్షలు

పంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఉండే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ప్రచారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. పరిమితిని మించి ఖర్చు చేయకూడదని, దీనిపై సాధారణ, వ్యయ పరిశీలకులు దృష్టిసారించాలని ఆదేశించింది. కరపత్రాలను పరిమిత సంఖ్యలో ముద్రించాలని, అందులో ప్రింటర్స్ పేరు ఎన్ని కాపీలు ముద్రించారో వంటివి ఉండాలని సూచించింది. ఇక అభ్యర్థుల ఖర్చు విషయంపై కూడా ఒక నమూనాను రిటర్నింగ్ అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. జనరల్ స్థానం వచ్చిన పంచాయతీలపై పోలీసుల నిఘా పెంచాలని ఎన్నికల సంఘం డిజిపిని ఆదేశించినట్లు తెలిసింది. ఈ స్థానాల్లో పలు కులాలకు చెందిన వారు పోటీలో ఉండే అవకాశం ఉన్నందున వారి మధ్య కుల గొడవలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంది. ఒక గ్రామస్తుడి ఫిర్యాదు ఆధారంగా ఈ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ప్రజలు మెచ్చిన ప్రజాప్రతినిధులు

- పదిహేను ఏళ్ళుగా భార్యభర్తలే వరస సర్పంచ్‌లు, ఎంపిటిసి
- నాడు విప్లవ భావాలతో అజ్ఞాతం
- రిజర్వేషన్‌తో మరో పదేళ్ళు అవకాశం



మనతెలంగాణ/ ధర్మారం: వారిద్దరు ప్రజలు మెచ్చిన ప్రజా ప్రతినిధులు వరుసగా పదిహేనేళ్ళ పాటు భార్యభర్తలిద్దరు సర్పంచ్, ఎంపిటిసిలుగా పనిచేస్తుండగా, రిజర్వేషన్ కలిసి రావడంతో మరో పదేళ్ళు పోటీ చేసే అవకాశం లభించింది. అరుదైన రాజకీయ అవకాశం ధర్మారం మండలం కొత్తూర్ గ్రామానికి చెందిన తాళ్ళపల్లి లింగయ్య, భద్రమ్మ దంపతులకు దక్కింది. తాళ్ళపల్లి లింగన్న గౌడ్ అంటే కొత్తూర్ లింగన్న అంటూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే సుపరిచితమైన వ్యక్తిగా పేరుంది. 1980 సంవత్సరంలో నాడు విప్లవభావాలతో పీపుల్స్‌వార్‌లో చేరి అజ్ఞాతంలోనే వివాహం చేసుకున్న లింగన్న గౌడ్ దంపతులు 1987 సంవత్సరంలో జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం ప్రారంభించారు. ప్రజా సమస్యలపై నిత్యం స్పందించే వ్యక్తిగా పేరున్న లింగన్న గౌడ్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించి 2001 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిసి మహిళకు రిజర్వ్ చేసిన స్థానంలో సతీమణి భద్రమ్మను బరిలో నిలిపి ప్రజా మద్దతుతో విజయం సాధించారు. 2006లో సర్పంచ్ జనరల్‌కు రిజర్వ్‌కాగా బిసి వర్గానికి చెందిన లింగన్న గౌడ్ సర్పంచ్‌గా విజయంతో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మధ్యలో రిజర్వేషన్ అనుకూలించక పోగా, 2014లో లింగన్న గౌడ్ ఎంపిటిసిగా గెలుపొంది ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఈ సారి జనరల్ స్థానంగా మారగా లింగన్న బరిలో వుంటున్నారు. భార్యభర్తలిద్దరు సర్పంచ్‌గా పదేళ్ళపాటు, ఎంపిటిసిగా ఐదేళ్ళపాటు మంచి సేవలందించారు. గ్రామాన్ని అభివృద్ధి పర్చడంతో పాటు ప్రజ సమస్యలపై సత్వరమే స్పందించే వ్యక్తిగా లింగన్నకు మంచి పేరుంది. టిఆర్‌ఎస్‌కు చెందిన లింగన్నకు అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులతో స్నేహ పూర్వక సంబంధాలున్నా యి. ధర్మపురి ఎమ్మెల్యే ఈశ్వర్‌కు ముఖ్య అనుచరుడైన లింగన్న గత అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మారం మండలంలో కొత్తూర్‌లో అత్యధిక మెజార్టీ రావడంతో తనవంతు కృషి చేశారు. మండల వ్యాప్తంగా నంబర్ వన్ మెజార్టీ ఇక్కడే లభించింది. గత పక్షం రోజుల క్రితమే గ్రామంలో పర్యటించిన ఈశ్వర్ తన ప్రసంగంలో గెలుపు ఆవశ్యకతను వివరించారు. నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తులుగా పేరున్న లింగన్న, భద్రమ్మ దంపతులకు మరో అవకాశం కలిసి వచ్చింది.

టిఆర్‌ఎస్‌కు సర్పంచ్ కాంగ్రెస్‌కు ఉప సర్పంచ్ పదవి

- క్షేత్రస్థాయిలో కొన్ని గ్రామాల్లో ఒప్పందాలు
- పార్టీకి పట్టున్న గ్రామాల్లోనూ పత్తాలేని కాంగ్రెస్



మన తెలంగాణ/హైదరాబాద్ : పోటీపోటీగా ఉన్న గ్రామాల్లో టిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య క్షేత్ర స్థాయిలో ఒప్పందాలు జరుగుతున్నాయి. అధికార పార్టీకి సర్పంచ్ పదవిని ఇచ్చేందుకు కాంగ్రెస్ ఆసక్తి చూపుతోంది. ఇందుకు బదులుగా ఉప సర్పంచ్ పదవిని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోంది. అలాగే సర్పంచ్ పదవి తీసుకున్న వారికి ఒక వార్డును తక్కువగా ఇచ్చే విధంగా అంగీకారం జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న గ్రామపంచాతీల్లోనే ఈ పరిస్థితి కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలపై కాంగ్రెస్ పెద్దగా ఆసక్తి చూపలేదు. అందుకే పార్టీకి చెందిన అగ్రనాయకులంతా దూరంగా ఉన్నారు. ద్వితీయ శ్రేణి నాయకత్వం బలంగా ఉన్న గ్రామాల్లో మాత్రం అధికార టిఆర్‌ఎస్‌కు గట్టిపోటీ ఉంటోంది. అయితే పోలింగ్ తేది (ఈ నెల 21) దగ్గరపడుతున్న నేపథ్యంలో స్థానికంగా రెండు పార్టీల నేతలు పరస్పర అవగాహన చేసుకుంటున్నారు. చివరి క్షణం వరకు పోటీ పడి ఎవరో ఒకరు పరాజయం పాలు కావడం కంటే ముందస్తు ఒప్పందం చేసుకుని సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను పంచుకోవడమే మేలన్న ఉద్దేశానికి వస్తున్నారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో పరస్పరం సహకారం చేసుకుంటూ పదవులను పంచుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇందుకు కొత్తగూడెంలోని పాల్వంచ మండలం ప్రత్యక్ష నిదర్శనం. ఈ మండలంలోని సోములగూడెం గ్రామ పంచాయతీని కాంగ్రెస్‌కు కంచుకోటగా మండల ప్రజలు భావిస్తుంటారు. కానీ ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీకి తీరని ఎదురుదెబ్బ తగిలింది. కనీసం పోటీ చేయడానికి ఒక అభ్యర్థి కూడా దొరకలేదు. ఈ గ్రామం పరిధిలో మొత్తం ఎనిమిది వార్డులు ఉండగా వాటిల్లో నాలుగు వార్డులను, ఉపసర్పంచ్ పదవిని కాంగ్రెస్ తీసుకుంది. కాగా ఇందుకుగానూ టిఆర్‌ఎస్‌కు సర్పంచ్ పదవితో పాటు మూడు వార్డులను త్యాగం చేయడానికి అంగీకరించింది. దీంతో కాంగ్రెస్‌కు ఎంతోకాలంగా పెట్టని కోటగా ఉన్న ఈ గ్రామంలో వారు పట్టును కోల్పోయినట్లుగా ప్రజలు భావిస్తున్నారు. దీంతో గత ఎన్నికల వరకు ఏకచత్రాధిపత్యంగా కాంగ్రెస్ ఏలిన కోటలో మొట్టమొదటి సారిగా టిఆర్‌ఎస్ పాగ వేయబోతోంది. నామినేషన్ల గడువు పూర్తియ్యేసరికి సర్పంచ్ పదవికి కేవలం రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు అయ్యాయి. అవి కూడా టిఆర్‌ఎస్‌కు చెందిన అభ్యర్థి, డమ్మీ అభ్యర్థులవే కావడంతో అక్కడ ఏకగ్రీవం లాంఛనమేనని తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితి పలు గ్రామ పంచాయితీల్లో నెలకొందని సమాచారం. దీంతో పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు శరాఘాతమేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పార్టీ కోటలు ఒక్కటొక్కటిగా కూలిపోతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇందుకు నిదర్శనం కాగా, ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రత్యర్థి పార్టీలు బలంగా ఉన్న గ్రామ పంచాయతీలను పక్కనపెడితే కనీసం కాంగ్రెస్‌కు కంచుకోటలుగా ఉన్న పలు గ్రామాల్లోనూ అభ్యర్థులు నామినేషన్లు కూడా వేయలేకపోయారు. దీనిని బట్టే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి ఎంత దిగజారి ఉందో ఊహించవచ్చు. రాష్ట్రంలో మూడు విడతలుగా జరుగుతున్న పంచాయతీల్లో మొదటి విడతగా ఈ నెల 21న 4,479 సర్పంచ్‌లకు, 97,690 వార్డులకు ఎన్నికలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ

ఎంసిహెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్ బి.పి.ఆచార్య



మన తెలంగాణ/రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : ఉద్యోగుల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వీలుగా జిల్లా కేంద్రాలలో శిక్షణ కేంద్రాలను నెలకొల్పుతున్నట్లు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ బి.పి.ఆచార్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రాంతీయ శిక్షణా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ లోకేష్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉమ్మడి జిల్లా కేంద్రాలలో శిక్షణ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. శిక్షణ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 30 లక్షల మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, సమాచార హక్కు చట్టం, కంప్యూటర్ శిక్షణ, ఇంగ్లీషులో నైపుణ్యం వంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఉద్యోగికి శిక్షణ ఇవ్వాలన్న ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం వలన హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాలు, సచివాలయం తదితర శాఖల ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి సెంటినరి మెమోరియల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ హరీష్, డిఆర్‌ఓ ఉషారాణీ, జిల్లా మేనేజర్ రాజేందర్ రెడ్డి, డిఇఓ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో అణువిద్యుత్‌దే అగ్రస్థానం



మన తెలంగాణ/గజ్వేల్ : సమాజంలో నానాటికీ విద్యుత్ వినియోగం పెరుగుతున్న ఈ దశలో చౌకగా ఉత్పత్తి చేసే అవకాశం ఉన్న అణు విద్యుత్‌ను వినియోగించుకునే అవకాశాలు అనివార్యం కాబోతున్నాయని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అలామిక్ రీసెర్చ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్రామన్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోని డిగ్రీ కళాశాలభౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సురక్షిత మార్గాల ద్వారా అణు ధార్మికతను సామాజిక పురోగతికి వినియోగించుకోవచ్చన్నారు. అణు రియాక్టర్ల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను, భయాలను తొగించాల్సిన అవసరం ఉందన్నారు. రేడియేషన్ వైద్య రంగంతో పాటు ఇతర అనేక రంగాల్లో ఉపయోగిస్తున్నారని ఆయన చెప్పారు. గ్రానైట్, సిమెంట్ భవనాల నుంచి, కనకాంబరాల వంటి పుష్పాల నుంచి కూడా రేడియేషన్ వస్తుందన్నారు. మితిమీరిన సెల్ ఫోన్ వినియోగం కూడా హానికరమైన రేడియేషన్‌కు తువన్నారు. ఇతర అంశాల ద్వారా వచ్చే రేడియేషన్ కంటే అణు రియాక్టర్ల ద్వారా వచ్చే రేడియేషన్ వల్ల దుష్ప్రభాలు తక్కువేనని ఆయన అన్నారు. థోరియం, యురేనియం వంటి సహజ ధార్మిక పదార్థాలు అధికంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటన్నారు. దేశ ప్రగతికి అణు శక్తిని విరివిగా ఉపయోగించుకోవాలన్నారు. బార్క్ వంటి అణు పరిశోధన కేంద్రాల్లో విద్యార్థులకు అద్భుత అవకాశాలున్నాయన్నారు. ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్స్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ప్రొ. మధు మాట్లాడుతూ అణుశక్తి వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన పెరగాలన్నారు. శాస్త్రీయమైన అవగాహన లేకుండా గుడ్డిగా వృతిరేకించటం సరైంది కాదన్నారు.

వెలమలు అన్ని రంగాల్లో రాణించాలి

ఘనంగా ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ ఆవిర్భావ వేడుక





మన తెలంగాణ/ సికింద్రాబాద్ : సామాజిక సేవా కార్యక్రమాల్లో వెలమల పాత్ర మరువలేనిదని ఎంఎల్‌సి భాను ప్రసాదరావు అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని చిరాన్‌పోర్ట్స్ క్లబ్‌లొ జరిగిన ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ ఆవిర్భావ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశ విదేశాల్లో ఉన్న వెలమ సామాజిక వర్గానిచెందిన పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి వెలమ కులానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సూచనలు సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, విద్యా తదితర రంగాలలో వెలమలు రాణించాలన్నారు. వెలమలు నీతి నిజాయితీలకు ప్రతీకన్నారు. సమాజ శ్రేయస్సు కోసం వెలమలు ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ సాధనలో వెలమల పాత్ర మరువలేనిదన్నారు. వెలమలు ఇతర సామాజకి వర్గాలకు మార్గదర్శిగా ఉండాలన్నారు. తాము ఎదుగుతూ ఇతర వర్గాలకు చేయూతనందిస్తున్నందునే సమాజంలో వెలమలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. గ్రామాలు, పట్టణాలు, దేశ, విదేశాలో ఉన్న వెలమలు ఐక్యతగా మెలుగుతూ జాతి అభివృద్ధికి పాటుపడాలన్నారు. అర్థికంగా వెనుకబడిన వెలమలకు చేయుతనందించాలన్నారు. జనాభాలో అతి తక్కువ శాతం ఉన్న వెలమలు ఉన్నత పదవుల్లో ఉండటానికి కారణం వారి నీతి, నిజాయితీ, సామాజిక సేవా కార్యక్రమాలే కారణమన్నారు. 1972లో మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వెలమ సంఘాన్ని స్థాపించి వెలమల అభివృద్ధికి బాటలు వేశారని ముందు చూపుతో ఆయన ఏర్పాటు చేసి సంఘం ద్వారా అనేక మంది ఉన్నత స్థితిలో ఉన్నారని దేశ విదేశాలలో స్థిరపడటం జరిగిందన్నారు. మాట తప్పని నైజం, ముక్కుసూటి తనం, పోరాడేతత్వం, ఆత్మాభిమానం వెలమ సొంతమన్నారు. ప్రాణాలకు తెగించి కెసిఆర్ తెలంగాణ కోసం పోరాటం చేశారని, కెసిఆర్ అడుగుజాడల్లో నడిచి స్వరాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెలమ ప్రజా ప్రతినిధులు లక్ష్మీ నారాయణ, సుధాకర్‌రావు, మాజీ వైస్ చాన్సలర్ తిరుపతి రావు, టెక్ మహీంద్ర సిఇఓ విజయ్ రంగినేని, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ సభ్యులు రమేష్ గుడపూరి,నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రావు, మహేష్, మాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

నలుగురికి తీవ్ర గాయాలు

మనతెలంగాణ/ఇబ్రహీంపట్నం: చికిత్స నిమిత్తం ఓర్ఆర్ఆర్‌పై హైదరాబాద్‌కు తరలిస్తుండగా శంషాబాద్ నుంచి అతి వేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో అంబులెన్స్‌లోని ముగ్గురు అక్కడిక్కకడనే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో చేటు చేసుకుంది. సిఐ నరేందర్ వెల్లడించిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున బ ళ్ళారికి చెందిన బుల్లిరెడ్డి వెంకటేశ్వరరావు (60) గత కొంత కాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వెంకటేశ్వరారవుకు వైద్యం చేయించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్ళారు. వైద్యం చేయించుకున్న వెంకటేశ్వరారవు అతని భార్య సుబ్బలక్ష్మీ, కొడు కు హేమచందర్, అల్లుడు శ్రీనువాస్, వెంకటేశ్వరారవు అన్న రామారావుతో కలిసి అంబులెన్స్‌లోఇద్దరు డ్రైవర్లు శివ, (24)ఏలూర్ నుంచి అంబులెన్స్‌లో గురువారం కర్నాటక రాష్ట్రం నుంచి బళ్ళారికి ఓటర్ రింగ్ రోడ్డు నుంచి బయలుదేరారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాల వద్ద అవుటర్ రింగ్ రోడ్డు వండర్‌లా సమీపంలోని రాగానే శంషాబాద్ నుంచి హైదరాబాద్ లోని హస్తినాపూర్ వెళుతున్న ఇన్నోవా నంబర్ టిఎస్ ఇజెడ్ 0801 అంబులెన్స్‌ను (ఎంహెచ్ 26 ఎన్ 9244) అతి వేగంతో రాంగ్‌రూట్‌లో వచ్చిన ఇన్నోవా కారు డివైడర్‌ను ఢీ కొట్టడంతో అంబులెన్స్‌లో అనారోగ్యంతో ఉన్న వెంకటేశ్వరారవు అతని భార్య సుబ్బలక్ష్మీ, ఏలూరుకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ శివ, అక్కడిక్కడనే మృతి చెందారు.

అలుపెరగని పోరాట యోధుడు శివరామిరెడ్డి



మనతెలంగాణ/హైదరాబాద్ : కమ్యూనిస్టు యోధుడు శివరామిరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిష్కలంకమైన వ్యక్తి శివరామిరెడ్డి అని ఆయన పేర్కొన్నారు. అలుపెరగని పోరాట యోధుడని, తొలితరం కమ్యూనిస్టు అని ఆయ న కొనియాడారు. కడప జిల్లా కమలాపురం ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సంక్షేమం, కడప జిల్లా అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా శివరామిరెడ్డి కృషి చేశారన్నారు. కమ్యూనిస్టు నిర్మాతల్లో ఒకరని, కడప, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి ఆయన ఎంతగానే కృషి చేశారని సురవరం గుర్తు చేశారు. కడప జిల్లా ఉద్యమ చరిత్రలో ఆయన పేరు నిలిచిపోతుందన్నారు. నేటితరం కమ్యూనిస్టు ఉద్యమ నాయకులకు స్ఫూర్తి ప్రధాతగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు. శివరామిరెడ్డి ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ అగ్రనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషుల మధ్య ఈ అంత్యక్రియలు జరిగాయి. తొలుత ఎమ్మె ల్యే క్వార్టర్స్ నుంచి అంతిమయాత్ర ప్రారంభ మై వివిధ ప్రాంతాల మీదుగా ఫిలింనగర్ మహాప్రస్థానానికి చేరుకుంది. అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, సిపిఐ పార్టీ శ్రేణులతోపాటు కడప జిల్లా నుంచి అనేక మంది తరలివచ్చి కడసారి శివరామిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి అంజలి ఘటించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఐప్సో కార్యదర్శి డా.డి.సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలు సంతోషకరం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేటలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరగడం ఎంతో సంతోషంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ నెల 12 నుంచి జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలు ప్రారంభం కానుండటంతో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా పోటీలు పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు సతీష్, శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

చోరీకి చెడ్డీ గ్యాంగ్ యత్నం

మన తెలంగాణ / ఎల్.బి.నగర్ : గుర్తు తెలియని దుండగులు ఓ అపార్ట్‌మెంట్‌లో దూరి దొంగతనానికి పాల్పడుతుండగా అప్రమత్తమైన వాచ్‌మెన్ అరవడంతో అతడిపై దాడిచేసి పారిపోయారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట మోహన్‌నగర్‌లోని మల్లిక మెట్రో మనోహర్ అపార్ట్‌మెంట్‌లోకి శుక్రవారం తెల్లవారుజామున ఐదుగురు దుండగులు వచ్చారు. వీరిలో నలుగురు అపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళగా మరొకడు వాచ్‌మెన్ రూం వద్ద నిలబడి రోడ్డుపైకి చూస్తూ నిల్చున్నాడు. పైకి వెళ్లిన నలుగురు దుండగులు ఫ్లాట్ నెంబర్ 203 తలుపులు పగులగొట్టి లోనికి వెళ్ళి బీరువాను తెరిచారు. దుండగులు రావడాన్ని గమనించిన వాచ్‌మెన్ అప్రమత్తమై పై పోర్షన్‌లో ఉంటున్న ఓ మహిళకు సెల్‌ఫోన్‌లో విషయం చెప్పాడు. దీంతో ఆ మహిళ బైటికి వచ్చి దొంగలు దొంగలు అంటూ అరవడంతో దుండగులు పరారయ్యారు. వీరిని ప్రతిఘటించిన వాచ్‌మెన్‌పై దాడిచేసి గాయపరిచి పారిపోయారు. బాధితులు చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

కల్తీ నూనె వ్యాపారుల అరెస్ట్



మన తెలంగాణ / సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణంలో కల్తీ నూనెను విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ సిఐ బన్సీలాల్ తెలిపారు. లూజ్ ఆయిల్ కల్తీ చేస్తూ ప్రజలకు అమ్ముతున్నారని విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సిరిసిల్లకు చెందిన పత్తిపాక జగదీశ్వర్, యెల్లె లక్ష్మణ్, జక్కని రమేశ్, వంగరి వేణుగోపాల్, వేములవాడకు చెందిన కటకం కిషన్‌లను అరెస్ట్ చేశామన్నారు. వీరి నుండి కల్తీ ఆయిల్ సేకరించామన్నారు. కల్తీ ఆయిల్ అమ్మేవారు తమ తీరు మార్చుకోకపోతే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పిడి యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మేడారాన్ని సందర్శించిన మహిళా,శిశు సంక్షేమ కార్యదర్శి



మన తెలంగాణ/ధర్మారం : కాళేశ్వరం పర్యటనలో భాగంగా మేడారంలోని ఆరవ ప్యాకేజిని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, వికలాంగుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.జగదీశ్వర్ శుక్రవారం రాత్రి సందర్శించారు. భూగర్భంలోని రెండు సొరంగ మార్గాలతో పాటు సర్జిపూల్, పంప్ హౌస్‌లు, గ్యాస్ ఆధారిత స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.జగదీశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే గొప్ప దిక్సూచి ప్రాజెక్టు నిలుస్తుందని అభివర్ణించారు. సిఎం కెసిఆర్ అకుంఠిత దీక్షతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు స్వల్ప వ్యవధిలో పూర్తి కావడం హర్షనీయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఎల్లంపల్లి నుండి మేడారం రిజర్వాయర్‌కు నీరు అందించే 6వ ప్యాకెజ్‌ను పనులు అద్భుతంగా ఉన్నాయని జగదీశ్వర్ మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ సిబ్బందిని అభినందించారు. ప్రిన్సిపాల్ కార్యదర్శి వెంట జిల్లా మహిళా శిశు సంక్షేమ వికలాంగుల శాఖ అధికారి చంద్రా ప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ కల్లెం శ్రీనివాస్ రెడ్డి, ఇఇ నర్సింగరావు, విఆర్‌ఒ రమేష్ పాల్గొన్నారు.

నర్మాల జలాశయంలో మత్స్యకారుడి మృతి



మనతెలంగాణ/గంభీరావుపేట : గంభీరావుపేట మండలం నర్మాల జలాశయంలో మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన తోకల లింగం(40) అనే మత్స్యకారుడు చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాతపడగా గురువారం మృతదేహం బయటకు తీశారు. పోలీసుల కథనం మేరకు మాచారెడ్డికి చెందిన తోకల లింగం జీవనోపాధిలో భాగంగా ఈ నెల 7న నర్మాల జలాశయానికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు జలాశయం వద్దకు వచ్చి చూడగా మృతునికి సంబంధించిన వస్తువులు కనిపించాయి. మూడు రోజులకు మృతదేహం నీటిపైకి తేలడంతో పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా చేశారు. మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య పార్వతి ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు. కడుబీద కుటుంబం అయిన బాధితులకు ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

గొర్రెల సంఖ్యలో తెలంగాణ టాప్

- గొర్రెలు, మేకల పెంపకందార్ల సమాఖ్య ఎం.డి డాక్టర్ లక్ష్మారెడ్డి
- ఉచిత గొర్రెల పంపిణీ పథకంతో పరిస్థితి మారింది
- రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 2.24 కోట్లకు పెరిగింది



మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలో గొర్రెల సంఖ్య, మాంసం వినియోగంలో తెలంగాణ రాష్ట్రం టాప్ ప్లేస్‌లో నిలుస్తుందని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందార్ల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. జాతీయ పశుగణన కొనసాగుతూ ఉందని, ఇందులో మన రాష్ట్రమే గొర్రెల సంఖ్యలో మొదటి స్థానంలో ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. 2017 జూన్‌లో రాష్ట్రంలో ఉచిత గొర్రెల పథకం అమలుచేసే నాటికి తెలంగాణలో గొర్రెల సంఖ్య కేవలం కోటి మాత్రమేని ఆయన శుక్రవారం మీడియాకు తెలిపారు. ఆ పథకం కింద ప్రభుత్వం చుట్టు పక్క రాష్ట్రాల నుంచి 74 లక్షల గొర్రెలను గొల్ల కుర్మలకు పంపిణీ చేసింది. వీటికి 55 లక్షల పిల్లలు పుట్టాయని, దీంతో రాష్ట్రంలో కొత్తగా 1.28 కోట్ల గొర్రెలు తయారయ్యాయన్నారు. ఇప్పటివరకు దేశంలో అత్యధిక గొర్రెలు ఉన్న రాష్ట్రంగా రాజస్థాన్, తెలంగాణ ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గొర్రెల పథకం దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తుందని ఆయన వివరించారు. పథకం కోసం ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు కేటాయించిందని, అందులో రూ. 3 వేల కోట్లు జాతీయ సహకారాభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) ద్వారా రుణం పొందింది.

మరో 20 శాతం నిధులను కేంద్రం సబ్సిడీగా అందించింది. మిగిలిన సొమ్మును రైతులు తమ వాటాగా చెల్లించారు. ఒక్కొక్క యూనిట్ వ్యయం రూ. 1.25 లక్షలు కాగా, ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అంటే రూ. 93,750 ఇచ్చింది. లబ్ధిదారుడు మిగిలిన 25 శాతం అంటే రూ. 31,250 చెల్లించారన్నారు.

పెరిగిన మాంసం ఉత్పత్తి...

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గొర్రెల పంపిణీ పథకంతో రాష్ట్రంలో వాటి సంఖ్య పెరగడమే కాకుండా మాంసం ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఏడాది సగటున రాష్ట్రంలో 26,839 మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి అవుతుంది. మాంసం ఉత్పత్తిలో 15 శాతం వృద్ధి సాధించినట్లు లక్ష్మారెడ్డి వెల్లడించారు. 2017 జూన్‌కు ముందు రాష్ట్రానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రోజుకు దాదాపు 500 నుంచి 600 లారీల గొర్రెలు దిగుమతి అవుతుండేవి. ప్రస్తుతం ఈ సంఖ్య 100కు పడిపోయినట్లు అధికారులు తెలిపారు. మాంసహారం తీసుకునే వారిలో సగటున ప్రతీ వ్యక్తి ఏడాదికి 7.5 కిలోల మాంసం వినియోగిస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో 97 శాతం మంది మాంసాహారులే ఉన్నారన్నారు. జాతీయ పోషకాహార సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి ఒక మనిషి 11 కిలోలు వినియోగించాల్సి ఉంది. ఆ స్థాయిలో ఏ రాష్ట్రం కూడా వినియోగించకపోయినప్పటికీ... వినియోగించే రాష్ట్రాల్లో తెలంగాణ 7.5 కిలోలతో మొదటి స్థానంలో ఉందన్నారు.

కల్కి చెరువు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం

- నత్తనడకన పనులపై ఆగ్రహం
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశం



మన తెలంగాణ/బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నత్తనకడన పనులపై ఇరిగేషన్ డిఇపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యార్థం ఆహ్లాదకరమైన వాతావరణంలో సాయంత్రం గడిపేందుకు కల్కి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా ఏర్పాటు చేసేందుకు టిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొస్తుంటే క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, వేగవంతంగా పనులు పూర్తిచేసి మినీ ట్యాంక్ బండ్‌గా పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. టర్ఫింగ్, గార్డెనింగ్, ప్లే గ్రౌండ్ పనుల తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్లాట్ ఫాం, కల్కి చెరువులో నీటి పరిమాణం తదితర వాటిని పరిశీలించారు. సిఎం కెసిఆర్ అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని, క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల పథకాలు నీరు గారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పనులను వేగవంతంగా, నాణ్యతతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, నాయకులు ఎర్వల కృష్ణారెడ్డి, నార్ల సురేష్, జంగం గంగాధర్, మోహన్ నాయక్, ఎజాస్, కొర్ల పోతురెడ్డి, బాడీ శ్రీనివాస్, లింగం, శ్రీనివాస్, అర్బాస్, టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసమే క్రైం

- పథకం ప్రకారమే బిల్డింగ్ బ్లాస్టింగ్ చేసినట్లు నిర్ధారించిన పోలీసులు
- సమావేశంలో ఏసిపి గంటా వెంకట్రావు



మనతెలంగాణ/ఖమ్మం క్రైం : నగరంలోని అక్టోబర్ 29న కమాన్‌బజార్‌లో బండారు కుమార్ ఇల్లు బ్లాస్ట్ అయిన విషయం తెలిసిందే రెండు నెలల్లో పోలీసులు విచారించి అ షాపు యజమాని శ్రీనివాస్ ముద్దాయిగా నిర్ధారించారు. శుక్రవారం వన్‌టౌన్ పీఎస్‌లో పోలీసులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగర ఏసిపి గంటా వెంకట్రావు మాట్లాడుతూ తగలబడిన షాపు యజమాని దేవాండ్ల శ్రీనివాస్ నర్సంపేట నివాసి. బట్టల వ్యాపారం చేస్తూ 1994 సంవత్సరంలో హన్మకొండలో శ్రీనివాస్ ఫ్యాషన్ పేరుతో పెద్ద ఎత్తున్న బట్టల వ్యాపారం నిర్వహించాడు. వ్యాపారంలో భారీ నష్టం జరిగిందని నర్సంపేటలోని అతని తండ్రి వెంకటయ్య షాపు నిర్వహణ బాధ్యతలు చేసేవాడు. రెండో షాపులోనూ నష్టం రాగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో మిత్రులతో కలిసి హన్మకొండలో నేరాలకు పాల్పడి అరెస్టు అయ్యాడు. అనంతరం విడుదలై సత్తుపల్లిలో శ్రీనివాస వస్త్ర మందిర్ పేరుతో మళ్లీ బట్టల షాపు ప్రారంభించగా అందులోనూ నష్టం రాగా అక్కడ షాపు మూసివేశాడు. ఆ తర్వాత మార్చి 2017లో ఖమ్మంలోని కమాన్‌బజార్‌లో బండారు కుమార్ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకున్నాడు. అక్కడా షాపు నడవక ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి అద్దె నెలకు రూ.60వేలు కట్టలేక, వర్కర్లకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఎదురైంది. బిల్డింగ్ యజమానికి నాలుగు నెలల నుంచి అద్దె చెల్లించకపోవడంతో షాపును ఖాళీ చేయమని కుమార్‌కు చెప్పాడు. అ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎలాగైనా అధికమించాలని భావించిన శ్రీనివాస్ షాపులో ఉన్న స్టాక్‌కు, ఫర్నీచర్‌కు ఇన్సూరెన్సు చేయించి, షాపును తగలబెట్టి ఇన్సూరెన్సు డబ్బులు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో అక్టోబర్ 10న న్యూ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థలో షాపులో ఉన్న స్టాక్‌కు రూ.99 లక్షలు, ఫర్నీచర్‌కు రూ.20 లక్షలు వచ్చే విధంగా ఇన్సూరెన్సు చేయించాడు. మరుసటి రోజే షాపును తగలబెట్టాలని పన్నాగం పన్నాడు. ఖమ్మంకు చెందిన ఐదుగురు కూలీలను పిలిపించి షాపులో ఉన్న సరుకును గుర్రాలపాడుకు తరలించారు. అక్టోబర్ 28న తన కారులో రాత్రి 11 గంటల సమయంలో రఘునాథపాలెం హెచ్‌పీ బంక్‌లో రూ.1880ల పెట్రోల్ తీసుకుని షాపుకు రాత్రి 12.30 గంటల సమయంలో చేరుకొని అందరు నిద్రలో ఉండగా తెల్లవారుజామున 2.30 గంటలకు అ షాపులో పాత స్టాక్‌ను కింద ఫ్లోర్‌లో ఉంచి పెట్రోలు పోసి తగలబెట్టాలని చూశాడు. అయితే పెట్రోల్ అంటు పెట్టడానికి అగ్గి పెట్టె లేకపోవడంతో విద్యుత్ వైర్లతో షాపును అంటించగా షాపులో ఉన్న బట్టలు, ఫర్నీచర్ అంటుకుని పెద్ద మంటలు చలరేగి షాపు పెద్ద శబ్దంతో కూలిపోయింది. ఆ మంటల్లో ముద్దాయి శ్రీనివాస్ చిక్కుకుని ఉండగా పోలీసు, ఫైర్ సిబ్బంది, ప్రజలు కలిసి అతన్ని కాపాడారు. మంటల్లో కాలిన శ్రీనివాస్‌ను ఖమ్మం కిమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేసి అక్కడి నుండి వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు ఏసిపి సదానిరంజన్ తెలిపారు.

చికిత్స అనంతరం డిశ్చార్జ్ కావడంతోనే శుక్రవారం ముద్దాయిని అరెస్టు చేసి పంచనామా నిర్వహించి అద్దె ఇంట్లో ఉన్న స్టాక్‌ను స్వాధీనం చేసుకుని ముద్దాయి శ్రీనివాస్‌ను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐలు బర్పాటి రమేష్, నరేందర్, షుకూర్, ఎస్సై సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఉస్మానియా డెంటల్ ఆసుపత్రి

డైమండ్ జూబ్లీ వేడుకలు

- ప్రారంభించిన డిఎంఇ డాక్టర్ రమేశ్‌రెడ్డి
- హాజరైన పూర్వ విద్యార్థులు



మన తెలంగాణ/గోషామహల్ : ఉస్మానియా దంత వైద్య కళాశాల స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో డైమండ్ జూబ్లీ వేడుకలను ఘనం గా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సమక్ష ంలో ఫొటో ఎగ్జిబిషన్లు, విజయ రహస్యాల ఉపన్యాసాలతో వేడుకలు ప్రారంభమయ్యా యి. ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ఆస్పత్రి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారిని ఉద్దేశించి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ 1959లో ప్రారంభించిన ఉస్మానియా దంత కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థుల సమక్షంలో ఇలాంటి వేడుకలు నిర్వహించుకు నే అవకాశం తనకు దక్కడం గర్వంగా ఉందన్నారు. 24 సీట్లతో ప్రారంభమైన కళాశాల నేడు 100 సీట్లకు చేరుకొని విద్యార్థులకు ఎం తో ఆధునాతన పద్ధతుల్లో బోధనలు సాగిస్తున్నారని ఆయన వివరించారు. ఉచిత దంత క్యాంపులు నిర్వహించేందుకు తెలంగాణ ప్ర భుత్వం అత్యాధునిక సదుపాయాలు, ఎక్యూప్‌మెంట్స్ ఉన్న అంబులెన్సును దంత కళాశాలకు అందజేసిందన్నారు. రానున్న రోజుల్లో అ న్ని ప్రాంతాల్లో దశల వారిగా డెంటల్ క్యాంపులు నిర్వహిస్తామని, అందుకు పూర్వ విద్యార్థులు సైతం సహకారం అందించాలని కోరా రు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు దంత కళాశాలలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త భవనం, పిజి సీట్లు 14 నుంచి 24కు, ఎంబిబిఎస్ సీట్లు 40 నుంచి 100కు పెరిగాయని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటి సారి దంత కళాశాలకు 20 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను రిక్రూట్ చేశామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభు త్వం వైద్య రంగానికి అందిస్తున్న సహకారం ఎన్నటికీ మరవలేనిదని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాల ద్వారా పేదలకు ఉచిత దంత వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైమండ్ జూబ్లీ ఉత్సవాల కార్యనిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎఎస్ నారాయణ, ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ఆస్పత్రి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.చంద్రకాంత్, కార్యదర్శి డాక్టర్ నర్సింహస్వామి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ కృష్ణ ప్రసాద్, సభ్యులు డాక్టర్ వివేక్ వర్ధన్‌రెడ్డి, డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ రామరాజు, డాక్టర్ జెవిఎన్ రావులతోపాటు దాదాపు 600 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఉస్మానియా దంత వైద్య కళాశాల 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తపాల శాఖ అధికారులు ప్రత్యేకంగా రూపొందించిన పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. దంత వైద్య కళాశాల ప్రత్యేకంగా రూపొందిన సావనీర్‌ను డిఎంఈ రమేశ్‌రెడ్డి ఆవిష్కరించారు.

శునకానికి దశదినకర్మ



మన తెలంగాణ/సత్తుపల్లి : నేటి యాంత్రిక జీవన విధానంలో రక్తసంబంధాలు, బంధాలు, అనుబంధాలు, అప్యాయతలు కరువవుతున్న క్రమంలో పెంచుకున్న కుక్కపిల్లపై కన్న బిడ్డకు మించిన ప్రేమను చూపిన ఓ కుటుంబ సభ్యుల ఆప్యాయత ఓ విధంగా వింతే అయినప్పటికీ జీవుల మధ్య ఎన్నడూ చూడని సరికొత్త అనుబంధానికి తెరతీసింది. ఆసక్తికరంగా మారిన ఈ అంశం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోటేశ్వరరావు ఉద్యోగ రీత్యా రైల్వేలో బుకింగ్ క్లర్క్‌గా పనిచేస్తూ పదేళ్ళ క్రితం విజయవాడలో ఓ కుక్కపిల్లను పెంచుకోవాలనే ఆసక్తి మేరకు తెచ్చుకున్న కుక్క పిల్లకు ''మిన్నీ'' అనే నామకరణం చేసి, అపురూపంగా పెంచుకుంటూ వచ్చాడు. గత డిసెంబర్ 31న మిన్నీ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ కుటుంబం బాధ వర్ణనాతీతంగా మారింది. వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు దూరమయ్యారనేలా బాధ ఆ కుటుంబ సభ్యుల్లో మిగిలిపోయింది. కుటుంబ సభ్యులు చనిపోతే ఏ విధంగా అంత్యక్రియలు చేస్తారో అదే విధంగా మిన్నికి కూడా అంత్యక్రియలు జరిపారు. నేటి ఆధునిక సమాజంలో కన్న తల్లి దండ్రులను కూడా పట్టించుకోని అనేక ఘటనలను నిత్యం చూస్తూనే ఉన్నాం. అటువంటి వాటికి అత్యంత భిన్నంగా పెంచుకున్న జంతువును ఇంట్లో మనిషి కన్నా ఎక్కువగాప్రేమించే ఇటువంటి కథ ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారటమే కాకుండా ఆసక్తికరంగా నిలిచింది. మిన్ని దశ దినకర్మలను గురువారం గ్రామంలో బంధువులు, మిత్రులు, గ్రామస్థులను ఆహ్వానించి విందు భోజనంతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మిన్నికి గుర్తుగా ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు రామచంద్రం, పున్నమ్మ, రెడ్యానాయక్, రూపాదేవి, పల్లె రామకృష్ణ, మెచ్చా రాంప్రసాద్, వాడే కృష్ణ, మోదుగు లక్ష్మి, కోటా శ్రీనివాసరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని దివ్యక్షేత్రంగా విస్తరిస్తాం

మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి



మన తెలంగాణ/సూర్యాపేట కల్చరల్ : వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని విస్తరించి దివ్యక్షేత్రంగా మారుస్తామని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ధనుర్మాసంలో భాగంగా వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కుథారి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగి విచ్చేసిన ఆయన మాట్లాడారు. గత నెల రోజులుగా ధనుర్మాస మహోత్సవాన్ని భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రోజురోజుకి భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నందున దేవాలయాన్ని త్వరలో విస్తరిస్తామని తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా కుథారి ఉత్సవంలో భక్తులతో దేవాలయం పోటెత్తింది. ఈ సందర్భంగా గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీసమేతంగా పూజలు నిర్వహించారు. అంతకు ముందు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ వేడుకలలో ఆయా దేవాలయాల ప్రధాన అర్చకులు నల్లాను చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, మురళీధరచార్యులు, సంకర్షణ చార్యులు, శ్రీహరచార్యులు, ఫణికుమారాచార్యులు, సుదర్శనచార్యులు, నాయకులు మోరిశెట్టి శ్రీనివాస్, దేవాలయ ఛైర్మన్ గవ్వా వనజ, ధర్మకర్తలు ఎల్గూరి రాంబాబు, చల్లా లక్ష్మీ కాంత్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



మనతెలంగాణ/పాపన్నపేట: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవాని అమ్మవారిని శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా రాజగోపురం వద్దనుంచి ఆలయ సిబ్బంది, ఇఒ మోహన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నర్సింహ్మాచారి, శంకర్‌శర్మ, మురళిశర్మ, పార్థివశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పాలకమండలి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇఒ మోహన్‌రెడ్డిలు వారికి శాలువలతో సత్కరించారు. అనంతరం హరిత రెస్టారెంట్ ప్రైవేట్ విందుకు హాజరైన అనంతరం పాపన్నపేట మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన లక్ష్మీనగర్ గ్రామంలో అనురాధ, బాచారం గ్రామంలో వెంకటరాములు, ముద్దాపూరంలో ధానయ్య, రామతీర్థం గ్రామంలో సంగం లక్ష్మి, గాజులగూడెం గ్రామ సర్పంచ్‌లను ఎమ్మెల్యే హరీష్‌రావు శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రవికుమార్, సిద్దిపేట శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పాలక మండలి డైరెక్టర్లు దుర్గయ్య, చంద్రయ్య, నాగప్ప, గౌరీశంకర్, నాగయ్య, ఎంపిపి పవిత్రదుర్గయ్య, మండల నాయకులు బాపారావు, జీవన్‌రెడ్డి, బాలాగౌడ్, దుర్గయ్య, మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఇద్దరి ఆత్మహత్య



మన తెలంగాణ, మిర్యాలగూడ క్రైం : పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల తవుడు మిల్లు వద్ద శుక్రవారం ఇద్దరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మాల్యాతండాకు చెందిన ధారావత్ భాస్కర్ (30), అదేగ్రామానికి చెందిన ధారావత్ సాల్కీ(28) ఇరువురు కలసి మిర్యాలగూడకు వచ్చి తెల్లవారు జామున రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా సాల్కీకి గతంలోనే వివాహం కాగా ఇద్దరు చిన్నారులున్నారు. భాస్కర్ అవివాహితుడు. మిర్యాలగూడ మండలం జాలుబాయితండాకు చెందిన సాల్కీకి చివ్వెంల మండలం మాల్యాతండాకు చెందిన రవీందర్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరిద్దరికి ఇద్దరు పిల్లలున్నారు. ఒకే గ్రామానికి చెందిన రవీందర్, భాస్కర్‌లు లారీడ్రైవర్లుగా పనిచేస్తున్నారు. అయితే సాల్కీ భర్త రవీందర్ నెల రోజుల క్రితమే తన భార్య తప్పిపోయినట్లుగా చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు. నెల రోజుల కిందట వెళ్లిన భార్య ఇలా మరొకరితో ఆత్మహత్యకు పాల్పడడం పట్ల పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మన తెలంగాణ/ నల్లగొండ రూరల్: నల్లగొండ మండలం దమన్నగూడెం గ్రామానికి చెందిన కదిరి లింగ య్య(48) శుక్రవారం తెల్లవారుజామున తన పొలం వద్దగల వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. భార్య కదిరి పద్మ తెలిపిన వివరాల ప్రకారం గత 4సంవత్సరాలుగా తమకున్న 4ఎకరాల భూమిలో పత్తి పంట వేస్తున్నారు. ఆ భూమిలో నీటి వసతి కోసం 7బోర్లను వేశారు. వీటికి సంబంధించి రూ.8లక్షలు అప్పుచేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం పంట పూర్తిగా నష్టపోవడంతో అప్పులు తీర్చలేక, ఒక అమ్మాయి పెళ్లికి ఉండడంతో జీవితం మీద కలత చెంది ఉరి వేసుకున్నట్లు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ కొంపల్లి మురళిగౌడ్ తెలిపారు.

చిట్‌ఫండ్ మోసం కేసులో ఇద్దరికి జైలు

మనతెలంగాణ/కొత్తగూడెం : కొత్తగూడెం త్రీటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో 2015లో నమోదైన చీటింగ్ కేసులో ఇద్దరికి జిల్లా కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిట్‌ఫండ్ పేరులో ప్రజలకు రూ.30 లక్షల వరకు మోసం చేసినందుకు గాను త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో 2015లో ఖమ్మం పట్టణానికి చెందిన ఇంటూరి రాంబాబు, ఇంటూరి కవిత, గుదిమళ్ల ఉమావతి, బెల్లంకొండ నరేందర్‌పై చీటింగ్ కేసును అప్పటి సిఐ భోజరాజు కేసు నమోదు చేశారు. ఈ చిట్టీ వ్యాపారులపై విచారణ జరిపి సిఐలు భోజరాజు, రాజగోపాల్‌లు కోర్టుకు నివేదిక సమర్పించారు. శుక్రవారం జిల్లా కోర్టు ఇంటూరి రాంబాబు, గుదిమళ్ల కవితలు దోషులుగా నిర్ధారించి వారికి జిల్లా జడ్డి ఎం.లక్ష్మణ్ శిక్షలు విధించారు. ఐపిసి సెక్షన్ 420సెక్షన్ 5ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రివెన్షన్ ఆఫ్ డిపాజిటర్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 1999 కింద శిక్షణ విధించారు.

ఇక ఇ-పాస్‌తో కిరోసిన్

- అక్రమ కిరోసిన్ దందాకు అడ్డుకట్టు
- ఇక అక్రమ బియ్యం దందాపై 'ఐ' రిస్
- లబ్ధిదారుల కనుపాపలతో అక్రమాలకు చెక్
- ఉమ్మడి జిల్లాలో అమలులోకి వచ్చిన నూతన విధానం
- పూర్తయిన రేషన్ డీలర్ల శిక్షణ
- తీరనున్న వృద్ధులు, వికలాంగుల బాధలు





మన తెలంగాణ/ఖమ్మం ప్రతినిధి : రేషన్ బియ్యం మాదిరిగా ప్రజాపంపిణీ కిరోసిన్‌ను కూడా బయోమెట్రిక్ ద్వారా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రేషన్ బియ్యం పంపిణీని మాత్రమే బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేసి అక్రమ బియ్యం దందాకు చెక్ పెట్టిన విధంగానే కిరోసిన్ దందాకు కూడా అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. ఈనెల నుంచి కిరోసిన్ పంపిణీ కూడా అన్‌లైన్ ద్వారా జరగనుంది. ఆహార భద్రత (రేషన్)కార్డు హోల్డర్‌కి ప్రతి నెల ఒక లీటర్ నీలి కిరోసిన్‌ను పంపిణీ చేస్తారు. ఖమ్మం జిల్లాలో 300మంది హాకర్లు, 669 మందిరేషన్ డీలర్ల ద్వారా ఈ కిరోసిన్ పంపిణీ జరుగుతుంది. ప్రతి నెల 400 కిలోలీటర్ల కిరోసిన్‌ను పంపిణీ చేస్తున్నారు. అయితే బయోమెట్రిక్ ద్వారా కాకుండా మ్యానువల్‌గా అందజేస్తున్నారు. దీనివల్ల నీలి రంగు కిరోసిన్ కూడా నల్లబజార్‌కు తరలివెళ్తుంది. ఖమ్మం రూరల్‌లో కిరోసిన దందా పెద్ద ఎత్తున్న జరుగుతుంది. లబ్ధిదారులు ఎవరికి కిరోసిన్ పంపిణీ చేయకుండానే పంపిణీ చేసినట్లు రికార్డులో నమోదు చేసి ఆ కిరోసిన్‌ను డ్రమ్ముల కొద్ది ప్రయివేట్ మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు ప్రస్తుతం రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నమాదిరిగానే కిరోసిన్‌ను కూడా బయోమెట్రిక్ విధానం ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈనెల1వ తేది నుంచే ఈ కొత్తవిధానం అమలులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం రేషన్ షాపు డీలర్ల వద్ద బయోమెట్రిక్ మిషన్లు ఉన్నందున తొలి దశగా వీరి వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్ ద్వారా కిరోసిన్ పంపిణీ జరుగుతుంది. కొత్త బయోమెట్రిక్ మిషన్ల వచ్చిన తరువాత వాటిని కిరోసిన్ హాకర్లకు అందజేసి వారి వద్ద కూడా అన్‌లైన్‌లో కిరోసిన్ పంపిణీ జరుగుతంది. అప్పటివరకు ప్రస్తుతం నడుస్తున్నపాత విధానంలోనే హాకర్లు కిరోసిన్‌ను విక్రయిస్తారు.

రేషన్ బియ్యంపై 'ఐ' రిస్ నిఘా

రేషన్ బియ్యం అక్రమ దందాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. నిరుపేదలకు అందాల్సిన ప్రజాపంపిణీ బియ్యాన్ని కొంతమంది అక్రమదారులు అడ్డదారిలో పక్కదారి పట్టిస్తున్నారు. లబ్ధిదారులు లేకున్నా ఉన్నట్లు బోగస్ రేషన్ కార్డులను సృష్టించి వారికి చెందాల్సిన బియ్యాన్ని డీలర్లే మళ్లించేవారు. అంతే గాక లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేయకుండా నల్లబజార్‌లో విక్రయించుకునే వారు. రేషన్ బియ్యాన్ని రిసైక్లింగ్ చేసి మళ్లీ రైస్ మిల్లు యజమానులకే విక్రయించేవారు. ఒక దశలో ఈ బియ్యం సముద్రం గుండా బయటి దేశాలకు సైతం తరలివెళ్లాయి. దీనివల్ల ప్రభుత్వానికి కోట్లాది రూపాయాల నష్టం వాటిల్లింది. దీంతో రెండేళల క్రితం ఈ-పాస్ విధానంతో రేషన్ షాపుల్లో బయోమెట్రిక్ (వేలిముద్రలు)విధానంను అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసింది. అయితే రేషన్ కార్డు లబ్ధిదారుల్లో వృద్ధులు, వికలాంగుల వేలి ముద్రలు బయోమెట్రిక్ మిషన్‌లో సరిగా పోల్చలేకపోవడంతో వారికి బియ్యాన్ని పంపిణీ చేసేవారు కాదు. దీంతో వారికి సంబంధించిన బియ్యాన్ని రేషన్ డీలర్లు బయట మార్కెట్లో విక్రయించుకునేవారు. దీంతో ఐరిస్ ద్వారా ఈ అక్రమానికి తెరవేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఆధార్ కార్డ్ నమోదు సమయంలో బయోమెట్రిక్‌తో పాటు ఐరిస్(కనుపాపలు)ను నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే ఐరిస్‌తో అక్రమ దందాకు అడ్డుకట్టవేయాలని భావించింది. ఇందుకుగాను ప్రయోగాత్మకంగా ఖమ్మం జిల్లాలో అమలు చేశారు. ఇక్కడ విజయవంతం కావడంతో ఈనెల1వ తేదినుంచి రాష్ట్రంలో 16 జిల్లాలో అమలు చేస్తున్నారు. అందులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు కూడా ఉన్నాయి. రెండు జిల్లాలో కలిపి మొత్తం 1111 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 6,27,916 ఆహార భద్రత (రేషన్)కార్డులు, ఆరు అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 669 రేషన్ దుకాణాలు, 3,67,592 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. కొత్తగూడెం జిల్లాలో 442 రేషన్ షాపులు, 260324 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ప్రతి నెల వేలాది టన్నుల బియ్యాన్ని ప్రజా పంపిణీ ద్వారా పేద ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యాన్ని పేదలందరికి సక్రమంగా అందేందుకు రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతున్నప్పటికి అనేక అధునిక పద్ధతుల్లో అక్రమాలను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఐరిస్ యంత్రం ద్వారా ఇకపై వేలిముద్రలు సరిగ్గా పడని వారికి బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే1111 ఐరిస్ మిషన్లు రెండు జిల్లాలకు చేరాయి. ఈ మిషన్ల అపరేటింగ్‌పై ఇప్పటికే రేషన్ డీలర్లకు శిక్షణ కూడా ఇచ్చారు.



పలు ప్రాంతాలకు
నేడు జన సాధారణ ప్రత్యేక రైలు



మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 60 జన సాధారణ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. శనివారం ఈ జన సాధారణ రైళ్ల నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు. వాటికి సంబంధించిన వివరాలను అధికారులు శుక్రవారం విడుదల చేశారు. జన సాధారణ రైళ్లకు సంబంధించి ఛార్జీల వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. ఇందులో సికింద్రాబాద్ టు విజయవాడకు రూ.130, విజయవాడ టు హైదరాబాద్ రూ.135, తిరుపతి టు కాకినాడ టౌన్‌కు రూ.175, విజయవాడ టు విజయనగరం రూ.145, విజయనగరం టు విజయవాడకు కూడా రూ.145 నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఈ రైళ్లన్నింటికి 16 జనరల్ సెకండ్ క్లాస్‌తో పాటు ఒక లగేజీ, బ్రేక్ వ్యాన్ కోచ్‌లుంటాయని అధికారులు వివరించారు. ఇందులో ప్రధానంగా 07192 నెంబర్ గల ట్రైన్ సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 7:30 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. ఈ ట్రైన్ నల్గొండ, మిర్యాలగూ డ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, మంగళగిరి స్టేషన్ల మీదుగా బయలుదేరుతుంది. అదే విధంగా 07194 నెంబర్ గల రైలు సికింద్రాబాద్‌లో రాత్రి 11:30 గంట లకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం 7:10 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07195 నెంబర్ గల ట్రైన్ విజయవాడలో ఉదయం 8:35 గం టలకు బయలుదేరి తర్వాత రోజు సాయంత్రం ఐదు గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 07193 నెంబర్ గల మరో ట్రైన్ ఈ ట్రైన్ విజయవాడలో రాత్రి 8:25 గంటలకు బయలుదేరి తర్వాత రోజు తెల్లవారుజామున 2:20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, మంగళగిరి స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తోంది. 07190 నెంబర్ గల రైలు తిరుపతిలో రాత్రి 9:50 గంటలకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం 8:55 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట మీదుగా బయలుదేరుతుంది. దీంతో పాటు 07184 నెంబర్ గల ట్రైన్ విజయవాడలో రాత్రి 9:10 గంటలకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం 7:20 గంటలకు విశాఖనగరం చేరుకుంటుంది. 07185 నెంబర్ కలిగిన ట్రైన్ విజయనగరంలో ఉదయం 7:45 గంటలకు బయలుదేరి సాయంత్రం నాలుగున్నర గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. ఈ రైలు నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారకపూడి, అనపర్తి, సామర్లకోట, పీఠాపురం, అన్నవరం, తుని, నర్సిపట్నం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కోటవలస స్టేషన్ల మీదుగా బయలుదేరుతాయని అధికారులు వెల్లడించారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ టోర్నీకి గురుకుల విద్యార్థిని





మనతెలంగాణ/ డిచ్‌పల్లి : జాతీయస్థాయి సీనియర్ బేస్‌బాల్ టోర్నీకి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని శివాని ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ బి.సంగీత తెలిపారు. డిసెంబర్ 30, 31 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ టోర్నమెంట్‌లో గురుకుల పాఠశాల విద్యార్థిని జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో శివాని కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ నెల 11నుండి15వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరుగనున్న సీనియర్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎంపికైన శివానీని ప్రిన్సిపాల్ సంగీత, ఫిజికల్ డైరెక్టర్ నీరజరెడ్డి తదితరులు సన్మానించారు.

సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు ధర్మారం విద్యార్థిని

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మారం (బి) పాఠశాలలోని పదవ తరగతి చెందిన డి.భార్గవి రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పిడి టి.విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9న జిల్లా క్రీడా అథారిటి మైదానంలో నిర్వహించిన కబడ్డీ ఎంపికలో విద్యార్థిని భార్గవి ఎంపికైందని, ఈనెల 12, 13తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో భార్గవి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా భార్గవిని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

పల్లెకు పయనం

- వాహనాల రద్దీతో కిటకిటలాడుతున్న రహదారి



మన తెలంగాణ / చౌటుప్పల్ : జాతీయ రహదారిపై అప్పుడే సంక్రాంతి సందడి కనిపిస్తోంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన పండుగల్లో ఒకటైన సంక్రాంతిని తెలుగు రాష్ట్రాల ప్రజలు అనాది నుంచీ అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ప్రతియేటా సంక్రాంతి వచ్చిందంటే చాలు హైద్రాబాద్‌లో సగం జనాభా ఖాళీ అయినట్లే... ఒక్కసారిగా లక్షలాది వాహనాల్లో జనం స్వగ్రామాలకు తిరుగు ముఖం పట్టడంతో వాహనాల రాకపోకలతో రహదారులన్నీ రద్దీగా మారుతున్నాయి. అదేక్రమంలో హైద్రాబాద్, విజయవాడ 65 వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ ప్రారంభమైంది. స్కూల్స్, కాలేజీలకు సెలవులు రావడంతో ప్రతి ఒక్కరూ పిల్లా పాపలతో తమ సొంతూళ్లకు ప్రయాణమయ్యారు. దీంతో రహదారులపై కార్లు, బస్సుల సంచారం విపరీతంగా పెరిగి రోడ్లు అత్యంత రద్దీని తలపిస్తున్నాయి. భారీ సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కడంతో చౌటుప్పల్ మండలంలోని పంతంగి, కేతేపల్లి మండలంలోని కొర్లపహడ్, అద్దంకి రహదారిపై గల మాడ్గులపల్లి టోల్‌గేట్ల వద్ద వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ప్రధాన కూడళ్లు, రోడ్డు క్రాసింగుల వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించడం పోలీసులకు కూడా తలనొప్పిగా మారింది. వాహనాలు ఎడతెరిపి లేకుండా దూసుకు వస్తుండడంతో క్రాసింగ్‌ల వద్ద రోడ్లు దాటాలంటే జనం జంకుతున్నారు. ఏదేమైనా ఇంకా మూడు రోజుల పాటు రహదారులు వాహన సంద్రాన్ని తలపించక తప్పే పరిస్థితి లేదు.

మారిన గ్రామాల స్వ'రూపం'

- ఆంధ్రలో పలు మండలాలు, గ్రామాల విలీనం
- ఖమ్మం రెండు జిల్లాలుగా విభజన
- కొత్త మండలాల ఏర్పాటు
- కొత్త మున్సిపాల్టీల అవిర్భావం
- నూతన పంచాయతీల ఏర్పాటు
- శాఖోపశాఖలుగా విస్తరించిన గ్రామాలు



మన తెలంగాణ/ఖమ్మం ప్రతినిధి : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రామాల స్వరూపం మారింది. జిల్లా అవిర్భావం అనంతరం గత ఐదేళ్ళ కాలంలో చోటుచేసుకున్న అనేక పరిణామాల నేపథ్యంలో గ్రామాల రూపురేఖలు మారడమే కాకుండా గ్రామాల భౌగోళిక స్వరూపం కూడా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి తెలంగాణ రాష్ట్రం అవిర్భావించడం, ఆ తరువాత జిల్లాల పునరేకికరణ జరగడం, ఉమ్మడి జిల్లా కాస్త రెండు జిల్లాలుగా రూపాంతరం చెందడం, కొత్త మండలాలు ఏర్పాటు కావడం, అనంతరం తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ఉమ్మడి జిల్లాలో గ్రామాల రూపం మారిపోయింది. 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల నాటికి నేటి ఎన్నికలకు అనేక మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి.

విభజన సమయంలో...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2013 పంచాయతీ ఎన్నికల సమయంలో మండలాలు 46 ఉండగా గ్రామా పంచాయతీలు 770, వార్డులు 7810 ఉండేవి. అప్పట్లో మేజర్ పంచాయతీలు 17, వార్డులు 278 వరకు ఉండేవి. తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పాటైన తరువాత పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన ఐదు మండలాలను పూర్తిగా, మరో రెండు మండలాలను పాక్షికంగా తెలంగాణ నుంచి విడగొట్టి ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. చింతూరు, కూనవరం, కుక్కునూర్, వేలేరుపాడు, విఆర్‌పురం మండలాలను పూర్తిగా, భద్రాచలం మండలంలోని భద్రాచలం పట్టణం మినహా అన్ని గ్రామాలు, బుర్గంపహాడ్ మండలంలోని సీతారాంనగరం, వేలేరు, గణపవరం, రావిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని తొమ్మిది గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసుకున్నారు. ఇప్పుడు ఈ మండలాలన్ని ఎపిలోని రంపచోడవరం, పోలవరం నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను రెండుగా చీల్చి భద్రాద్రి కొత్తగూడెం పేరుతో మరో అదనపు జిల్లాను ఏర్పాటు చేసిన విషయం విధితమే. రాష్ట్రంలో 33 జిల్లాల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను నాలుగు ముక్కలుగా విభజించి మరో నాలుగు మండలాలను మరో రెండు కొత్త జిల్లాల్లో విలీనం చేశారు. వాజేడు, వెంకటాపురం మండలాలను కొత్తగా ఏర్పాటైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విలీనం చేయగా, గార్ల, బయ్యారం మండలాలను కొత్తగా ఏర్పాటైన మహబుబ్‌బాద్ జిల్లాలో కలిపేశారు.

దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు 46 మండలాలు ఉండగా ఆ సంఖ్య 37కి పడిపోయింది. అయితే జిల్లాల పునర్విభజన సమయంలో ఖమ్మం జిల్లాలో ఒక మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆరు మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. దీంతో ఖమ్మం జిల్లాలో 21 మండలాలు, కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలు ప్రస్తుతం ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో ఖమ్మం అర్బన్ మండలాన్ని వీడగొట్టి రఘునాధపాలెం పేరుతో కొత్త మండలాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా చంద్రుగొండ మండలాన్ని వీడగొట్టి కొత్తగా అన్నపురెడ్డిపల్లి కేంద్రంగా కొత్త మండలం, గుండాల మండలాన్ని వీడగొట్టి ఆళ్ళపల్లి కేంద్రంగా మరో మండలం, పినపాక మండలాన్ని విభజించి కరకగూడెం కేంద్రంగా మరో మండలం, కొత్తగూడెం మండలాన్ని విభజించి సూజాతనగర్ పేరుతో కొత్త మండలం, చుంచుపల్లి, లక్ష్మి దేవిపల్లి కేంద్రంగా మరో రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. అంతేగాక 2018లో రాష్ట్ర ప్రభుత్వం తండాలు, గూడెంలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఆ విధంగా ఖమ్మం జిల్లాలోనే 167 పంచాయతీలు కొత్తవి ఏర్పాటయ్యాయి. 2018 ఆగస్టు 2 నుంచి కొత్త పంచాయతీలు మనుగడలోకి వచ్చాయి. ఆ తరువాత వైరా మేజర్ పంచాయతీని మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ చేయడంతో కొణిజర్ల మండలంలోని పల్లిపాడు, దుద్దెపుడి, లాలాపురం, పంచాయతీలను పూర్తిగా, సిద్దిక్ నగర్ గ్రామ పంచాయతీలోని శాంతినగర్ కాలనీని వైరా మున్సిపాల్టీలో విలీనం చేశారు. అంతకు ముందే ఖమ్మం మున్సిపాల్టీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడం వల్ల ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా, ఏదుళ్ళపురం, పోలేపల్లి, చిన్నవెంకటగిరి, గుర్రాలపాడు, గుదిమళ్ళ గ్రామ పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. అయితే ఈ గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయడంపై ప్రస్తుతం కోర్టు స్టే కొనసాగుతుంది. ఖమ్మం రూరల్ మండలంలోని మరికొన్ని గ్రామాలను కొత్తగా ఏర్పాటైన రఘునాధపాలేం మండలంలో విలీనం చేశారు. మొత్తం మీద ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1063 గ్రామ పంచాయతీలు 9570 వార్డులు ఉన్నాయి. వాటికి ఇప్పుడు మూడు దశలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఖమ్మం జిల్లాలో 20 మండలాల పరిధిలో 584 గ్రామాలు, 5338 వార్డులు ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 మండలాల పరిధిలో 479 గ్రామ పంచాయతీలు, 4232 వార్డులు ఉన్నాయి.







పక్కా ప్రణాళికతో విజయం



విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివితే పరీక్ష ఫలితాలను శాసించవచ్చు.విద్యార్థులు ఏటా పరీక్షలు ఎదుర్కోవడం సహజం. ఈ క్రమంలో కొందరు ఒత్తిడికి గురవు తుంటారు. మంచి మార్కులు సాధిం చగలనా? ఎలాంటి ప్రశ్నలు వస్తాయో? సరైన సమాధానాలు రాయగలనా? ఆశించిన మార్కులు రాకపోయినట్లయితే పరిస్థితి ఏమిటీ? ఇలాంటి ప్రశ్నలు మెదళ్లలో కదలాడుతుంటాయి. ప్రణాళిక ప్రకారం చదవడంతో పాటుగా చిన్నచిన్న చిట్కాలను పరీక్ష ఫలితాలను శాసించవచ్చు.

సమాధానాలు రాయడం ఒక కళ ఎంత బాగా చదివినా, ఎంత గుర్తున్నా, రాసే విధానం తెలియక పోతే మంచి మార్కులు సాధించడం కష్టం. చేతి రాత బాగుండాలి, నిర్వచనం ఉంటే యధాతథంగా రాసే ప్రయత్నం చేయాలి.

చిన్న ప్రశ్నలకు రాసే సమాధానాలలో ముఖ్యమైన విషయాలు వదలకుండా రాయాలి, జవాబులో నిర్వచనం ఉంటే ముందుగా రాయాలి, సైడ్ హెడ్డింగ్స్ ముఖ్యమైన వాటికి అండర్ లైన్ చేయాలి, అవసరమైన చోట చిత్రపటాలను గీచి, బాగాలు గుర్తించాలి, పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాలి.

పరీక్షలకు ఎలా చదవాలి:

1. సబ్జెక్టులన్నింటికీ సమయం కేటాయించి ప్రణాళికతో చదవాలి.
2. ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి. ఉదయం 4 గంటల నుండి 6 గంటల మధ్య చదివితే మంచి ఫలితం ఉంటుంది.
3. కష్టమైన, ఇష్టం లేని సబ్జెక్ట్ లకు ఎక్కువ సమయం కేటాయించాలి.4. ప్రతిరోజు అవసరమైనంత నిద్ర పోవాలి
5. ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలి 6. చల్లని పదార్థాలు తినడం, తాగడం చేయకండి

పరీక్షలకు రెండు రోజుల ముందు:

1. మొదటి పరీక్ష కోసమే చదవాలి 2. గతంలో చదివినంతవరకు మాత్రమే రివిజన్ చేయాలి, కొత్తవి నేర్చుకోవాలని ప్రయత్నించకండి. 3. సరిపడా నిద్ర పోవాలి, కష్టపడి చదవడం వరకు మాత్రమే, కాని ఫలితం మన చేతుల్లో ఉండదని గుర్తించాలి. 4. ఎప్పుడూ సంతోషంగా ఉండే ప్రయత్నం చేయాలి.

పరీక్ష రోజున:

1. పరీక్ష సమయానికి కనీసం గంట ముందు చదవడం ఆపండి. 2. పరీక్ష రాయడానికి కావలిసినవి సిద్ధం చేసుకోవాలి 3. స్నేహితులతో సరదాగా మాటలు తప్పించి పరీక్ష గురించి చర్చించకూడదు. 4. పరీక్ష కేంద్రానికి అర గంట ముందుగా చేరాలి.

పరీక్ష హాలులో:

1. 2 నుండి 5 నిముషాలు కళ్ళు మూసుకొని ప్రశాంతంగా కూర్చోవాలి. 2. ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు శ్రద్ధగా విని పాటించాలి. 3. పరీక్షకు సంబందించిన సబ్జెక్ట్ మెటీరియల్, ఇతరాలు చిన్నముక్క కూడా దగ్గర ఉంచుకోకూడదు. 4. ప్రశ్నాపత్రంపై గాని, బెంచ్‌పై గాని, పాడ్‌ల పై గాని ఏమీ రాయకూడదు. తనిఖీ బృందాలు డిబార్ చేస్తారు. 5. ప్రశ్నాపత్రం శ్రద్ధగా చదవాలి. 6. తేలికగా ఉన్న ప్రశ్నకు సమాధానం మొదటగా వ్రాయాలి. 7. మొదటి పేజీ అందంగా రాసే ప్రయత్నం చేయాలి 8. ప్రశ్నలు కష్టంగా అనిపిస్తే కంగారు పడొద్దు, మీకే కాదు, అందరికీ అలాగే అనిపిస్తాయి9. సమాధానాలు రాయడం పూర్తయిన తర్వాత ప్రశ్నల నంబర్లు సరి చూసుకోండి. 9. సమయం మిగిలితే రాసిన సమాధానాలు పున:పరిశీలించుకోవాలి.

పరీక్ష హాలు నుండి బయటకు వచ్చాక:

స్నేహితులతో తప్పొప్పుల గురించి చర్చించకూడదు. 2. ఆహారం తీసుకొని, కొంత సమయం విశ్రాంతి తీసుకుని తరువాతి పరీక్షకు ప్రిపరేషన్ కావాలి.

అన్ని పరీక్షలు అయిన తర్వాత:

నా బాధ్యత నేను నిర్వర్తించాను. ఫలితం నా చేతుల్లో లేదనుకోవాలి.

ఫలితాలు విడుదల అయిన తర్వాత:

వచ్చిన మార్కులను బట్టి లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. ఫెయిలైన విద్యార్థులు, చదువు జీవితంలో ఒక భాగమని, మంచిగా బతకడానికి చాలా మార్గాలున్నాయని అర్థం చేసుకోవాలి. చావడం అనేది మూర్ఖులు మాత్రమే చేస్తారు, తెలివి గల వారు పట్టుదలతో అనుకున్నది సాధిస్తారు.

లక్ష్య సాధనలో ఎన్నో రకాల అడ్డంకులు వస్తూ ఉంటాయి. వాటికి ఎదురీదుతూ వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లినవారే ప్రపంచ విజేతలు అవుతారు. ఒక అంశం నేర్చుకోవాలనుకున్నప్పుడు అది ఎంత కఠినమైనా కానీ ఆ అంశం సాధన దిశగా మిత్రులతో చర్చించి విజేతల, సీనియర్ల సలహాలను తీసుకొని ముందుకు వెళ్తే మీ లక్ష్యం మీకు దాసోహం అవుతుంది.

నీ వెనుక ఏముంది... ముందేముంది..అనేది నీ కనవసరం. నీలో ఏముంది అనేది ముఖ్యం. నీ శక్తి సామర్థ్యాలతో లక్ష్యాన్ని సాధించాలి. ఇలా ఎందరో సాధించారు మనమూ సాధిద్దాం ఇతరులకూ స్ఫూర్తినిద్దాం.

డా అట్ల శ్రీనివాస్ రెడ్డి
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

ఉద్యోగంలో కొత్తా...

ఇవి పాటించండి!

చదువు.. ఆపై ఉద్యోగం వచ్చింది..ఎంతో సంతోషంగా ఉంటుంది..కానీ ఈ సమయంలో కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. 'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ బెస్ట్ ఇంప్రెషన్' అన్నట్టు చేరిన మొదట్లోనే మన ప్రవర్తనా శైలిపై ఒక మంచి అవగాహన ఏర్ప-డాలి. మీ విషయంలో సానుకూల దృక్పథం ఏర్పడాలి. అయితే అదే పరిస్థితి అక్కడున్నంత కాలం కొనసాగాలంటే కొన్నింటిని మీరు తప్పక పాటించాలి.

ఉద్యోగంలోకి చేరిన రోజునుంచి ఒకటే లక్ష్యం కావాలి. అందరితో కలిసిపోవాలి. అక్కడి పని సంస్కృతికి అలవాటు పడాలి. చిన్నచిన్న విషయాల్లో ఏవైనా తేడాలు ఉంటే తెలుసుకుని సరిదిద్దుకోవాలి. కంపెనీ విధానాలు, లేని నిబంధనలు, మర్యాదలు, వివిధ విషయాలకు సంబంధించి అందరూ ఉపయోగించే భాష, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొనే విధానం మొదలైన వాటన్నింటినీ తెలుసుకోవాలి. అక్కడ అంతా కొత్తగా అనిపిస్తే చెప్పినట్టు చేయడమే మంచిది. మీకు ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుని రాసుకోవాలి. అందుకు అనుగుణంగా ప్రవర్తించాలి. కొత్త ప్రదేశంలో ఆఫీసు పద్ధతులన్నీ భిన్నంగా ఉండొచ్చు. మీరు వాటికి అనుగుణంగా కలిసి పోయేలా ఉండాలి. మీ అభిప్రాయాలనూ వెంటనే వ్యక్తం చేయాల్సిన పనిలేదు. మొదట్లో మీ బాస్ చెప్పినట్టుగానే పనిచేయాల్సి ఉంటుంది. మీ నియామకానికి ఆ వ్యక్తే కారణం కావచ్చు. ప్రతిరోజూ బాస్ ఆదేశాల మేరకు పని చేయడమే మేలు. తనతో మాట్లాడి, సలహాలు తీసుకోండి. అప్‌డేట్ అవ్వండి. బాస్ విశ్వాసం పొందే పని మొదట చేయాలి. కొత్త అన్నది కలకాలం ఉండదు. కొత్త అన్న ట్యాగ్ వదలగానే మీ పని పర్యవేక్షణ పరిధిలోకి వెళుతుంది. అప్పట్నించి బాధ్యతలనూ తలకెత్తుకోవాల్సి ఉంటుంది. పనితీరు ద్వారా ఆఫీసులో పేరు సంపాదించుకున్న ఉద్యోగులు ఎవరైనా ఉన్నారేమో తెలుసుకుని అనుసరించడానికి ప్రయత్నించండి. ఇది ఎప్పటికీ తప్పు కాదు. ఎదుగుదలకు సంబంధించి ఒక చార్ట్ రూపొందించుకోండి.

వివిధ టాస్కులు ఎలా చేయాలో తెలుసుకున్న తర్వాత ఒక వారాంతంలో పనితీరును చూసుకోవాలి. మీకై మీరే నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోండి. పనిచేసే క్రమంలో ఎప్పటికప్పుడు లక్ష్యాలకు ఎంతవరకు చేరుకున్నారు.. అన్నది చెక్ చేసుకోండి. సీనియర్ పొజిషన్ లేదంటే ట్రైనీగా చేరినా సరే, తక్కువ మాట్లాడండి, ఎక్కువ పని చేయండి. పరిశీలన, వినడం, పనిలో లీనం కావడం అన్నది మీ మంత్రం కావాలి. అంతా తెలుసు అనుకోవద్దు. అంచెలంచెలుగా నేర్చుకునేందుకు ప్రయత్నం చేయండి. నిశ్శబ్దంగా, ఒంటరిగా ఉండమని కాదు. మీ చుట్టూ ఉన్న సహోద్యోగులను పరిచయం చేసుకోండి. భిన్నంగా ఆలోచించండి. ఆఫీసు నిర్వహించే వివిధ కార్యక్రమాలు, కార్యకలాపాల్లోనూ పాలు పంచుకోండి. జాబ్‌లో విజయం అన్నది ఒక లక్ష్యంగా పెట్టుకోండి.



ఉద్యోగ అవకాశాలు

ప్రభుత్వ ఉద్యోగాలు

నాన్ ఎగ్జిక్యూటివ్‌లు



ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ టెక్నీషియన్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
మొత్తం ఖాళీల సంఖ్య 309
విభాగాలవారీగా: జూనియర్ అసిస్టెంట్ 35, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్131, జూనియర్ మోటార్ వెహికిల్ డ్రైవర్ 13, జూనియర్ స్లింగర్ కమ్ రిగ్గర్2, జూనియర్ సెక్యూరిటీ సూపర్ వైజర్2, జూనియర్ ఫైర్ సూపర్‌వైజర్4, మెడికల్ అసిస్టెంట్14, ఫార్మసిస్ట్9, జూనియర్ హెల్త్ అటెండెంట్6, అసిస్టెంట్ టెక్నీషియన్79, టెక్నికల్ అసిస్టెంట్10 తదితర ఖాళీలు ఉన్నాయి.
అర్హత: సంస్థ నిబంధనల ప్రకారం
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్/ఇంటర్వ్యూ, **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
చివరితేదీ: జనవరి 27
కంప్యూటర్ బేస్డ్ టెస్ట్: 2019 మార్చిలో
వెబ్‌సైట్: www.ongcindia.com

==============================

ప్రభుత్వ ఉద్యోగాలు

వైజాగ్ స్టీల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు
విశాఖపట్నంలోని భారత ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (వైజాగ్ స్టీల్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



పోస్టు: మేనేజ్‌మెంట్ ట్రైనీ, **ఖాళీలు:** 77
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్20, మెకానికల్31, మెటలర్జీ**26. అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.
వయ:పరిమితి: 27 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: గేట్ స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఆన్‌లైన్.
ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తు: జనవరి 10 నుంచి ఫిబ్రవరి 20 వరకు.
https://www.vizagsteel.com

ఆర్‌బీఐలో జూనియర్ ఇంజనీర్లు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలోని వివిధ జోన్లలో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు.
పోస్టు-ఖాళీలు: జూనియర్ ఇంజినీర్(సివిల్/ ఎలక్ట్రికల్) 24.
అర్హత: సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో 65% మార్కులతో డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
వయసు: 2030 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టు ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 27.01.2019.
వెబ్‌సైట్: https://www.rbi.org.in/

==========================

ప్రవేశాలు

ఏపీ ఆదర్శ పాఠశాలలు
ఆంధ్రప్రదేశ్‌లోని 164 ఆదర్శ పాఠశాలల్లో 201920 సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ ప్రకటన వెలువడింది.
అర్హత: సంబంధిత జిల్లాల్లో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అయిదో తరగతి చదివే విద్యార్థులు అర్హులు.
వయసు: ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2007 నుంచి 31.08.2009; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2005 నుంచి 31.08.2009 మధ్య జన్మించి ఉండాలి.



ఎంపిక: ప్రవేశపరీక్ష మార్కుల ఆధారంగా.
ఆన్‌లైన్‌లో పరీక్ష రుసుం చెల్లింపు తేదీలు: 10.01.2019 నుంచి 11.02.2019 వరకు.
ప్రవేశపరీక్ష తేది: 01.04.2019.
గమనిక: పూర్తి వివరాలకు సంబంధిత ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్/ ఎంఈఓను సంప్రదించవచ్చు.
https://apms.ap.gov.in/apms/

సీడ్యాక్, హైదరాబాద్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) కింది కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు: డిప్లొమా ఇన్ మాడర్న్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఎసెన్షియల్స్
కాలవ్యవధి: 5 నెలలు.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణత.
దరఖాస్తు: ఆన్‌లైన్, చివరితేదీ: జనవరి 13
వెబ్‌సైట్: http://www.meghsikshak.in/cdac/dmsde.

తప్పలను ఇట్టే పట్టేస్తారు

అభ్యర్థులు ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లేటప్పుడు తమకు సంబంధించిన సమస్త సమాచా-రాన్ని పొందుపరిచిన పత్రమే రెజ్యుమె. ఒక్కమాటలో చెప్పాలంటే అభ్యర్థి పరిచయ పత్రం. అయితే ఈ విషయంలో కొంతమంది ఉన్నది ఉన్నట్టుగాక.. రెజ్యుమెలో అధిక సమాచారాన్ని అసంబద్ధ సమాచారాన్ని కూడా చూపిస్తారు. అది తప్ప, అలాంటివి చేయకూ-డదు. ఇలాంటి వాటిని రిక్రూటర్ చిటికెలో కనిపెట్టి పక్కన పడేస్తారు. కొందరు రెండు మూడు భిన్న అంశాలను కలగలిపి రెజ్యూమె తయారు చేస్తుంటారు. దీని వల్ల విషయంలోపిస్తుంది. రెజ్యూమె తయారీలో ఏయే విషయాలను పరిగణనలోకి తీసుకోవాలో చూద్దాం..

నైపుణ్యం, తెలివితేటలు ఎక్కువగా కలిపేసి చూస్తారు. నిజానికి ఈ రెండూ వేర్వేరు. ప్రత్యేకించి ఒక విషయంలో నేర్చుకున్నవి, తెలుసుకున్నవి స్కిల్స్ కిందకు వస్తాయి. ఐటికి సంబంధించి ఫలానా లాంగ్వేజ్ తెలుసు అని చెప్పడం స్కిల్ కిందకు వస్తుంది. అదే సంక్షిప్తంగా కోడ్ రాయగలను, ఆఫీస్ అపాయింట్‌మెంట్స్ విషయంలో సింపుల్ ప్రోగ్రామ్ ఇవ్వగలను అని తెలియజేయడాన్ని తెలివితేటలుగా పరిగణించాలి. ఈ రెంటినీ కలిపేయకూడదు.

విషయం ఏదైనా తెలియజేసేటప్పుడు పెద్ద పేరాగ్రాఫ్‌లు రాయకూడదు. అలా రాస్తే కొందరు రిక్రూటర్లు వాటిని పక్కన పెట్టేయవచ్చు కూడా. అనుభవం గురించి రాసేటప్పుడు అంతా ఒక పద్ధతిలో ఉండకపోవచ్చు. మధ్యలో ఖాళీ ఉండవచ్చు. ఆ బ్రేక్ ఎందుకు వచ్చిందో తెలియజేయాలి. అంతే తప్ప వేరే ఇతర కారణాలు చూపరాదు. రెజ్యూమె చూడగానే చాలా వరకు రిక్రూటర్‌కు కారణాలు అర్థం అవుతాయి. అభ్యర్థి ఎంత నిజాయితీగా ఉన్నాడో తెలుసుకోవడం కోసం మాత్రమే కారణాలు అడుగుతుంటారు. ముఖ్యంగా అంకెల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. స్కూల్ విడిచిపెట్టిన సంవత్సరం, జాయినింగ్ తేదీ అలాగే సాధించిన విజయాలను పొందుపర్చడంలో తప్పులు చేయకూడదు. అందులో తప్పులు పడితే, మొత్తం రెజ్యూమె అనుమానాస్పదంగా తయారవుతుంది.

వాస్తవాలతో అంకెలు కలవకుంటే ఇబ్బంది కరమే.సాధించిన విజయాలను వివరించడంలో కలగాపులగం చేయకూడదు. సాధించిన విజయం, అప్పట్లో పని చేసిన కంపెనీ పేరు స్పష్టంగా, ఒక క్రమంలో తెలియజేయాలి. అంతే తప్ప అన్నింటినీ కలిపేయకూడదు. మొత్తం వివరాలన్నీ అర్థమయ్యే విధంగా ఉండాలి.

రిక్రూటర్‌కు మీ దరఖాస్తు ఒక్కటే కొత్త కాదు. ఒక వారంలో వందలాది రెజ్యూమెలను చూస్తూ ఉంటారు.

అందువల్ల కొద్దిగా ఆకట్టుకునే విధంగా టెంప్లేట్లు ఉపయోగించడం మంచిది. అది విషయం తెలియ జేయడానికి సహాయపడాలి. కానీ గజిబిజి చేయకూడదు. వాటిని ఉపయోగించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. విషయం కంటికి ఇంపుగా తెలియజేసేలా, అవసరమైనంత మేరకే టెంప్లేట్స్‌ను ఉపయోగించాలి.

ఇన్ఫీ లాభం 30% డౌన్



- ఆదాయంలో రెండంకెల వృద్ధి
- అంచనాలను అందుకోలేకపోయిన ఐటి దిగ్గజం
- ప్రతి షేరుకు రూ.4 స్పెషల్ డివిడెండ్‌కు బోర్డు ఆమోదం

ముంబై: దేశీయ రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్ మూడో త్రైమాసిక ఫలితాల్లో మిశ్రమంగా రాణించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కంపెనీ ఆదాయం అంచనాలను మించింది. అయితే అత్యధిక ఆపరేటింగ్ వ్యయం వల్ల నికర లాభం అంచనాలను అందుకోలేకపోయింది. రూ.8,260 కోట్ల వరకు షేర్ బైబ్యాక్‌కు ఇన్ఫోసిస్ బోర్డు ఆమోదం తెలిపింది. ఒక్కో షేరు గరిష్టంగా రూ.800 చొప్పున బైబ్యాక్ చేయాలని నిర్ణయించింది. క్యూ3లో కంపెనీ నికర లాభం రూ.3,610 కోట్లతో 30 శాతం క్షీణించింది. గతేడాది ఇదే సమయంలో రూ.5,129 కోట్లు నికర లాభాన్ని నమోదు చేసింది. ఈమేరకు బిఎస్‌ఇ ఫైలింగ్‌లో ఇన్ఫోసిస్ వెల్లడించింది. బెంగళూరుకు చెందిన ఇన్ఫోసిస్ సంస్థ ఆదాయం 20.3 శాతం వృద్ధిని సాధించింది. 2018 డిసెంబర్ నాటి రూ.21,400 కోట్ల ఆదాయం నమోదు చేయగా, అంతకుముందు 2017 సంవత్సరం ఇదే సమయంలో రూ.17,794 కోట్లుగా ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి కరెన్సీ ఆధారంగా రెవెన్యూ అంచనా 8.5- 9 శాతానికి కంపెనీ సవరించింది. క్లయింట్ ఆధారంగా చూస్తే క్యూ3లో వార్షిక వృద్ధి రెండంకెల(10.1 శాతం) వృద్ధిని చూశామని ఇన్ఫోసిస్ సిఇఒ, ఎండి సలీల్ పరేఖ్ అన్నారు. డిజిటల్ బిజినెస్‌లో 33.1 శాతంతో పటిష్టమైన వృద్ధిని నమోదు చేశామని అన్నారు.1.57 బిలియన్ డాలర్లతో భారీ డీల్స్ 2019 సంవత్సరం తమకు ఎంతో ఆశావాహంగా ఉండనుందని ఆయన అన్నారు.

రూ.4 స్పెషల్ డివిడెండ్

కంపెనీ షేరు రూ.4 స్పెషల్ డివిడెండ్‌ను ప్రకటించింది. ఈమేరకు ఇన్ఫోసిస్ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ డివిడెండ్ ద్వారా రూ.2,107 కోట్లను చెల్లించనుంది. ఓపెన్ ఆఫర్ ద్వారా షేర్ల బైబ్యాక్ ఆఫర్‌కు ఇన్ఫోసిస్ బోర్డు ఆమోదం తెలిపింది.

క్యూ3 ముఖ్యాంశాలు

- నికరలాభం రూ.3,610 కోట్లతో 30 శాతం క్షీణత
- మొత్తం ఆదాయం రూ.21,400 కోట్లు, 20 శాతం వృద్ధి
- స్పెషల్ డివిడెండ్‌కు ఇన్ఫోసిస్ బోర్డు ఆమోదం
- ఒక్కో షేరుకు రూ.4 స్పెషల్ డివిడెండ్‌ను చెల్లించనున్న కంపెనీ
- ఓపెన్ ఆఫర్ ద్వారా షేర్ల బైబ్యాక్ ఆఫర్‌కు బోర్డు అనుమతి
- రూ.8,260 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేయనున్న సంస్థ
- ఒక్కో షేరు గరిష్టంగా రూ.800 చొప్పున బైబ్యాక్ నిర్ణయం
- క్యూ3లో 22.26 శాతంగా ఇబిఐటి మార్జిన్
- వృద్ధి అంచనాలను పెంచిన ఇన్ఫోసిస్

అమ్మకాల ఒత్తిడితో నష్టాలు

- 97 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

వరుస లాభాలకు బ్రేక్ పడింది. వారాంతం శుక్రవారం దేశీయ స్టాక్‌మార్కెట్లు చతికిలపడ్డాయి. దేశీయంగా ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యతనిచ్చారు. దీంతో తొలుత ఉత్సాహంగా ప్రారంభమైన మార్కెట్లు ఆ వెంటనే నష్టాల వైపు పయనించాయి. రోజంతా నేలచూపులతోనే కదిలి చివరికి బలహీనంగానే ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ కీలకమైన 36,000 పాయింట్ల మార్క్ దిగువనే కదిలినప్పటికీ చివర్లో కొంతమేర కోలుకుంది. ఆఖరికి సెన్సెక్స్ 97 పాయింట్ల నష్టంతో 36,010 వద్ద ముగిసింది. నిఫ్టీ 27 పాయింట్లు నీరసించి 10,795 వద్ద స్థిరపడింది. కాగా ఎన్ఎస్ఇలో రియల్టీ, పిఎస్‌యు బ్యాంక్స్, ఆటో 1 శాతం మధ్య క్షీణించాయి. ఎఫ్ఎంసిజి మాత్రమే 0.6 శాతం లాభపడింది. నిఫ్టీ దిగ్గజాలలో ఇండస్‌ఇండ్, టాటా మోటార్స్, ఇన్‌ఫ్రాటెల్, టిసిఎస్, యస్ బ్యాంక్, గెయిల్, ఎల్ అండ్ టి, టాటా స్టీల్, ఎస్‌బిఐ, అదానీ పోర్ట్స్ 3 నుంచి 1 శాతం మధ్య నష్టపోయాయి. అయితే ఐటిసి, యుపిఎల్, విప్రో, ఐఒసి, హిందాల్కో, ఒఎన్‌జిసి, ఏసియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, వేదాంతా లాభపడ్డాయి. బిఎస్‌ఇలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.15 శాతం మేరకు బలహీనపడ్డాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 1,420 నష్టపోగా, 1,193 లాభాలతో ముగిశాయి. గురువారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ.344 కోట్లకుపైగా విలువైన స్టాక్స్ విక్రయించింది. దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ.11 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి.



పెట్రోలు 19 పైసలు.. డీజిల్ 28 పైసలు పెరిగింది

న్యూఢిల్లీ: మళ్లీ పెట్రో ధరలు పెరుగుదల వైపు పయనిస్తున్నాయి. శుక్రవారం లీటరు పెట్రోలు ధర 19 పైసలు, లీటరు డీజిల్ ధర 28 పైసలు పెరిగింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు స్వల్పంగా పెరగడం, కంపెనీ ఉత్పత్తి వ్యయం కారణంగా దేశీయంగా ఇంధన రేట్లపై ప్రభావం కనిపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర 19పైసలు పెరిగి రూ.69.07కు చేరింది. లీటరు డీజిల్ ధర 28పైసలు పెరిగి రూ.62.81గా ఉంది. ముంబైలో పెట్రోల్ ధర 19పైసలు పెరిగి రూ.74.72కు చేరింది. డీజిల్ లీటరుకు 30పైసలు పెరిగి రూ.65.73గా ఉంది. అలాగే చెన్నైలో పెట్రోల్ ధర రూ.71.67కు, లీటరు డీజిల్ ధర రూ.66.31కు చేరాయి. కోల్‌కతాలో లీటరు పెట్రోల్ ధర రూ.71.20కు చేరగా, లీటరు డీజిల్ ధర రూ.64.58గా ఉంది. ఈ నెలలో పెట్రో రేట్లు మూడుసార్లు పెరిగాయి.

88 అంగుళాల ఎల్‌జి టివి



ముంబై: ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఎల్‌జి తాజాగా 88 అంగులా ఒఎల్‌ఇడి స్క్రీన్ టీవీని ఆవిష్కరించింది. సిఇసి-2019 కార్యక్రమంలో ఎల్‌జి ఈ టీవీని ప్రదర్శించింది. ఈ టీవీ ప్రత్యేకతలు 88 అంగుళాల 8కె ఒఎల్‌ఇడి స్క్రీన్, 65 అంగుళాల 8కె డిస్‌ప్లే, 65 అంగుళాల 4కె ఒఎల్‌ఇడి స్క్రీన్.. అయితే స్టోర్లలోకి ఎప్పుడు వస్తుందో కంపెనీ వెల్లడించలేదు.

ఫిబ్రవరిలో సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్10



సియోల్(దక్షిణ కొరియా): ఎట్టకేలకు సామ్‌సంగ్ సరికొత్త గెలాక్సీ ఎస్10 ఫోన్ లాంచ్ తేదీని ప్రకటించింది. ఫిబ్రవరి 20న సాన్ ఫ్రాన్సిస్కోలో నిర్వహించే వేడుకలో ఈ ఫోన్‌ను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించింది. అదే సమయంలో ఎంతో కాలంగా ఆతృతగా ఎదురుచూస్తున్న మడతపెట్టే ఫోన్ గురించి కూడా ఈ వేడుకలో సామ్‌సంగ్ ప్రకటన చేయనున్నట్టు తెలుస్తోంది. ఫిబ్రవరి 20 ఉదయం 11 గంటలకు శాన్ఫ్రాన్సిస్కోలో స్పెషల్ ఈవెంట్ వుందంటూ శాంసంగ్ మీడియా ఆహ్వానాలు పంపింది. ఈ సందర్భంగా సామ్‌సంగ్ ఎస్ 10, ఎస్10లైట్, ఎస్ 10 ప్లస్ లాంటి ఫ్లాగ్‌షిప్ ఫోన్లను తీసుకురానుంది. అంతేకాదు సామ్‌సంగ్ ఫోల్డబుల్ ఫోన్ (గెలాక్సీఎఫ్) తోపాటు 5జి డివైస్‌ను కూడా లాంచ్ చేయనుందని సమాచారం. ఎస్9కి కొనసాగింపు గానేమాత్రమే కాకుండా గెలాక్సీ ఫోన్ల 10వ వార్షికోత్సవంగా ఈ ఈవెంట్‌ను నిర్వహించనుంది.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,009.84	-96.66	(-0.27%)
నిఫ్టీ	10,794.95	-26.65	(-0.25%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.43
యూరో	81.13
బ్రిటిష్ పౌండ్	89.84
ఆస్ట్రేలియన్ డాలర్	50.68
కెనెడియన్ డాలర్	53.29
సింగపూర్ డాలర్	52.09
స్విస్ ఫ్రాంక్	71.59
చైనీస్ యువాన్	10.41
మలేషియన్ రింగిట్	17.19
న్యూజిలాండ్ డాలర్	47.86
హాంకాంగ్ డాలర్	8.98
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	232.67
సౌతాఫ్రికన్ రాండ్	5.09

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30720	32855.61	0.1%
ముంబై	31280	33454.55	0%
ఢిల్లీ	31400	33582.89	0%
కోల్‌కతా	31750	33957.22	0%
కేరళ	33957.22	36317.88	0%
బెంగళూరు	30160	32256.68	0.13%
హైదరాబాద్	30720	32855.61	0.1%
గల్ఫ్	137.68	147.25	0%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42049.00
ముంబై	₹ 42049.00
ఢిల్లీ	₹ 42049.00
కోల్‌కతా	₹ 42049.00
హైదరాబాద్	₹ 42049.00



పడకేసిన పారిశ్రామిక ఉత్పత్తి



- నవంబర్‌లో 17 నెలల కనిష్టానికి క్షీణత
- ఐఐపి 0.5 శాతం నమోదు

ముంబై: తయారీ రంగంలో ప్రతికూలతల కారణంగా గతేడాది నవంబర్‌లో దేశీయ పారిశ్రామిక ఉత్పత్తి క్షీణించింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపి) 0.5 శాతంతో 17 నెలల కనిష్టానికి పడిపోయింది. అయితే 2017 నవంబర్‌లో ఫ్యాక్టరీ ఉత్పత్తి 8.5 శాతం ఉండగా, ప్రస్తుత అత్యంత కనిష్టానికి చేరింది. అంతకు ముందు కనిష్ఠ వృద్ధిరేటు 0.3 శాతం 2017 జూన్‌లో నమోదైంది. దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ గణాంకాలను శుక్రవారం కేంద్ర గణాంకాల శాఖ (సిఎస్‌ఒ) విడుదల చేసింది. తయారీ రంగంలోని 23 పరిశ్రమల్లో 10 రంగాలు సానుకూల వృద్ధి నమోదు చేశాయి. ఇక 2018 అక్టోబర్ వృద్ధిని 8.4 శాతం నుంచి8.1 శాతానికి సవరించారు.

తయారీ రంగం 0.4 శాతానికి..

అంతకుముందు ఏడాది 3.2 శాతం పారిశ్రామిక ఉత్పత్తితో పోలిస్తే 2018 ఏప్రిల్-నవంబర్ కాలంలో 5 శాతం వృద్ధి నమోదైంది. ఐఐపిలో ఎక్కువ శాతం ఆక్రమించే తయారీ రంగం అంతకుముందు 10.4 శాతంతో పోలిస్తే నవంబర్‌లో 0.4 శాతానికి తగ్గింది. ఇక మైనింగ్ రంగం విషయానికొస్తే 2017 నవంబర్‌లో 1.4 శాతం వృద్ధితో పోలిస్తే ఈసారి 2.7 శాతంతో పెరిగింది. విద్యుత్ రంగం వృద్ధి 3.9 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగి సానుకూలంగా ఉంది. క్యాపిటల్ గూడ్స్ వృద్ధి 3.7 శాతం నుంచి 3.4 శాతానికి తగ్గింది. మరోవైపు వినియోగదారుల వస్తువుల ఉత్పత్తి 3.1 శాతం నుంచి 0.9 శాతం తగ్గింది. మన్నిక లేని వస్తువుల ఉత్పత్తి 23.7 శాతం నుంచి 0.6 శాతం తగ్గింది.



10 శాతం పెరిగిన బంధన్ బ్యాంక్ లాభం

ముంబై: ప్రైవేట్ రంగం సంస్థ బంధన్ బ్యాంక్ నికర లాభం 10 శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల్లో సంస్థ నికర లాభం రూ.331 కోట్లు నమోదైంది. 2017 ఇదే క్యూ3లో లాభం రూ.300 కోట్లుగా ఉంది. ఈ బ్యాంక్ నికర లాభంపై ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూప్ రుణ భారం ప్రభావం చూపించింది. గత క్యూ3లో రూ.1,336 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం 41 శాతం వృద్ధితో రూ.1,884 కోట్లకు పెరిగింది. ఈమేరకు బ్యాంక్ సిఎండి చంద్ర శేఖర్ ఘోష్ తెలిపారు. రుణాలు 46 శాతం వృద్ధి చెంది రూ.35,599 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. రుణ వృద్ధి జోరుగా ఉండటం, మార్జిన్లు 10.5 శాతంతో పటిష్టంగా ఉండటంతో నికర వడ్డీ ఆదాయం 54 శాతం పెరిగి రూ.1,124 కోట్లకు చేరిందన్నారు. ఇతర ఆదాయం 48 శాతం పెరిగి రూ.234 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నిర్వహణ లాభం రూ.574 కోట్ల నుంచి 57 శాతం పెరిగి రూ.900 కోట్లకు చేరిందని తెలిపారు. గత క్యూ3లో 9.9 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ3లో 10.3 శాతానికి పెరిగిందని వివరించారు.

కర్ణాటక బ్యాంక్ లాభం అదుర్స్



న్యూఢిల్లీ: డిసెంబర్ ముగింపునాటి మూడో త్రైమాసిక(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల్లో కర్ణాటక బ్యాంక్ అద్భుతమైన లాభాలను నమోదు చేసింది. బ్యాంక్ నికర లాభం రూ. 140 కోట్లకు పెరిగింది. 2017లో ఇదే త్రైమాసికంలో రూ. 87 కోట్ల లాభంతో పోలిస్తే ఈసారి లాభం 61 శాతం వృద్ధిని సాధించింది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం పెరిగి రూ. 488 కోట్లకు చేరింది. డిసెంబర్ నాటికి కనీస పెట్టుబడుల నిష్పత్తి(సిఎఆర్) 11.98 శాతంగా నమోదైంది. కాగా.. త్రైమాసిక ప్రాతిపదికన ప్రొవిజన్లు రూ. 196 కోట్ల నుంచి రూ. 209 కోట్లకు పెరిగాయి. స్థూల ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) 4.66 శాతం నుంచి 4.45 శాతానికి స్వల్పంగా తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 3 శాతంవద్దే నిలకడగా ఉన్నాయి. మూడో త్రైమాసికంలో కర్ణాటక బ్యాంక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధిచడంతో నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు ఎదురీదింది. బ్యాంక్ షేరు 0.69 శాతం పెరిగి రూ. 116.10 వద్ద స్థిరపడింది.

ఎన్ఎస్ఇ చైర్మన్ అశోక్ చావ్లా రాజీనామా

ఎయిర్సెల్-మాక్సిస్ కేసు వ్యవహారమే కారణం





న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఇ) చైర్మన్ పదవికి అశోక్ చావ్లా రాజీనామా చేశారు. ఎయిర్‌సెల్ -మాక్సిస్ కేసులో ఆయన్ని విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చినట్టు సిబిఐ ప్రకటించింది. సిబిఐ ప్రకటన చేసిన తర్వాత కొద్ది గంటల్లోనే చావ్లా రాజీనామా చేశారు. న్యాయపరమైన పరిణామాల నేపథ్యంలోనే తాను రాజీనామా చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఎయిర్సెల్- మాక్సిస్ కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరం, ఆయన కుమారుడు కార్తీలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అశోక్ చావ్లా సహా ఐదుగురిని విచారించేందుకు కేంద్రం అనుమతి మంజూరు చేసిన విషయాన్ని ఢిల్లీ కోర్టుకు సిబిఐ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే చావ్లా తన పదవికి రాజీనామా చేశారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
ITC	296.00	291.50	295.35	289.60	5.75	1.99
UPL	787.00	773.00	783.45	773.10	10.35	1.34
IOC	131.55	130.35	131.20	129.90	1.30	1.00
ONGC	145.50	143.65	144.65	143.25	1.40	0.98
HINDALCO	207.95	204.00	205.85	204.00	1.85	0.91
WIPRO	329.90	323.50	328.70	325.75	2.95	0.91
TECH MAHINDRA	701.25	687.00	699.20	694.55	4.65	0.67
VEDANTA	198.30	195.00	196.60	195.45	1.15	0.59
HDFC	2,007.70	1,972.40	1,991.40	1,980.10	11.30	0.57
INFOSYS	685.50	672.50	683.50	679.70	3.80	0.56

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
IndusInd Bank	1,574.00	1,508.30	1,515.15	1,565.90	50.75	3.24
Tata Motors	187.75	179.40	180.30	185.75	5.45	2.93
Bharti Infratel	286.10	276.15	277.20	285.05	7.85	2.75
TCS	1,875.00	1,835.00	1,842.55	1,888.55	46.00	2.44
Larsen	1,393.90	1,361.05	1,369.60	1,392.60	23.00	1.65
GAIL	344.80	337.20	338.60	343.90	5.30	1.54
Yes Bank	189.90	182.75	184.25	186.90	2.65	1.42
Tata Steel	484.25	472.00	474.20	480.40	6.20	1.29
UltraTechCement	3,851.55	3,751.10	3,770.20	3,818.20	48.00	1.26
Maruti Suzuki	7,400.00	7,282.00	7,320.50	7,391.60	71.10	0.96

> 'పేట' చిత్రానికి వస్తున్న అద్భుతమైన స్పందన నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. అభిమానుల సంతోషమే నా సంతోషం. నేను బాగా నటించానని అందరూ అంటున్నారు. ఈ ప్రశంసలన్నీ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్‌కే దక్కుతాయి.
> -సూపర్‌స్టార్ రజనీకాంత్

సినిమా

ఇండియాలోనే తొలి సారిగా..


ప్రభాస్

'రన్ రాజా రన్' ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో యూనివర్సల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'సాహో'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడిన సన్నివేశాలతో ఈ సినిమా రూపొందుతోందట. అంతేకాకుండా ఇంతవరకు ఇండియాలో ఏ సినిమాలో కూడా ఇన్ని విజువల్ ఎఫెక్ట్స్ సీన్లు లేవని చెబుతున్నారు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను దర్శకుడు సుజిత్ హాలీవుడ్ రేంజ్‌లో తీర్చిదిద్దుతున్నాడు. యువి క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శంకర్‌ఎహసాన్‌లాయ్ త్రయం సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా విడుదల కానుంది. ఇక ప్రభాస్ ఈ చిత్రంతో పాటు 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో తన 20వ చిత్రంలో నటిస్తున్నారు. లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం కూడా ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.


దిల్‌రాజు, వెంకటేశ్, వరుణ్‌తేజ్, మెహరీన్, రాజేంద్రప్రసాద్, తమన్నా, అనిల్ రావిపూడి, శిరీష్

సంక్రాంతి అల్లుళ్లుగా వస్తున్నాం

వెంకటేశ్, వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మించిన చిత్రం 'ఎఫ్2'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' అనేది ట్యాగ్‌లైన్. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం శనివారం విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ ''ఈ సంక్రాంతికి 'ఎఫ్2' చిత్రంతో సంక్రాంతి అల్లుళ్లుగా వస్తున్నాం. కథ, దర్శకుడిని నమ్మి ఈ సినిమా చేశాను. నిర్మాత దిల్‌రాజుతో నాకు మంచి అనుబంధం ఉంది. దర్శకుడు అనిల్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. దృశ్యం, గురు సినిమాల తర్వాత చేసిన సినిమా ఇది. వరుణ్‌తేజ్, రాజేంద్రప్రసాద్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా అనిపించింది. తమన్నా, మెహరీన్ చక్కగా నటించారు''అని అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''ఈ సినిమాలో వరుణ్‌తేజ్‌లా కాదు వరుణ్ యాదవ్‌లా కనపడతాను. ఫస్ట్ టైమ్ ఓ మాస్ క్యారెక్టర్ చేశాను. ఇందులో నాది కామెడీ క్యారెక్టర్. ఈ సినిమాతో దర్శకుడు అనిల్‌లాంటి మంచి ఫ్రెండ్ దొరికినందుకు ఆనందంగా ఉంది. దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్‌లతో 'ఫిదా' చేశాను. ఆతర్వాత ఈ సినిమా చేశాను. ఈ బ్యానర్‌లో పనిచేయడం హ్యాపీగా ఉంది. సీనియర్ స్టార్ వెంకటేశ్‌తో కలిసి సినిమా చేయాలంటే ఎక్కడో చిన్న భయం ఉండేది. కానీ ఆయన మాతో కలిసిపోయి నటించారు''అని తెలిపారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''ఓ సినిమా సిద్ధం కావడానికి 24 క్రాఫ్ట్స్ కష్టపడాల్సిందే. ఈ సినిమాకు మేమంతా అలాగే కష్టపడ్డాం. 'కలియుగ పాండవులు'తో వెంకటేశ్ అభిమానిని అయ్యాను. ఆయనతో రెండోసారి చేస్తున్న చిత్రమిది. ఇక కథ విన్న వెంటనే 'నా పాత్ర ఏంటి' అని అడగకుండా ఒప్పుకున్నాడు వరుణ్. అనిల్ దగ్గర ఓ మ్యాజిక్ ఉంది. పూర్తి స్క్రిప్ట్ లేకుండా సినిమా తీయడానికి నేను ఒప్పుకోను. అలాంటి నన్ను కేవలం సన్నివేశాలు చెప్పి అనిల్ ఒప్పించేస్తాడు'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తమన్నా, మెహరీన్, రాజేంద్రప్రసాద్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మల్టీస్టారర్‌తో టాలీవుడ్ ఎంట్రీ?

బాలీవుడ్ క్యూట్ బ్యూటీ అలియాభట్ తెలుగులో తెరంగేట్రం చేయనుందని ఎప్పటినుండో అంటున్నారు. అయితే అది ఇంతవరకు జరుగలేదు. కానీ ఇప్పుడు ఆ సమయం వచ్చిందని అనిపిస్తోంది. ఇక అలియాభట్ కూడా టాలీవుడ్‌లో పాదం మోపేందుకు సిద్ధంగానే ఉంది. అయితే తెలుగులో సినిమా అంటూ చేస్తే ఎన్టీఆర్‌తోనే చేస్తానని ఓసారి ఈ యంగ్ బ్యూటీ చెప్పింది. త్వరలో అది జరిగేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్‌తో కలిసి 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ భారీ మల్టీస్టారర్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ 'బాహుబలి' తర్వాత రాజమౌళి యూనివర్సల్ డైరెక్టర్ అయిపోయారు. దీంతో ఆయన నుండి వస్తున్న ఈ మల్టీస్టారర్ కోసం ఒక్క టాలీవుడ్ మాత్రమే కాదు బాలీవుడ్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. బాలీవుడ్‌లో భారీ కలెక్షన్లతో 'బాహుబలి' రికార్డులు సృష్టించింది. ఆ రికార్డులను బ్రేక్ చేసిన హిందీ సినిమా ఇంతవరకు రాలేదు. ఇక 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో హీరోయిన్ల ఎంపిక కొంత ఆలస్యమవుతోంది. సినిమాకు హీరోయిన్లు ప్లస్ అయ్యేలా ఉండాలని రాజమౌళి భావిస్తున్నారు. అందుకే ఓ బాలీవుడ్ భామను ఎంపిక చేసుకోవాలని అనుకుంటున్నారట. ఆ క్రమంలోనే యంగ్ బ్యూటీ అలియాతో ఆయన చర్చలు జరిపారని తెలిసింది. ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా రష్మికాను తీసుకోవాలని అనుకుంటున్నారట.


అలియాభట్


అఖిల్

కొన్ని మార్పులు చేర్పులు

అక్కినేని అఖిల్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'మిస్టర్ మజ్ను'. ఈ చిత్రం విడుదల తేదీ పలుసార్లు మారింది. ముందుగా డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలని అనుకున్నారు. కానీ ఫిబ్రవరికి వెళ్లిందన్నారు. చివరికి జనవరి 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని ఫిల్మ్‌మేకర్స్ ప్రకటించారు. ఇదిలాఉండగా గత రెండు వారాలుగా సినిమాకు సంబంధించి ఓ రూమర్ వినిపిస్తోంది. సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయిందని... కానీ నాగార్జున కొన్ని మార్పులు చేర్పులు సూచించడంతో రీషూట్ చేస్తున్నారని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం ఒక్క రోజు షూటింగ్ మాత్రమే మిగిలి ఉందని తెలిసింది. ఇది పూర్తయితే సినిమాకు గుమ్మడికాయ కొడతారని అంటున్నారు. ఇక సినిమా విడుదలకు రెండు వారాల సమయం ఉంది కాబట్టి ప్రమోషన్స్‌లో జోరు పెంచుతారట. అఖిల్ హీరోగా ఎంట్రీ ఇచ్చిన తర్వాత నటించిన రెండు సినిమాలు బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచాయి. దీంతో 'తొలిప్రేమ' వంటి యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించిన దర్శకుడు వెంకీ అట్లూరితో అఖిల్ 'మిస్టర్ మజ్ను' సినిమా చేస్తున్నారు. మరి ఈ సినిమాతోనైనా ఈ యంగ్ హీరోకు పెద్ద విజయం దక్కుతుందా అనేది చూడాలి.

సీట్ ఎడ్జింగ్ థ్రిల్లర్

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న స్టైలిష్ యాక్షన్ సస్పెన్స్ థ్రిల్లర్ '118'. నివేదా థామస్, షాలిని పాండే హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.వి.గుహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మహేశ్ కోనేరు నిర్మిస్తున్న ఈ సినిమా మార్చి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్ కోనేరు మాట్లాడుతూ ''ఇప్పటికే విడుదలైన '118' టైటిల్ లోగో, ఫస్ట్‌లుక్, టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక కల్యాణ్‌రామ్ పాత్ర లుక్ ఎలా ఉంటుందనే విషయంతో పాటు అసలు సినిమా ఏ జోనర్‌లో తెరకెక్కుతోందనే విషయాన్ని టీజర్ ద్వారా చూపించాం. సీట్ ఎడ్జింగ్ థ్రిల్లర్ ఇది. కల్యాణ్‌రామ్ ఇప్పటివరకు చేయనటువంటి జోనర్ ఇది.


నందమూరి కల్యాణ్‌రామ్

డిఫరెంట్ లవ్ స్టోరీ

సూర్యచంద్ర ప్రొడక్షన్‌లో నెమలి సురేష్ సమర్పణలో నెమలి అనిల్, సుబాంగి పంథ్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 'రావే నా చెలియా'. ఎన్.మహేశ్వర రెడ్డి దర్శకత్వంలో నెమలి అనిల్, నెమలి శ్రవణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం లోగోను నిర్మాత రాజ్ కందుకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''రావే నా చెలియా టైటిల్ చాలా బాగుంది. కంటెంట్ కూడా బాగుంటుందని అనుకుంటున్నాను. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. హీరో నెమలి అనిల్ మాట్లాడుతూ ''ఇది నా మొదటి సినిమా. మా నాన్న, బాబాయి కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిన్న సినిమా అయినా మంచి సినిమా ఇది''అని తెలిపారు. దర్శకుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ''హీరో అనిల్, నిర్మాతలు నన్ను నమ్మి ఈ సినిమాను రూపొందిస్తున్నారు. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయనని తెలియజేస్తున్నాను. డిఫరెంట్ లవ్ స్టోరీతో వస్తున్నాం'' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, రవి ఎన్.విరాజ్, సుబాంగి, విజయ్ దగ్గుబాటి, ఎం.ఎం.కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


'రావే నా చెలియా' లోగోను ఆవిష్కరిస్తున్న రాజ్ కందుకూరి. చిత్రంలో నెమలి అనిల్, సుబాంగి, మహేందర్ రెడ్డి తదితరులు

ఎన్టీఆర్‌లా బాలకృష్ణ వందశాతం కనిపించారు

నందమూరి తారక రామారావు జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'యన్.టి.ఆర్'. క్రిష్ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ టైటిల్ పాత్రలో నటిస్తూ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ బయోపిక్ రెండు భాగాలుగా రూపొందింది. ఎన్టీఆర్ సినీ ప్రస్థానం ఆధారంగా రూపొందిన తొలి భాగం 'యన్.టి.ఆర్‌కథానాయకుడు' తాజాగా ప్రపంచవ్యాప్తంగా విడుదలై సంచలనం సృష్టిస్తోంది. తండ్రికి తగ్గ తనయుడిగా, ఎన్టీఆర్ నట వారసుడిగా బాలకృష్ణ నటన అద్వితీయం అంటూ అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావుగా సుమంత్, నందమూరి హరికృష్ణగా కల్యాణ్‌రామ్‌లు అద్భుతంగా నటించారని కొనియాడుతున్నారు. ఇక 'యన్.టి.ఆర్‌కథానాయకుడు' చిత్రాన్ని సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల ప్రత్యేకంగా వీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ''నందమూరి బాలకృష్ణ రూపొందించిన ఎన్టీఆర్ బయోపిక్ చూశాను. చాలా బావుంది. సినిమా చూసినట్లు కాకుండా ఒక జీవితాన్ని చూసినట్లు అనిపించింది. ఎన్టీఆర్‌లా బాలకృష్ణ వందశాతం కనిపించారు. ఆయన వేసిన అన్ని గెటప్స్ బావున్నాయి. తప్పకుండా ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది''అని అన్నారు. విజయ నిర్మల మాట్లాడుతూ ''నాకు 12 ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహత్యం' సినిమా చేశాను. ఆ సినిమాలో కృష్ణుడిగా నటించాను. ఇక ఈ బయోపిక్ చూస్తుంటే ఎన్టీఆర్‌ను చూస్తున్నట్లుగా బాలకృష్ణ నటించారు''అని తెలిపారు. సీనియర్ నరేష్ మాట్లాడుతూ ''ఈ బయోపిక్‌లో వేషం వేయాలని నన్ను అడిగినప్పుడు చాలా సంతోషం వేసింది. అది కూడా బి.ఎ.సుబ్బారావు వేషం. ఆ సన్నివేశాలను నేను చేస్తున్నప్పుడు థ్రిల్ ఫీలయ్యాను. క్రిష్ ఈ సినిమాతో గ్రేట్ డైరెక్టర్ నుండి లెజెండరీ డైరెక్టర్ అయ్యారు''అని పేర్కొన్నారు.


సీనియర్ నరేష్, సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల

తాప్సీ టీనేజ్ లవ్ స్టోరీ

టాలీవుడ్‌లో అవకాశాలు లేకపోవడంతో కొంత కాలం క్రితం బాలీవుడ్‌కు వెళ్లింది తాప్సీ. అక్కడ బేబి, పింక్, నామ్ షబానా, జుడ్వా 2 వంటి విజయవంతమైన చిత్రాలతో జోరు మీద ఉంది ఈ పంజాబీ బ్యూటీ. ఇటీవల 'మన్మార్జియాన్' చిత్రంతో మంచి హిట్‌ను అందుకున్న ఆమె ఇప్పటికే పలు క్రేజీ సినిమాలకు సంతకాలు చేసింది. ఇక తాప్సీ గత కొంతకాలంగా ఓ విదేశీ బ్యాడ్మింటన్ ఆటగాడితో ప్రేమలో ఉందని ప్రచారం సాగుతోంది. అయితే తాజాగా ఈ బ్యూటీ తన చిన్ననాటి ప్రేమ కథ గురించి చెప్పి వార్తల్లో నిలిచింది. టీనేజ్ లవ్ స్టోరీ ఇదని చెప్పింది. 9వ తరగతి చదువుతున్న రోజుల్లోనే తాను ఓ అబ్బాయితో ప్రేమలో పడ్డానని తాప్సీ పేర్కొంది. అయితే నెక్స్ట్ 10వ తరగతి కాబట్టి ఈ ప్రేమ వ్యవహారానికి దూరంగా ఉంటానని ఆ అబ్బాయి చెప్పి షాకిచ్చాడని తాప్సీ తెలియజేసింది. అదే విషయాన్ని ఈ భామ ఇప్పుడు చెప్పింది. ఇక తనలాగే ఆలోచించే వాడు దొరికితే వెంటనే పెళ్లాడేస్తానని చెప్పింది తాప్సీ.


తాప్సీ

పోటీ



సైనిక కారణాలు

- తొలిసారి 1806లో వేల్లూరులో, 1824లో రెండవసారి బారక్‌పూర్‌లో సిపాయిల తిరుగుబాటు జరిగినవి.
- బ్రిటీష్ సైన్యంలో పనిచేసే సైనికులను సిపాయిలు అంటారు.
- వీరికి సుబేదార్ పదవికి మించి పదోన్నతి లభించేది కాదు.
- కంపెనీ సైనికులను సోల్జర్స్ అంటారు.
- భారతీయ సైనికులు బ్రిటీష్ వారి తరపున పోరాడుతున్నప్పటికి జీతభత్యాలు, పదోన్నతిలో వ్యత్యాసం ఉండేది.
- విలియం బెంటింక్ భారతీయ సిపాయిలకు చెల్లించవలసిన అదనపు భత్యాలను రద్దు చేశాడు.
- 1854లో సిపాయిలకు గల ఉచిత తపాలా సౌకర్యాన్ని కూడా రద్దు చేశాడు.
- ఆంగ్ల సైన్యంలో సిపాయిలు 7/8వ వంతు కలరు. మొత్తం సైన్యంలో ఆంగ్లేయుల సైన్యం 19% మాత్రమే.
- 1856లో కానింగ్ సామాన్య సేవా నియుక్త చట్టం ప్రవేశపెట్టి విదేశాలలో మరియు ఏ ప్రాంతాలలో అయిన సిపాయిలు యుద్ధం చేయటానికి ఆదేశించాడు.
- కంపెనీలో భారతీయ, ఆంగ్ల సైన్యం నిష్పత్తి – 5:1.

తక్షణ కారణం

- 1856లో ప్రవేశపెట్టిన 'రాయల్ ఎన్‌ఫీల్డ్' తుపాకులు – తక్షణ కారణం.
- వీటిలో ఆవు, పంది కొవ్వు పూసిన తుపాకులను సిపాయిలను వాడమనటం.
- వీటిని ఉపయోగించే శిక్షణ నిమిత్తం డమ్‌డమ్, అంబాల, సియోల్‌కోటను బెర్హంపూర్, బారక్‌పూర్.
- ఎన్‌ఫీల్డ్ తుపాకుల ఉత్పత్తి కేంద్రం – వూత్‌ట్రవచ్ (ఇంగ్లాండ్).
- 1857 మార్చి 29న బారక్‌పుర్ (బెంగాల్)లోని 34వ సైనిక రెజిమెంట్‌కు చెందిన 1446 సిపాయి మంగళ్‌పాండే లెఫ్టినెంట్ బాగ్‌హుక్‌సన్‌ను కాల్చి చంపాడు.
- దీంతో మంగళ్‌పాండేను అరెస్ట్ చెయ్యమని జందరీ ఈశ్వరిపాండేను ఆదేశించగా దానికతడును నిరాకరించడంతో మంగళ్‌పాడే, జందరీ ఈశ్వరి పాండేలను 1857 ఏప్రిల్ 8న ఉరితీశాడు.
- వీరు సిపాయి తిరుగుబాటు సమయంలో మరణించిన తొలివారు.
- 1857 ఏప్రిల్‌లో మీరట్‌లోని 3 అశ్వికదళానికి చెందిన కల్నల్‌స్మిత్ ఆధీనంలో 90 మంది సిపాయిలు ఈ తూటాలను ఉపయోగించుటకు నిరాకరించారు. వీరిలో 85మంది ఉపయోగించుటకు పూర్తిగా నిరాకరించి తమ ఉద్యోగాలను కోల్పోయింది. వీరికి 10సం॥రాలు జైలు శిక్ష విధిస్తే అంగీకరించారు.
- 1857 మే 8న మీరట్‌లో ఒక సంత జరుగగా మీరట్‌లోని కొంతమంది సిపాయిలు మహిళలచే దూషించబడ్డారు.
- దీంతో ప్రభావితులయిన మీరట్ సిపాయిలు బ్రిటీష్ వ్యతిరేకంగా పోరాటానికి నిర్ణయించుకొంన్నారు.
- 1857 మే 10న మీరట్‌లో బంధించి ఉన్న తన 85మంది సహోద్యోగులను విడిపించారు. (వాస్తవానికి తిరుగుబాటును నిర్ణయించిన తేది 1857 మే 31)
- బ్రిటీష్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రకటించి ఢిల్లీ వైపు పయనించారు.
- మే 11న జనరల్ భక్త్‌ఖాన్ నేతృత్వంలో ఢిల్లీ చేరుకొని ఎర్రకోటలోని బ్రిటీష్ రెసిడెంట్ అధికారి సైమన్ ఫ్రెజర్‌ను, ఢిల్లీ అధికారి సైమన్ రిఫ్లీలను వధించి చివరి మొఘల్ చక్రవర్తి అయిన 2వ బహదూర్‌షా జాఫర్‌ను 'షహన్ షా– ఇ హిందూస్థాన్' భారతదేశ చక్రవర్తిగా ప్రకటించారు.
- 2వ బహదూర్‌షా సహాయాన్ని కోరుతూ భారతదేశంలోని సంస్థానాలకు ఉత్తరాలు వ్రాశాడు.



ఝూన్సీ లక్ష్మీ బాయి అసలు పేరు?

- ఈ తిరుగుబాటు సమయంలో సిపాయిలు చేసిన నినాదం 'మరోఫిరంగికో'.

1857 తిరుగుబాటు జరిగిన ప్రముఖ ప్రాంతాలు :

- **ఢిల్లీ :** 2వ బహదూర్ షా నాయకుడైనప్పటికి వాస్తవాధికారాలు చెలాయించి తిరుగుబాటును ప్రారంభించినవారు – జనరల్ భక్త్ ఖాన్.
- ఢిల్లీలో తిరుగుబాటును అణచివేయడానికై జనరల్ నికోల్సన్ పంపబడ్డాడు. కానీ ఇతను హత్యకుగురైనాడు.
- దీంతో హడ్సన్ ఢిల్లీలో తిరుగుబాటును అణచివేసి 2వ బహదూర్‌షా భార్య జీనత్ మహల్‌ను, కుమారులను (జీవన్ భక్త్‌ను మినహాయంచి) హత్యచేశాడు.
- 2వ బహదూర్‌షాను రంగూన్ (బర్మా) బంధీగా పంపగా 1862లో అనారోగ్య కారణంగా చివరి మొఘల్ చక్రవర్తి అయిన 2వ బహదూర్‌షా రంగూన్‌లోని తంగూ జైలులో మరణించాడు.
- **కాన్పూర్ :** తిరుగుబాటు చేసినవారు – నానాసాహెబ్ కాగా అణచివేసినవాడు – క్యాంప్‌బెల్.
- నానా సాహెబ్ అసలు పేరు – గోవింద దోండూ పండిత్
- నానా సాహెబ్ – ఫ్రెంచ్ చక్రవర్తికి వ్రాసిన లేఖలో ఈ విధంగా పేర్కొన్నాడు. 'బ్రిటీష్ వారు చేసిన అక్రమ చట్టాలు సూర్యకిరణాలలాగా అన్ని వైపుల నుండి మండుతున్నాయి'
- ఇతను తనకుతానే పీష్వాగా ప్రకటించుకొని (2వ బాజీరావు దత్తపుత్రుడు)
- తన ఇద్దరు అనుచరులు అయిన తాంతియాతోపే, అజీముల్లాలతో కలిసి తిరుగుబాటు చేశాడు.
- అలహాబాద్ భవంతిలో గల 400మంది బ్రిటీష్ వారిని వధించుట కారణంగా (ఎక్కువ మంది ఆంగ్లేయులు మరణించిన ప్రదేశం – కాన్పూర్) ఈ తిరుగుబాటు తీవ్రరూపం దాల్చింది.
- జనరల్ క్యాంప్‌బెల్‌ను (బ్రిటీష్ వారు) సుప్రీం కమాండర్ ఇన్‌చీఫ్‌గా భారత్‌కు పంపగా అతడు గుర్ఖాల సహాయంతో కాన్పూర్ తిరుగుబాగును అణచివేయగా నానాసాహెబ్ నేపాల్‌కు, తాంతియాతోపే (రాయచంద్ర పాండురంగ) మధ్య భారత అడవులకు పారిపోయారు.
- తాంతియాతోపే విండ్‌హోమ్ అనే బ్రిటీష్ అధికారిణి కాన్పూర్ నుండి తరిమివేశాడు.
- తాంతియాతోపే గెరిల్లా యుద్ధ పద్ధతిలో బ్రిటీష్ వారిని ఎదుర్కొంటూ ఝూన్సీ లక్ష్మీ బాయ్‌కు సైనిక సహాయం చేశాడు.
- మాలిన్‌సన్ – తాంతియాతోపేను గొప్ప గెరిల్లా యుద్ధవీరుడు అని వర్ణించాడు.
- మాన్‌సింగ్ అనే జమిందారీ మిత్రుడి నమ్మకద్రోహం ద్వారా బ్రిటీష్‌వారికి చిక్కి ఉరితీయబడ్డాడు.

అవద్/లక్నో :(గోమతి నది ఒడ్డున కలదు)

- తిరుగుబాటు చేసినవారు – బేగం హజరత్ మహల్ (వాజీద్ అలీషా భార్య)కాగా అణచివేసినది – క్యాంప్‌బెల్.
- బేగం హజరత్ మహల్ తన కుమారుడు బిర్జిస్‌ఖాద్రి /ఖాదిర్‌ను అవద్ పాలకుడిగా పేర్కొని బ్రిటీష్‌పై తిరుగుబాగును ప్రకటించినది.
- ఈ తిరుగుబాటుకు అన్ని వర్గాల నుండి మద్ధతు లభించినది.
- జనరల్ హెన్రీ లారెన్స్ అవద్‌లో చంపబడ్డాడు ఆ తర్వాత జనరల్ ఇంగ్లీష్, హేవ్‌లాక్, జేట్రం, నీల్‌లు తిరుగుబాటును అణచుటకు ప్రయత్నించి విఫలమయ్యారు.
- చివరగా జనరల్ క్యాంప్‌బెల్ అవద్ /లక్నో తిరుగుబాటును అణచివేయగా బేగం హజరత్‌మహల్ నేపాల్‌కు పారిపోయింది.
- **ఝూన్సీ :** తిరుగుబాటు చేసినవారు – లక్ష్మీ బాయి/ అసలు పేరు మణికర్ణిక లేదా మసూభాయి. అణిచివేసినవారు –జనరల్ హ్యూగ్రోస్.
- ఝూన్సీ లక్ష్మీ బాయి శ్రీగంగాధరరావు రెండవ భార్య
- శ్రీగంగాధర రావు మరణించగా దామోదర రావు అనే బాలుడిని దత్తత తీసుకొనెను.
- డల్హౌసి 1853లో రాజ్యసంక్రమణ సిద్ధాంతం అనే పేరుతో దత్తత నిరాకరించి ఝూన్సీ ఆక్రమించాడు.
- లక్ష్మీ బాయి తిరుగుబాటులో పాల్గొనడానికి కారణమైన సంఘటన –1857 జొకన్‌బాగ్ హత్యాకాండ దీనికి గల మరొక పేరు డివెన్‌బాగ్ /జూన్ హత్యాకాండ.
- లక్ష్మీ బాయి 'నా ఝూన్సీని ఇవ్వనుగాక ఇవ్వను మా స్వహస్తాలతో మా స్వాతంత్రాన్ని సమాధిచేయనివ్వం' అనే నినాదాలతో పోరాడినది.
- లక్ష్మీ బాయికి సహకరించిన వారు –తాంతియాతోపే, రావుసాహేబ్, (నానాసాహేబ్) సోదరుడు, బంద్రానవాడ్.
- 'స్వాతంత్ర్య పాలనను మేం మాచేతులనుంచి జారిపోనివ్వం' అని లక్ష్మీ బాయి తన సైన్యంతో ప్రతిజ్ఞ చేయించింది.
- లక్ష్మీ బాయి తిరుగుబాటును అణచివేసిన సర్‌హ్యూగ్రోజ్ ఈ స్త్రీని తిరుగుబాటు దారులలో ఏకైక పురుషుడు ఇండియన్ జోన్ ఆఫ్ ఆర్క్ అని వర్ణించాడు. (100సం॥ యుద్ధంలో ఇంగ్లాండ్ సైన్యం నుండి ఉత్తర ఫ్రాన్స్ కాపాడిన యువతి జోన్ ఆఫ్ ఆర్క్)
- లక్ష్మీ బాయి 1858 జూన్ 17న గ్వాలియర్ యుద్ధభూమిలో వీరమరణం పొందింది.

అర్రా/జగదీష్ పూర్/ బీహార్

- తిరుగుబాటు చేసినవారు – కున్వర్‌సింగ్ (80సం॥) కాగా అణచివేసినది. విలియం టేలర్, విస్సెంట్ ఐర్‌లు.
- **బిరుదులు :** బీహార్ కేసరి/ సింహం, భీష్మాచార్యుడు.
- అర్రా జమిందారీ పదవినుంచి తనను తొలగించారన్న కారణంతో బ్రిటీష్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు.
- ఆంగ్లేయులు ఇతడిని అణచివేసి ఇతని సోదరుడు అమర్‌సింగ్ జమిందారుగా ప్రకటించాడు.
- **ఫైజాబాద్ (ఉత్తరప్రదేశ్) :** తిరుగుబాటుదారుడు – మౌల్వీ అహ్మద్‌ల్లా (మద్రాస్‌కు చెందినవాడు) కాగా అణచివేసినవాడు – (జగాన్నాథ్‌సింగ్ పుల్వాన్ రాజు భారతీయుడు) 50వేల రివార్డ్‌ను పొందాడు.
- **ఇతర తిరుగుబాట్లు :** కదంసింగ్ – మీరట్, అజీముల్లాఖాన్ /ఫతేపూర్, దేవిసంగ్ –మధుర, మహ్మద్‌ఖాన్–బిజ్‌నౌర్, అబ్దుల్ ఆలీఖాన్ – మురాదాబాద్, లియాఖత్ అలీ – అలహాబాద్ &బెనారస్‌చ నసీరుద్దీన్ – మేవత్‌రైతు, రంగాబాపూజీగుప్తా – మహారాష్ట్ర, రంగారావు పాగే &దిలీఫ్ సింగ్ – నాందేడ్.

ఆంధ్రపై 1857 తిరుగుబాటు ప్రభావం


- కడప దర్గాలో జీహాద్‌ను ప్రకటించివారు – షూర్‌పీర్ సాహేబ్.
- పర్లాకిమిడిలోని సవరజాతి తరపున తిరుగుబాటు చేసినది – రాధాకృష్ణ దండసేనుడు.
- గోదావరి ఏజన్సీ ప్రాంతంలో తిరుగుబాటు చేసిన కోరటూరు గ్రామపెద్ద – కోరుకొండ సుబ్బారెడ్డి కాగా ఇతనికి సహకరించిన కోపల్లె జమిందార్ – కోర్లవెంకట సుబ్బారెడ్డి.
- విశాఖపట్నం పేరును మహ్మద్‌పట్నంగా మార్చాలని నిర్ణయించిన రోజు –మొహరం పండుగ.

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202



సుదీర్ఘకాల అంతరిక్షయాత్రతో వెన్నుపూస కండరాల సమస్య


వ్యోమగాములు ఎవరైతే సుదీర్ఘకాలం అంతర్జాతీయ అంతరిక్ష స్థావరంలో గడుపుతారో వారికి భూమికి తిరిగి వచ్చిన తరువాత వెన్నుముక కండరాల పరిమాణం , సాంద్రత తగ్గడం తదితర సమస్యలు ఎదురవుతాయని ఈ సమస్య నాలుగేళ్ల వరకు కొనసాగుతుందని అధ్యయనంలో బయటపడింది. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు కేటెలిన్ బర్కర్ట్ అతని సహచరులు ఈ అధ్యయనం చేపట్టారు. అంతరిక్ష వ్యోమనౌక వెన్నుపూసకు సంబంధించిన కండరాలలో మార్పులకు దోహదం చేస్తుందని చివరకు వెన్నునొప్పికి దారి తీస్తుందని ఇది వ్యోమగాముల్లో సర్వసాధారణమని అధ్యయనంలో వివరించారు. 17 మంది వ్యోమగాములకు సంబంధించి వెన్నుముక దిగువ భాగం తాలూకు కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సిటి) స్కాన్లను పరిశోధకులు విశ్లేషించారు. అంతరిక్షయాత్రకు వెళ్లే ముందు, అక్కడ నుంచి తిరిగి వచ్చిన తరువాత కూడా స్కాన్లను తీసి పరిశీలించారు. వెన్నుముక పక్క కండరాల సైజు, సమ్మేళనంలో వచ్చిన మార్పులను గుర్తించారు. వెన్నుముక కిందకు మీదికి కదిలేటప్పుడు ఈ కండరాలు కీలక పాత్ర వహిస్తాయి. ఇదివరకటి అధ్యయనాలు సుదీర్ఘకాల అంతరిక్ష యాత్ర తరువాత వ్యోమగాముల కండరాల సాంద్రత తగ్గడాన్ని గుర్తించారు. గురుత్వాకర్షణ శక్తి ఒత్తిడి లేకుండానే కండరాలు కృశించి పోవడమవుతుందని తెలుసుకున్నారు. అయితే సిటి స్కాన్లు వ్యోమగాములు యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన తరువాత కండరాల సైజు తగ్గిపోవడాన్ని గమనించారు. కండరాల సైజు 4.6 నుంచి 8.8 శాతం వరకు తగ్గుతున్నట్టు గుర్తించారు. తరువాత ఏడాదిపాటు దీన్ని పర్యవేక్షించి స్కాన్లు తీయించగా కండరాల సైజు తిరిగి యథాస్థితికి చేరుకున్నట్టు పరిశోధకులు తెలుసుకున్నారు. కండరాల్లో కొవ్వు పదార్థం కూడా పెరగడాన్ని గమనించారు. –సైన్స్ విభాగం



పచ్చి టొమాటోలతో అనారోగ్య సమస్య



టొమాటోలను ఎంత బాగా పరిశుభ్రం చేసినా సాల్మోనెల్లా టైఫిమ్యూరియమ్ బ్యాక్టీరియా తొలగిపోదు. ఈ బ్యాక్టీరియా గ్యాస్ట్రోఎంటెరిటిస్ వ్యాధిని సంక్రమింప చేస్తుంది. అయితే ఈ బ్యాక్టీరియా సంక్రమించడం పంట పండక ముందు తప్ప సాధారణంగా అందరూ భావించినట్టు పంటపండిన తరువాత కాదని బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) పరిశోధకులు వెల్లడించారు. దీనికి తిరుగులేని సాక్ష్యాన్ని చూపించ గలిగారు. మొక్క ప్రధాన వేరు నుంచి పక్క వేర్లు ఏర్పడే సమయంలో రంధ్రాలు ఏర్పడడం చూసి బ్యాక్టీరియా ఆ రంధ్రాల ద్వారా మొక్క లోకి ప్రవేశిస్తుందని పరిశోధకులు కనుగొన్నారు. కాలుష్య పూరితమైన సాగునీరు, ఆరుబయలు మల విసర్జన ఈ బ్యాక్టీరియా నేలలో ఏర్పడడానికి ప్రధాన కారణాలు. వంట చేసేటప్పుడు బ్యాక్టీరియా నశిస్తుంది. కానీ ఈ సాల్మోనెల్లా బ్యాక్టీరియా మాత్రం బ్యాక్టీరియా కలిగి ఉన్న పచ్చి కూరగాయలను సలాడ్‌గా తయారు చేయడానికి ఉపయోగించినప్పుడు సోకుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. సలాడ్ తయారు చేయడానికి ఉపయోగించే ఇతర కూరగాయలకు కూడా ఇదే విధంగా బ్యాక్టీరియా సోకుతుందా లేదా అన్నది పరిశోధించ వలసి ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. అందువల్ల ముడి కూరగాయలను ఆరగించడాన్ని మానుకోవలసి ఉంటుందని చెప్పారు. మొక్క సెల్యులోజ్‌ను తక్కువ చేయడానికి నిర్వీర్యం చేయడానికి కావలసిన ఎంజైమ్‌లు సాల్మోనెల్లా బ్యాక్టీరియాలో లేవని తెలిపారు. ఈ కారణంగా మొక్క కణగోడలను ఈ బ్యాక్టీరియా ఏమీ చేయలేదు. అందువల్ల ఎస్. టైఫిమ్యూరియమ్ బ్యాక్టీరియా సహజ సిద్ధంగా ఏర్పడే ద్వారాల ద్వారా ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంది. ప్రధాన వేరు మార్పుల వల్ల పక్క వేరులు ఏర్పడుతుంటాయి. పక్క వేరు ఏర్పడే సమయంలో పక్క వేరు పొడుచుకుని బయటకు రాడానికి వీలుగా చిన్న రంధ్రాలు ఏర్పడుతుంటాయని ప్రొఫెసర్ చక్రవర్తి చెప్పారు. దీన్ని అవకాశం చేసుకుని పరాన్నజీవి మొక్కలోకి ప్రవేశించ డానికి ప్రయత్నిస్తుంది. పక్కవేళ్లు ఏర్పడడానికి వీలు కల్పించే రంధ్రాల ప్రదేశాల్లో అత్యధికంగా సాల్మోనెల్లా బ్యాక్టీరియా నివసించి ఉండడాన్ని పరిశోధకులు గమనించారు. మిగతా ప్రధాన వేళ్లతో ఈ వేళ్లను పోల్చి చూశారు. ఇతర పరాన్న జీవు



లకు మాత్రం మొక్క కణగోడలను గుల్ల చేసే శక్తి ఉంటుంది. వేరు లోని అన్ని భాగాల్లో అవి విస్తరించి స్థిరంగా ఉంటాయి. నేలలో లవణ శాతం ఎక్కువగా ఉంటే పక్క వేళ్లు ఏర్పడడం ఎక్కువగానే ఉంటుంది. టొమాటో మొక్కల్లో ఈ లక్షణం బాగా కనిపించింది. టొమాటో పక్కవేళ్లు పెరిగిన కొద్దీ టొమాటో కాయలు సాల్మోనెల్లా బ్యాక్టీరియాకు గురి కావడం ఎక్కువగా కనిపించింది. లవణ శాతం ఎక్కువగా ఉన్న నేలల్లో టొమాటో పండించినప్పుడు సాల్మోనెల్లా బ్యాక్టీరియా ప్రభావం కూడా మొక్కలో ఎక్కువగా కనిపించింది. లవణీకరణ చెట్టు పక్కవేళ్ల ఏర్పాటును ప్రోత్సహించడం సాల్మోనెల్లా బ్యాక్టీరియా విస్తరించడం తదితర విశేషాలపై సంబంధాలపై మొట్టమొదటి సారి ఈ పరిశోధన జరగడం చెప్పుకోదగిన విశేషం. –సైన్స్ విభాగం



సంతాన వైఫల్యంపై పరిశోధన

మహిళల్లో పది శాతం మంది ఎండోమెట్రియోసిస్‌తో బాధపడుతుంటారు. ఈ ఎండోమెట్రియాసిస్ రోగుల్లో 50 శాతం మంది సంతాన రహితులవుతుంటారు. ఎండోమెట్రియోసిస్ అనేది కణాలను తేలికగా ఉద్రేకపరిచే స్థితి. ఈ స్థితిలో సాధారణంగా కణాలు గర్భాశయం లోపల పొరను రూపొందిస్తాయి. జననేంద్రియాలు, ఫెలోపియన్ నాళాలు, పొత్తి కడుపు చుట్టూ ఉండే కటి భాగం, గుదస్థానం తదితర భాగాల్లో ఎక్కడైనా ఈ కణాలు ఏర్పడుతుంటాయి. కొంతమంది మహిళలు మాత్రమే సంతాన విహీనులు కాడానికి కారణాలు ఏమిటో తెలుసుకోడానికి పరిశోధకులు ప్రయత్నించారు. అయితే ఇలా జరగడానికి గర్భంలో ఒక ప్రొటీన్ లోపించడమే కారణమని చెబుతున్నారు. దక్షిణ కొరియా, అమెరికా పరిశోధకులు ఈ ప్రయత్నంలో పాలు పంచుకున్నారు. ఎండోమెట్రియోసిస్, సంతాన వైఫల్యం కలిగిన 21 మంది మహిళల నమూనాలను అధ్యయనం చేశారు. ఎండొమెట్రియోసిస్ లేని సంతాన వంతురాలితో గర్భాశయం లోపల పొరల్లో మోలిక్యూల్ హెచ్‌డిఎసి 3 తక్కువ స్థాయిలు కలిగిన మహిళతో పోల్చి చూశారు. హెడిఎసి3 మోలిక్యూల్ ప్రొటీన్ల స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర వహిస్తుంది. ఎలుకలు, కోతుల్లో ప్రయోజనాత్మకంగా ఎండోమెట్రియోసిస్‌ను ప్రేరేపించే ప్రయోగాలు శాస్త్రవేత్తలు చేసినప్పుడు ఈ జంతువుల గర్భాశయ గోడల్లో హెచ్‌డిసిఎ మోలిక్యూల్ స్థాయిలు బాగా తగ్గిపోవడం కనిపించింది. గర్భాశయంలో హెచ్‌డిఎసి3 ఉత్పత్తికి జన్యు అవసరం లేకుండా శాస్త్రవేత్తలు ఎలుకను పుట్టించారు. ఆయా జంతువులు గొడ్డుమోత కావడాన్ని గమనించారు. ఎందుకంటే గర్భాశయ గోడ లోపల పొర ఎలాంటి మార్పులకు నోచుకోలేదు. అంటే గర్భం దాల్చడానికి అవసరమైన ఏర్పాట్లు జరగలేదు. – సైన్స్ విభాగం



రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే పార్టీకే మా మద్దతు
తమిళనాడు సిఎం పళనిస్వామి



చెన్నై: లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో తమిళనాడు ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేసే పార్టీకి అన్నాడిఎంకె పార్టీ మద్దతు ఇస్తుందని తమిళనాడు ముఖ్యమంత్రి కె పళనిస్వామి చెప్పారు. పొత్తులకు బిజెపి సిద్ధంగా ఉందని, పాతమిత్రులను పార్టీ ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందని ప్రధాని నరేంద్ర మోడీగురువారం తమిళనాడు బిజెపి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ చెప్పడం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడులో ప్రాంతీయ పార్టీలతో పొత్తులకు కాషాయ పార్టీ ఎదురు చూస్తోందన్న సంకేతాలను తన వ్యాఖ్యల ద్వారా ప్రధాని ఇచ్చారని భావిస్తున్న నేపథ్యంలో అన్నా డిఎంకె జాయింట్ కో ఆర్డినేటర్ కూడా అయిన పళనిస్వామి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 2004 లోక్‌సభ ఎన్నికల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలో అన్నాడిఎంకె బిజెపితో పొత్తుపెట్టుకుంది. అయితే ఈ కూటమి రాష్ట్రంలో ఒక్క సీటు కూడా గెలుచుకోక పోగా డిఎంకె– కాంగ్రెస్ కూటమి అన్ని స్థానాల్లో విజ యం సాధించింది. 'మాకు సంబంధించినంతవరకు తమిళనాడు ప్రజలకు ఎవరు మంచి చేస్తారో ఆ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావాలన్నది మా పార్టీ వైఖరి' అని పళనిస్వామి శుక్రవారం పార్టీ ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు. 'తమిళనాడు ప్రజలకు మేలు చేసే వారినే మేము సమర్థిస్తాం. రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసే వారిని మేము అంగీకరించం. ఇదే మా పార్టీ వైఖరి' అని పళనిస్వామి స్పష్టం చేశారు.

నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తా: తరుణ్ గొగోయ్

గువాహటి: పౌరసత్వ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే తాను నిషేధాజ్ఞలు ఉల్లంఘించి అరెస్టవుతానని శుక్రవారం అసోం మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత తరుణ్ గొగోయ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార బిజెపి ప్రభుత్వం ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరించి నిరంకుశ పాలన చేస్తోందన్నారు. తాను జైలు భరో ఉద్యమానికి నాయకత్వం వహించి నినాదాలు చేస్తానని, జైలుకు వెళ్తానని గొగోయ్ పేర్కొన్నారు. బిల్లును వ్యతిరేకిస్తూ రోజువారీ నిరసనల నేపథ్యంలో అన్ని రకాల ఆందోళనలు, ప్రదర్శనలు, ఊరేగింపులు, నినాదాలపై పోలీసులు నిషేధం విధించారు.

చిదంబరం అరెస్ట్ గడువు పొడిగింపు



న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్–మాక్సిస్ కేసులో కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం, ఆయన తనయుడు కార్తీల అరెస్ట్ గడువును శుక్రవారం ఢిల్లీ కోర్టు ఫిబ్రవరి 1 వరకు పొడిగించింది. సిబిఐ ప్రత్యేక జడ్జి ఓపి సైని ముందు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేసు విచారణ తుది దశలో ఉందని తెలిపారు. అయితే తండ్రి, తనయుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, ఎఎం సింఘ్వీలు చిదంబరం అరెస్ట్ గడువును పొడిగించాలని అభ్యర్థించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మంది ప్రభుత్వ అధికారుల విచారణకు అవసరమైన అనుమతులు తీసుకున్నట్లు సిబిఐ తెలిపింది. చిదంబరం విషయంలో కూడా ఇలాంటి అనుమతులు తీసుకున్నట్లు అంతకు ముందు పేర్కొంది.

ఓటర్ల గల్లంతుపై శశిధర్‌రెడ్డి అసంతృప్తి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ఎన్నికల సంఘం పనితీరుపైనా, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంపైనా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలుకుని పంచాయతీ ఎన్నికల వరకు ఎన్నికల సంఘం అధికారులు పారదర్శకంగా వ్యవహరించడంలేదని మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ఓటర్ల జాబితాను రూపొందించడంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం ఘోరంగా విఫలమైందని, దురుద్దేశపూర్వకంగానే పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగించిందన్నారు. ప్రతిపక్షాలు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో సిఇఓ కార్యాలయం అధికారులు ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడ్డారన్నారు.

అక్కడ తుమ్మితే.. ఇక్కడ ఔట్!

ఇండోర్: మధ్యప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ దయాదాక్షిణ్యాలతో నడుస్తోందని, ఢిల్లీలోని తమ పార్టీ కేంద్ర నాయకత్వం 'తుమ్మితే' ఇక్కడ ప్రభుత్వం పడిపోవడం ఖాయమని బిజెపి ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ్‌వర్గియ వెల్లడించారు. కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని కూల్చడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరికి రూ.100 కోట్లు బిజెపి ఆశచూపినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ ఆరోపించిన రెండు రోజులకే బిజెపి నేత నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. "మా పార్టీ అగ్ర నాయకత్వం తలచుకుంటే మధ్యప్రదేశ్‌లో మళ్లీ అధికారంలోకి రావడం పెద్ద పనేమీకాదు. ఇదేమి ప్రభుత్వం (కమల్‌నాథ్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం) మా దయాదాక్షిణ్యాలపైన ఈ ప్రభుత్వం నడుస్తోంది. మా బాస్ చిటికేస్తే చాలు అప్పుడు..." అంటూ విజయ్‌వర్గియ వ్యాఖ్యానించారు.

బిజెపితో చేతులు కలిపే ప్రసక్తే లేదు
వాజపేయితో మోడీకి పోలికా?



చెన్నై: రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బిజెపితో జీవితంలో చేతులు కలిపే ప్రసక్తి లేదని డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ స్పష్టం చేశారు. "మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయితో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీని పోల్చడానికి వీల్లేదు. మోడీ నాయకత్వంలో కూటమి కూడా ఆరోగ్యకరంగా లేదు..ఇలాంటి వాతావరణంలో బిజెపితో పొత్తు పెట్టుకునే అవకాశమే లేద"ని ఒక ప్రకటనలో స్టాలిన్ పేర్కొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ చాస్తున్న స్నేహహస్తాన్ని ఆయన ప్రస్తావిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని, మోడీ తనను తాను వాజపేయితో పోల్చుకోవడం విడ్డూరంగా ఉందని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

మిషెల్‌కు బ్రిటన్ దౌత్య అనుసంధానం

న్యూఢిల్లీ : అగస్టా వెస్ట్‌లాండ్ కేసులో ఆరోపణలు ఉన్న దళారీ క్రిస్టియన్ మిషెల్‌కు బ్రిటన్ కాన్సులేట్‌తో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. బ్రిటన్ జాతీయుడు అయిన మిషెల్‌కు భారత ప్రభుత్వం ఈ మేరకు కాన్సులర్ సహాయ ప్రక్రియ వెసులుబాటును కల్పించిందని అధికార వర్గాలు తెలిపాయి. రూ 3600 కోట్ల వివిఐపి ఛోపర్ హెలికాప్టర్ల ఒప్పందపు కేసులో విచారణకు మిషెల్‌ను దుబాయి నుంచి భారత్‌కు రప్పించారు. డిసెంబర్ తొలివారంలో అరెస్టు అయిన మిషెల్ జైలులో ఉన్నారు. వివిధ స్థాయిలలో విచారణను ఎదుర్కొంటున్నారు. ఆయనను కలుసుకునేందుకు అవకాశం కల్పించాలని బ్రిటన్ హైకమిషనర్ అభ్యర్థించింది.ఈ మేరకు ఈ అనుమతిని ఇచ్చినట్లు బ్రిటన్ హై కమిషన్‌లోని ఉన్నతాధికారి ఒకరు ఇటీవలే మిషెల్‌ను కలిసినట్లు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. మిషెల్ తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేందుకు కూడా అనుమతిని ఇచ్చినట్లు వివరించారు.

యుపి కూటమిలో కాంగ్రెస్ మిస్సు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్షాల ఎన్నికల పొత్తు, సీట్ల సర్దుబాట్లపై శనివారం కీలక ప్రకటన వెలువడనుంది. సమాజ్ వాది పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్, బిఎస్‌పి అధినేత్రి మాయావతి శనివారం లక్నోలో సంయుక్త విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా అన్ని అంశాలు వివరిస్తారని ఎస్‌పి జాతీయ కార్యదర్శి రాజేంద్ర చౌదరీ, బిఎస్‌పి ప్రధాన కార్యదర్శి ఎస్‌సి మిశ్రాలు శుక్రవారం ఇక్కడ చెప్పారు. లోక్‌సభ ఎన్నికలలో బిజెపితో సమగ్ర రీతిలో తలపడేందుకు యుపిలో ఎస్‌పి, బిఎస్‌పిలు జట్టు కడుతాయని ఇప్పటికే వెల్లడైంది. ఈ కూటమి ప్రధానంగా ద్విముఖంగానే ఉంటుందని, కాంగ్రెస్‌కు దీనిలో అవకాశం ఉండకపోవచ్చునని భావిస్తున్నారు. బిఎస్‌పి –ఎస్‌పిల పొత్తుపై పార్టీల అగ్రనేతలు దేశ రాజధానిలో ఇటీవల ప్రకటించిన తరువాత శనివారం లక్నోలో విలేకరుల సమావేశంలో సంయుక్తంగా మాట్లాడనుండటం ఇదే తొలిసారి.

సంక్రాంతి తెచ్చిందే సందడి

బస్సు, రైల్వే స్టేషన్లలో జనమే జనం ● పల్లెలకు కదులుతున్న నగరం ● పెద్ద సంఖ్యలో ప్రయాణాలు





మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: సంక్రాంతి అంటే పల్లె పండుగ.... దాంతో వివిధ చదువులు, ఉద్యోగాలు,వ్యాపారాల నిమిత్తం పల్లెలను వీడి పట్టణాలకు రోజు అనేక వేల మంది పట్టణాలకు వలస వస్తుంటారు.. కాని ఒక్క పండుగల రోజుల్లో మాత్రం అన్నింటినీ మరీ పక్కన పెడుతున్నారు.అవసరం అనుకుంటే వారి చదువులకు వ్యాపారాలకు తాత్కాలిక విరామం ప్రకటించి వారంతా అమ్మవడి లాంటి పల్లె బాట పడుతున్నారు. ముఖ్యంగా తెలుగు ప్రజలకు అతి ముఖ్యమైన పండుగలైన దసరా, సంక్రాంతి పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు తరలి వెళుతుంటారు. నిత్యం అనేక వ్యవహారాల్లో మునిగి తేలుతున్న ప్రజలు సంక్రాంతి మూడు రోజుల పాటు అన్నింటిని మరిచిపోయి సేద తీరేందుక పల్లెలకు వెళుతున్నారు. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు నగరంలోని రైల్వేస్టేషన్లకు, బస్టేషన్లకు చేరుకోవడంతో అవన్నీ కిక్కిరిసిపోతున్నాయి. అడుగు తీసి అడుగు పెట్టలేనంతగా పరిస్థితి ఉంటోంది. దక్షిణ మధ్య రైల్వే ఎన్ని ప్రత్యేక రైళ్ళు నడిపినా అదనపు సీటు, బెర్తులు అందుబాటులోకి తీసుకు వచ్చినప్పటికి రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు కిక్కిరిసి పోయారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, స్టేషన్ల నుంచి వెళుతున్న రైళ్ళు కిటకిటలాడాయి. రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులు, సులువుగా ప్రయాణించ గలిగినప్పటికి రిజర్వేషన్‌లేని వారు నానా ఇక్కట్లకు గురయ్యారు. వారందరు జనరల్ బోగీలను ఆశ్రయించాల్సి వచ్చింది. విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, చిత్తూరు, గుంటూరు, తదితర ప్రాంతాలకు వెళ్ళే రైళ్ళలో ప్రయాణికులు రద్దీ నెలకొంది.దీంతో ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో కూడా రద్దీ అధికంగానే ఉంది. స్టేషన్ బయట, వెయిటింగ్ హాళ్ళు, ఫ్లాట్‌ఫామ్‌లు ఎక్కడ చూసినా ప్రయాణికుల సందడి కనిపిస్తోంది. రైలు బయలు దేరడానికి ముందుగానే ఫ్లాట్‌ఫామ్‌ల ప్రయాణికులు వేచి వుంటున్నారు. పిల్లలు, మహిళలు, వృద్దులు జనరల్ బోగీల్లో సీట్ల కోసం నాన తిప్పలు పడుతున్నారు. మరో వైపు రెండు తెలుగు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కూడా పెద్ద ఎత్తున ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాయి. అయినప్పటికి అటు ఆంధ్రా, ఇటు తెలంగాణ ప్రాంతాలకు వెళ్ళే బస్సులన్నీ కిక్కిరి పోయాయి. జూబ్లీబస్‌స్టేషన్, ఇమ్లిబన్, బస్‌స్టేషన్లు ప్రయాణికులతో కళకళలాడాయి. అదే విధంగా ఇతర శివారు ప్రాంతాల్లోని బస్టాండ్ల వద్ద ప్రయాణికులు పెద్ద ఎత్తును వేచి చూస్తున్నారు ఇదే పరిస్థితి మరో రెండు రోజులు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

హస్తలాఘవం చూపుతున్న చోరులు

ప్రయాణికులు తాము ఎక్కాల్సిన బస్సులు, రైళ్ళ కోసం.. ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తుంటూ మరో వైపు చోరులు తమ హస్తలాఘవం చూపుతున్నారు. ఇందుకు సంబంధించి హెల్ప్‌డెస్క్‌లు సమీపంలో కూడా కనిపించకపోవడంతో ఏమీ చేయాలో తెలియక ప్రయాణికులు ఉసూరుమంటూ తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఈ అంశంపైగా ఆర్టిసి, పోలీసు అధికారుల సమన్వయంతో పనిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిబిఐ డైరెక్టర్‌పై ప్రధాని కక్ష సాధింపు

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మన తెలంగాణ/హైదరాబాద్ : సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఫైర్ సర్వీసుకు బదలాయించడం కక్షసాధింపు చర్యగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్. కె.నారాయణ అభివర్ణించారు. ఈ నిర్బంధాన్ని తట్టుకోలేక అలోక్‌వర్మ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అక్టోబర్ 31వ తేదీ చట్టవిరుద్ధంగా ప్రధానమంత్రి మోడీ, సివిసి కమిషనర్ అలోక్‌వర్మను, రాకేష్ ఆస్థానాను సెలవుపై పంపడం చట్టవిరుద్ధమన్నారు. అలోక్‌వర్మ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, ఈ చర్యను సుప్రీం కోర్టు తప్పుబడుతూ అలోక్‌వర్మను యథాస్థానంలో నియమించిందన్నారు. ఈ తీర్పును తట్టుకోలేని ప్రధానమంత్రి నిరాశ, నిస్పృహలతో అత్యున్నత స్థాయి కమిటీ పేరుతో ప్రతిపక్ష నాయకులు వ్యతిరేకించినా, అలోక్‌వర్మని ఫైర్ సర్వీసుకు బదలాయించడం కక్షసాధింపులో చర్యలో భాగమేనని ఆయన పేర్కొన్నారు. ఆస్థానా, అలోక్‌వర్మలపై వచ్చిన ఆరోపణలపై న్యాయస్థానంలో చర్చ జరగలేదన్నారు. హైపవర్ కమిటీ అలోక్‌వర్మను పిలిపించి వివరణ కోరలేదని ఆయన ఆరోపించారు. దీనిని బట్టి అలోక్‌వర్మ కొనసాగితే రాఫెల్ కుంభకోణం మొత్తం బయటపడుతుందని ఆందోళనతో ప్రధానమంత్రి ఈ దిగజారుడు చర్యకు పూనుకున్నారని ఆయన ఆరోపించారు. సిబిఐ చరిత్రలో ఇటువంటి ప్రత్యక్ష చర్య 55 సంవత్సరాలుగా ఎన్నడూ జరగలేదన్నారు. ప్రధాన మంత్రి స్థాయిలోనే చట్టాల దిక్కారణ జరిగితే ఈ ప్రజాస్వామ్యం మనుగడ ఎలా అని ఆయన ప్రశ్నించారు. దీనిని తాను ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

1971 పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం

అస్సాం సిటిజన్ షిప్ బిల్లును హడావుడిగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి బుల్‌డోజ్ చేసిందన్నారు. దాని ఫలితంగా అస్సాం భగ్గున మండుతోందన్నారు. వాస్తవానికి 1971 పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం అమలు చేయాల్సి ఉండగా బిజెపి సంకుచిత వైఖరితో 2014 డిసెంబర్ 31కి ముందు బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్ దేశాల నుంచి ముస్లింమేతరులను మాత్రమే అనుమతించే బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. రాజ్యాంగంలోని సెక్యులరిజంను వెక్కిరించే పద్ధతుల్లో కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దేశాన్ని మతపరంగా విభజించడానికి చేసే కుట్ర అని తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

తమిళనాడులో ప్రమాదం.. 420 కిమీ దూరంలో శవం!

చెన్నై: ద్విచక్ర వాహనంపై వస్తూ ఇంటి సమీపంలో కారు ఢీకొనడంతో మరణించిన తమిళనాడులోని ఒక వ్యక్తి శవం దాదాపు 420 కిలో మీటర్ల దూరంలో ఆంధ్రప్రదేశ్‌లో లభించింది. తమిళనాడులోని తిరువల్లూర్ జిల్లాలో బుధవారం ఈ ప్రమాదం సంభవించగా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో గురువారం శవం ఆచూకీ లభించింది. సిప్కాట్ అనే కంపెనీలో పనిచేస్తున్న సుధాకర్ బుధవారం రాత్రి విధులు ముగించుకుని పాండూర్ గ్రామానికి తిరిగి వస్తుండగా తన ఇంటి సమీపంలో వేగంగా వచ్చిన కారు అతని ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదం ధాటికి సుధాకర్ కాలు ఒకటి తెగిపడిపోగా అతను బైకుపై నుంచి ఎగిరిపడ్డాడు. బైకును ఢీకొట్టిన కారు డ్రైవర్ వెనక్కు తిరిగి చూడకుండా ఉడాయించాడు. కాగా, బైకుపై నుంచి ఎగిరిన సుధాకర్ మృతదేహం అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఒక సరకు రవాణా ట్రక్కులో పడిపోయింది. ఈ ప్రమాదాన్ని గమనించని ట్రక్కు డ్రైవర్ తన వెనుక ఉన్న మృతదేహాన్ని కనిపెట్టలేకపోయాడు. సుధాకర్ ఆచూకీ తెలియక అయోమయం చెందుతున్న తమిళనాడు పోలీసులు గురువారం ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి వచ్చిన సమాచారంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రక్కులో కుడి కాలు లేని ఒక మృతదేహం తమకు లభించిందని, కర్నూలులో గోడౌన్‌లో ట్రక్కును నిలిపిన డ్రైవర్‌కు మృతదేహం కనిపించడంతో వెంటనే అతను పోలీసులకు సమాచారం అందించాడు. ట్రక్కు ప్రయాణించిన మార్గాన్ని తెలుసుకున్న ఆంధ్ర పోలీసులు సుధాకర్ ఫోటోలను తమిళనాడు పోలీసులకు పంపించి సమాచారం అందించారు. తమిళనాడు పోలీసులు అది సుధాకర్ మృతదేహమేనని నిర్ధారించుకున్న తర్వాత అతని మృతదేహాన్ని కర్నూలు నుంచి తెప్పించారు. చివరకు ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవరును అదుపులోకి తీసుకుని తమిళనాడు పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

శబరిమల తంత్రి తొలగింపుపై చర్చించలేదు
ట్రావెన్కూర్ దేవస్వం బోర్డు చైర్మన్ స్పష్టీకరణ

తిరువనంతపురం: శబరిమల ఆలయ ప్రధాన పూజారి (తంత్రి)ని తొలగించాలని రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం యోచిస్తోందని ఓ వైపు మీడియాలో కథనాలు వస్తుండగా, శబరిమల ఆలయ వ్యవహారాలు చూపే అత్యున్నత స్థాయి మండలి అయిన ట్రావెన్కూర్ దేవస్వం బోర్డు మాత్రం ఆ విషయాన్ని తాము చర్చించనే లేదని, రాబోయే మకర విళక్కు(మకర జ్యోతి) పండగకు ముందు గందరగోళాన్ని సృష్టించడం కోసమే ఈ వివాదాన్ని లేవనెత్తారని అంటోంది. ప్రముఖ హిందూ ఆలయాల ప్రధాన పూజారుల నియామకం, అధికారాలకు సంబంధించి చాలా కోర్టు తీర్పులున్నాయని, బోర్డు వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని బోర్డు అధ్యక్షుడు ఎ పద్మకుమార్ పిటిఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ చెప్పారు. శబరిమల తంత్రి కందరారు రాజీవరును తొలగించడానికి సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఏదయినా ప్రయత్నం చేస్తే తాము సుప్రీంకోర్టును, కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తామని కేరళలోని ఆలయాల ప్రధాన పూజారుల సంఘం అయిన కేరళ తంత్రీ సమాజం గురువారం హెచ్చరించింది. గత వారం 50 ఏళ్లకన్నా తక్కువ వయసున్న ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన తర్వాత ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని జరపడంపై ముఖ్యమంత్రి పినరయి విజయన్, దేవాదాయ శాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్, ఇతర మంత్రులు తీవ్రంగా విమర్శించడం తెలిసిందే. ఆయన బ్రాహ్మణుడు కాదని, బ్రహ్మరాక్షసి అని సీనియర్ మంత్రి జి సుధాకరన్ తీవ్రస్థాయిలో దుయ్యబట్టడం తెలిసిందే.



మయన్మార్ టు మహానగరం

- గుట్టుగా బంగారం తరలింపు
- జంటనగరాలకు రైలు మార్గంలో రవాణా
- డిఆర్‌ఐ తనిఖీలతో నగర పోలీసుల నజర్
- జంట నగరాల్లోని జ్యూవెలర్స్‌పై నిఘా



మన తెలంగాణ/హైదరాబాద్ : మయన్మార్ నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా బంగారం తరలిస్తున్న ముఠా డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తనిఖీలలో గుట్టురట్టవుతోంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని డిఆర్‌ఐ అధికారులు, ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్, సిఐఎస్‌ఎఫ్ అధికారుల సమాచారం మేరకు నగర పోలీసులు జంటనగరాల్లోని పలు బంగారు దుకాణాలపై దృష్టి సారిస్తున్నారు. ఎయిర్ పోర్టులో తనిఖీలకు తాళలేక బంగారం తరలించే ముఠాలు రైలు మార్గాన్ని ఎంచుకుని స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నాయి. నగరంలోని పలు బంగారు దుకాణాల యజమానులు కిరాయి వ్యక్తులను ఎర్పాటు చేసుకుని బంగారం తరలింపు దందా సాగిస్తున్నారు. ఇటీవల రైలు మార్గంలో బంగారు తరలిస్తూ ఇటీవల నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు తరలిస్తున్న విశాఖ రైల్వేస్టేషన్‌లో 3.314 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అసోం రాజధాని గుహవాటి నుంచి సికింద్రాబాద్ వస్తున్న రైలులో డిఐఆర్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ.1.08 కోట్ల విలువ ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. బంగారం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. గుహవాటి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న బంగారాన్ని ఈనెల 4 వ తేదీన వైజాగ్ రైల్వే స్టేషన్లో పట్టుకున్నారు. ఈ కేసులో జైన్, గీవర్ రామ్, ప్రవీణ్, రామ్‌లను విచారించిన అధికారులకు ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. తమకు ఒక దఫా బంగారం తరలించినందుకు గాను కేవలం రూ.1500 మాత్రమే ఇస్తారని అధికారులకు వివరించారు. హైదరాబాద్ నగరంలోని గణేష్ జ్యూవెల్లర్స్‌తో పాటు పాట్ మార్కెట్లోని మరికొన్ని బంగారు దుకాణ దారులకు పేర్లు వెల్లడించినట్లు సమాచారం. గుహవాటి నుంచి వైజాగ్ అటు నుంచి రైలు మార్గంలో హైదరాబాద్‌కు చేరవేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది నెల్లూరులో గుహవాటి నుంచి చెన్నైకి వెళ్తున్న రైలులో 4.65 కిలోల బంగారాన్ని డిఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ స్టవ్ బర్నర్లలో బంగారాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు, అయితే వీటి విలువ 1.43 కోట్ల విలువ వుంటుందని అధికారులు వివరించారు.ఒమన్‌కు చెందిన ఓ యువకుడు మైక్రోవేవ్ ఒవెన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌లో 46 బంగారు రేకులను దాచి దుబాయ్ నుంచి ఒమెన్ ఎయిర్‌లైన్స్‌లో శంషాబాద్ చేరుకున్నాడు. శంషాబాద్ ప్రధాన రహదారిలో వెళుతుండగా డిఆర్‌ఐ అధికారులు తనిఖీలు నిర్వహించిన బంగారు రేకులను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 2045 గ్రాముల బరువున్న బంగారం విలువ రూ.66 లక్షలు ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ఎయిర్ పోర్టుల్లో డిఆర్‌ఐ, ఎకనామిక్స్ అఫెన్స్ విభాగం, సిఐఎస్‌ఎఫ్‌అధికారుల తనిఖీలలో భారీ ఎత్తున బంగారం పట్టుబడుతున్న విషయం విదితమే. అయితే కొందరు బంగారు దుకాణాల వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మయన్మార్ నుంచి బంగారం తరలించేందుకు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుంటున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగుచూసినట్లు సమాచారం.

మయన్మార్ మర్మమిదే..!

తక్కువ ధరకు లభ్యం కావడం, ఆపై జిఎస్‌టి పన్నులను ఎగవేసేందుకు బంగారు వ్యాపారులు మయన్మార్ నుంచి బంగారం దిగుమతి చేసుకుంటున్నట్లు డిఆర్‌ఐ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మయన్మార్‌లో బంగారు గనుల నుంచి వివిధ రూపాల్లో బంగారం తరలించి లాభాలను గడించేందుకు ఆంధ్రప్రదేశ్,తెలంగాణ, చెన్నై, బెంగళూరుకు చెందిన కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడినట్లు పోలీసు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. ఈక్రమంలో ఇటీవల పట్టుబడిన నిందితులను పూర్తి స్థాయిలో విచారించి బంగారు మాఫియాను వెలికితీస్తామని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.కాగా పట్టుబడిన వారిలో బంగారు వ్యాపారులు లేకపోవడం, నిందితులు ఇచ్చిన సమా చారం మేరకు బంగారు వ్యాపారులు స్పందించడం లేదన్నది సమాచారం. ఇటీవల కాలంలో బంగారం ధరలు మరింత పెరగటంతో మయన్మార్ నుంచి పెద్దఎత్తున బంగారం తరలిస్తున్నట్లు పోలీసువర్గాలు భావిస్తున్నాయి.

వారి 'రూటే' సపరేటు

బంగారం తరలించే స్మగ్లర్లు మయన్మార్ నుంచి ఇంపాల్ అటు నుంచి గుహవాటికి చేరుకుంటున్నారు. అక్కడి నుంచి రైలు, రోడ్ మార్గంలో కోల్‌కత, భువనేశ్వర్, వైజాగ్ మీదుగా హైదరాబాద్‌కు తరలిరిస్తున్నట్లు పోలీసు అధికారులు వివరిస్తున్నారు. వైజాగ్ నుంచి విజయవాడ, నెల్లూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గుహవాటి నుంచి కిషన్‌గంజ్ మీదుగా చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు రోడ్ మార్గంలో బంగారం తరలిస్తు పట్టుబడిన ఘటనలు ఉన్నాయి. వెరసి గుహవాటి నుంచి రైలు, రోడ్ మార్గంలో బంగారం తరలిస్తున్నారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

హార్దిక్, రాహుల్‌పై వేటు



ముంబయి: ఊహించినట్టుగానే భారత క్రికెటర్లు లోకేశ్ రాహుల్, హార్దిక్ పాండ్యలపై వేటు వేశారు. ఓ టివి షోలో పాల్గొన్న వీరిద్దరూ మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం లేపింది. దీనిపై విచారణ చేపట్టిన భారత క్రికెట్ బోర్డు పాలక మండలి హార్దిక్,. రాహుల్‌పై నిషేధం విధించాలని బిసిసిఐను కోరింది. కాగా, పాలక కమిటీ సూచన మేరకు బిసిసిఐ ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్ నుంచి హార్దిక్, రాహుల్‌లను తప్పించింది. వీరిద్దరిపై సస్పెన్షన్ విధించింది. వీరిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని బిసిసిఐ భావిస్తోంది. త్వరలోనే వీరిద్దరికి మరోసారి షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నారు. కాగా, ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌కు ఎంపికైన వీరిద్దరికి బిసిసిఐ ఉద్వాసన పలికింది. ప్రస్తుతం సస్పెన్షన్ మాత్రమే విధించారు. విచారణ పూర్తయిన తర్వాతే నిషేధంపై నిర్ణయం తీసుకోవాలని బిసిసిఐ భావిస్తోంది. కాగా, వివాదంలో చిక్కుకున్న హార్దిక్, రాహుల్‌లను స్వదేశానకి పంపించింది.

రిటైర్మెంట్ ప్రకటిస్తే

విరాట్ కోహ్లి

మళ్లీ బ్యాట్ పట్టను



సిడ్నీ: అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత మళ్లీ బ్యాట్ పట్టే ప్రసక్తే ఉండదని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి స్పష్టం చేవాడు. క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన తర్వాత మళ్లీ మ్యాచ్‌లపై కన్నేసి చూడనని కోహ్లి పేర్కొన్నాడు. ఒకసారి రిటైర్మెంట్ నిర్ణయం అంటూ తీసుకుంటే అది అన్ని స్థాయిల క్రికెట్‌కు వర్తిస్తోందన్నాడు. ఆ నిర్ణయం తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ బ్యాట్ పట్టనని తేల్చి చెప్పాడు. ఈ విషయంలో ఇతర ఆటగాళ్ల వ్యవహారం ఎలా ఉన్నా తాను మాత్రం మాటకు కట్టుబడి ఉంటానని తెలిపాడు. ఆస్ట్రేలియాతో శనివారం జరిగే తొలి వన్డేను పురస్కరించుకుని కోహ్లి మీడియాతో మాట్లాడాడు. ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పాడు. రిటైర్మెంట్ తర్వాత లీగ్ టోర్నీలు ఆడడం తనకు ఇష్టం ఉండదన్నాడు. ఇప్పటికే తాను ఎంతో క్రికెట్ ఆడానని, తన కంటూ ఎలాంటి ఆశలు లేవన్నాడు. ఫిట్‌నెస్ సహకరించినంత వరకే తాను క్రికెట్‌లో కొనసాగుతానని, ఆ విషయంలో తేడా కనిపిస్తే ఆట నుంచి తప్పుకునేందుకు వెనుకాడబోనని స్పష్టం చేశాడు. గత ఐదేళ్ల కాలంలో నేను ఆడాలనుకున్న దానికంటే ఎక్కువ క్రికెటే ఆడానన్నాడు. రికార్డులపై ఎప్పుడూ దృష్టి పెట్టలేదన్నాడు. ఆటపైనే తన దృష్టి ఉంటుందన్నాడు. ఇక, సిరీస్ గురించి మాట్లాడుతూ ఆస్ట్రేలియాను ఓడించేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నానన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో తమకు ఎదురు లేదన్నాడు. ఎటువంటి జట్టునైనా ఓడించే సామర్థ్యం తమకుందన్నాడు. టెస్టుల్లో విజయంతో జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందన్నాడు. ఇదే జోరును వన్డేల్లోనూ కొనసాగిస్తామన్నాడు. ఇక, రాహుల్, పాండ్యల విషయంలో మాట్లాడుతూ ఏ క్రికెటర్ అయినా ఇలాంటి బహిరంగ వ్యాఖ్యలు చేయడాన్ని తాను సమర్థించనని స్పష్టం చేశాడు. టివి షోలో హార్దిక్, రాహుల్ చేసిన వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమన్నాడు. దీనితో జట్టుకుగానీ, తనకుగానీ సంబంధం లేదన్నాడు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని తాను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించనన్నాడు. ఈ వ్యాఖ్యలు ఎవరినైనా బాధిస్తాయనడంలో సందేహం లేదన్నాడు. సెలబ్రిటీలుగా ఉన్న వారు తాము చేసే వ్యాఖ్యలను ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుంటే మంచిదన్నాడు.

కివీస్‌దే టి–20 సిరీస్



ఆక్లాండ్: శ్రీలంకతో జరిగిన ఏకైన ట్వంటీ–20 మ్యాచ్‌లోనూ ఆతిథ్య న్యూజిలాండ్ జయభేరి మోగించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కివీస్ 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్ సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. బ్రేస్‌వెల్ ఐదు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 26 బంతుల్లోనే 44 పరుగులు చేశాడు. మరోవైపు స్కాట్ 4 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 15 బంతుల్లోనే అజేయంగా 35 పరుగులు సాధించాడు. సీనియర్ ఆటగాడు టైలర్ 33 పరుగులు చేశాడు. సౌథి 13 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో కివీస్ భారీ స్కోరు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 144 పరుగులకే ఆలౌటైంది. తిసారా పెరీరా ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. ధాటిగా ఆడిన పెరీరా మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 43 పరుగులు చేసినా జట్టును గెలిపించలేక పోయాడు. కుశాల్ పెరీరా మూడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 23 పరుగులు చేశాడు. కివీస్ బౌలర్లలో ఫెర్గ్యూసన్, మిఛెల్ సాంట్నర్ మూడేసి వికెట్లు పడగొట్టారు. కాగా, కివీస్ ఇంతకుముందు టెస్టు, వన్డే సిరీస్‌లను కూడా గెలుచుకున్న విషయం తెలిసిందే.

శాస్త్రి, కోహ్లిలకు అరుదైన గౌరవం

సిడ్నీ: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రికి అరుదైన గౌరవం దక్కింది. సిడ్నీ క్రికెట్ మైదానం (ఎస్‌సిజి) వారికి జీవిత కాల సభ్యత్వాన్ని కల్పించింది. క్రికెట్‌కు చేసిన సేవలు, సిడ్నీ మైదానంలో చరిత్ర సృష్టించినందుకు కోహ్లి, శాస్త్రిలను ఎస్‌సిజి గౌరవ సభ్యత్వంతో సత్కరించింది. ఇంతకు ముందు సచిన్ టెండూల్కర్, బ్రియాన్ లారాలకు మాత్రమే ఇలాంటి అరుదైన గౌరవం దక్కింది. తాజాగా శాస్త్రి, కోహ్లి ఈ ఘనతను దక్కించుకున్నారు.



జోరు సాగిస్తారా

ఆత్మవిశ్వాసంతో భారత్ | ప్రతీకారం కోసం ఆస్ట్రేలియా | నేడు తొలి వన్డే





సిడ్నీ: భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్డే సమరానికి శనివారం తెరలేవనుంది. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరుగనుంది. సిడ్నీ వేదికగా జరిగే తొలి వన్డేకు ఇరు జట్లు సిద్ధమయ్యాయి. టెస్టు సిరీస్‌లో చారిత్రక విజయం సాధించిన టీమిండియా వన్డేల్లోనూ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు టెస్టుల్లో ఎదురైన ఓటమికి వన్డే సిరీస్‌లో బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు ఉంది. ఆస్ట్రేలియాతో పోల్చితే భారత్ బలంగా కనిపిస్తోంది. అయితే కీలక ఆటగాళ్లు హార్దిక్ పాండ్య, లోకేశ్ రాహుల్‌లు అందుబాటులో లేక పోవడం కాస్త ఇబ్బంది కలిగించే పరిణామమే. కానీ, వారు లేకున్నా భారత్ చాలా బలంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవ లేదు. టెస్టు సిరీస్‌లో నిలకడగా రాణించిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఈసారి కూడా చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నారు. భువనేశ్వర్, షమి, సిరాజ్, ఖలీల్, చాహల్, కుల్దీప్‌లతో భారత బౌలింగ్ చాలా బలంగా ఉంది. ఇక, ఈ సిరీస్‌లో అందరి దృష్టి సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనిపై నిలిచింది. కొంతకాలంగా వరుస వైఫల్యాలు చవి చూస్తున్న ధోని ఈ సిరీస్‌లో ఎలా రాణిస్తాడనే అంశం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక, ఆస్ట్రేలియా కీలక ఆటగాళ్లు లేకుండానే వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. సీనియర్ ఫాస్ట్ బౌలర్ పీటర్ సిడిల్ పదేళ్ల విరామం తర్వాత జట్టులోకి వచ్చాడు. మరోవైపు స్టార్ ఆటగాడు మిఛెల్ మార్ష్ తొలి వన్డేకు దూరమయ్యాడు. ఇది జట్టును కలవరానికి గురి చేస్తోంది. కాగా, ఆస్ట్రేలియా ఆశలన్నీ కెప్టెన్ అరోన్ ఫించ్‌పైనే ఆధారపడి ఉన్నాయి. జట్టును ముందుండి నడిపించాల్సిన బాధ్యత ఫించ్‌పై ఉంది. మాక్స్‌వెల్, ఉస్మాన్ ఖ్వాజాలు కూడా తమ వంతు పాత్ర పోషించక తప్పదు. బౌలింగ్‌లో జట్టు నాథన్ లియాన్‌పై ఆశలు పెట్టుకుంది.

ఓపెనర్లే కీలకం

ఈ మ్యాచ్‌లో భారత్‌కు ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు కీలకంగా మారారు. కొంతకాలంగా పరిమిత ఓవర్లలో రోహిత్–ధావన్ జోడీ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇటు రోహిత్, అటు ధావన్ నిలకడగా రాణిస్తూ జట్టుకు శుభారంభం అందిస్తున్నారు. కీలకమైన ఆస్ట్రేలియా సిరీస్‌లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నారు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన ధావన్, రోహిత్‌లు చెలరేగితే ఆస్ట్రేలియా బౌలర్లకు కష్టాలు ఖాయం.

జోరు సాగాలి

కొంతకాలంగా కెప్టెన్ విరాట్ కోహ్లి పరుగుల వరద పారదపారిస్తున్న విషయం తెలిసిందే. ఫార్మాట్ ఏదైనా కోహ్లి చెలరేగి పోతున్నాడు. ఇటీవల ముగిసిన టెస్టు సిరీస్‌లోనూ నిలకడగా రాణించాడు. వన్డేల్లోనూ చెలరేగి ఆడాలనే పట్టుదలతో కనిపిస్తున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన కోహ్లిపై భారత్ భారీ ఆశలు పెట్టుకుంది. కోహ్లి విజృంభిస్తే భారీ స్కోరు సాధించడం జట్టుకు కష్టం కాదు. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో కోహ్లి తన బ్యాటింగ్‌ను మరింత మెరుగు పరుచుకోవడంపై దృష్టి పెట్టాడు. ఇందులో భాగంగానే ఆస్ట్రేలియా సిరీస్‌లో భారీ స్కోర్లపై కన్నేశాడు. ఇక, నాలుగో నంబర్ స్థానంలో బరిలోకి దిగనున్న తెలుగుతేజం అంబటి రాయుడుపై అందరి దృష్టి నిలిచింది. ప్రపంచకప్ నేపథ్యంలో నాలుగో నంబర్‌లో బరిలోకి దిగే రాయుడు నిలకడగా ఆడాల్సిన అవసరం ఉంది. చాలా కాలంగా ఈ స్థానంలో భారత్‌ను సమస్య వెంటాడింది. అయితే రాయుడు కొంత కాలంగా నాలుగో నంబర్‌లో నిలకడగా ఆడుతుండడం జట్టుకు ఊరటనిస్తోంది. ఈ సిరీస్‌లో కూడా చెలరేగేందుకు సిద్ధమయ్యాడు.

ధోని ఈసారైనా..

మరోవైపు సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనికి ఈ సిరీస్ చాలా కీలకంగా మారింది. కొంతకాలంగా వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న ధోని తీవ్ర ఒత్తిడిలో కనిపిస్తున్నాడు. శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్ వంటి యువ వికెట్ కీపర్లు జట్టులో స్థానం కోసం ఎదురు చూస్తున్న సమయంలో వరు వైఫల్యాలు ధోనిని కలవరానికి గురి చేస్తున్నాయి. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో ధోని తన బ్యాటింగ్‌ను కచ్చితంగా మెరుగు పరుచు కోవాల్సిందే. జట్టులో ఎంతో సీనియర్ ఆటగాడిగా ఉన్న ధోనిలో ఒకప్పటి పదును కనిపించడం లేదు. గతంలో మ్యాచ్ ఫినిషర్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న ధోని ఇటీవల ఆ స్థాయిలో ఆడలేక పోతున్నాడు. ఇప్పటికే ధోనిని తప్పించాలనే డిమాండ్ ఊపందుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ధోని తన బ్యాట్‌తో విమర్శకులకు గట్టి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఒక వేళ ఈ సిరీస్‌లోనూ విఫలమైతే ధోని కష్టాలు మరింత పెరగం ఖాయం. ఇక, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్‌లకు కూడా తుది జట్టులో చోటు ఖాయంగా కనిపిస్తోంది. వీరిద్దరూ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. కాగా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య జట్టుకు దూరం కావడం కాస్త ఇబ్బంది కలిగించే పరిణామమే. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్, పాండ్యలను జట్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీంతో వీరి సేవలు జట్టుకు అందుబాటులో లేకుండా పోయాయి. మరోవైపు భారత బౌలింగ్ చాలా బలంగా ఉంది. ఈసారి కూడా జట్టుకు ప్రధాన అస్త్రంగా భువనేశ్వర్ మారాడు. బుమ్రాకు విశ్రాంతి ఇచ్చిన నేపథ్యంలో భువనేశ్వర్ బాధ్యత మరింత పెరిగింది. సీనియర్ బౌలర్ మహ్మద్ షమి కూడా జోరుమీదున్నాడు. యువ స్పీడ్‌స్టర్లు ఖలీల్ అహ్మద్, హైదరాబాదీ మహ్మద్ సిరాజ్‌లు కూడా చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నారు. కుల్దీప్, చాహల్‌లతో స్పిన్ విభాగం చాలా పటిష్టంగా ఉంది. దీంతో భారత్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

తక్కువ అంచనా వేయలేం

ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకుంది. కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగుతున్నా వారిని తక్కువ అంచనా వేయలేం. చివరి వరకు గట్టిగా పోరాడే సత్తా ఆస్ట్రేలియాకు ఉంది. అంతేగాక సొంత గడ్డపై ఆడుతుండడం మరింత కలిసివచ్చే అంశమే. అరోన్ ఫించ్, అలెక్స్ కారే, షాన్ మార్ష్, ఖ్వాజా, హాండ్స్‌కొంబ్ తదితరులతో బ్యాటింగ్ బలంగా ఉంది. రిచర్డ్‌సన్, లియాన్, బిల్లీ స్టాన్‌లేక్, ఆడమ్ జంపా, బెహ్రాన్‌డ్రాఫ్ తదితరులతో బౌలింగ్ కూడా పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు మాక్స్‌వెల్, స్టోయినిస్ వంటి అగ్రశ్రేణి ఆల్‌రౌండర్లు ఉండనే ఉన్నారు. దీంతో ఆస్ట్రేలియా కూడా భారీ ఆశలతో బరిలోకి దిగుతోంది.



జట్ల వివరాలు:

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, రాయుడు, ధోని, దినేశ్ కార్తీక్, రవీంద్ర జడేజా, కేదార్ జాదవ్, భువనేశ్వర్, కుల్దీప్, షమి, సిరాజ్, చాహల్, ఖలీల్ అహ్మద్.

ఆస్ట్రేలియా: అరోన్ ఫించ్ (కెప్టెన్), అలెక్స్ కారే, ఖ్వాజా, షాన్ మార్ష్, హాండ్స్‌కొంబ్, మార్కస్ స్టోయినిస్, మాక్స్‌వెల్, లియాన్, పీటర్ సిడిల్, రిచర్డ్‌సన్, బెహ్రాన్‌డ్రాఫ్, అష్టన్ టర్నర్, ఆడమ్ జంపా, బిల్లీ స్టాన్‌లేక్.

సోనీ నెట్ వర్క్‌లో
ఉదయం 7.30 గంటల
నుంచి ప్రత్యక్ష ప్రసారం

ఫైనల్లో బెంగళూరు

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పిబిఎల్)లో బెంగళూరు రాప్టర్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో బెంగళూరు 4–2 తేడాతో అవాధె వారియర్స్ జట్టును ఓడించింది. స్టార్ ఆటగాళ్లు సాయి ప్రణీత్, కిదాంబి శ్రీకాంత్‌లు తమ విజయపరంపరను సెమీఫైనల్లోనూ కొనసాగించారు. వీరిద్దరూ తమ ప్రత్యర్థులను ఓడించి జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. సాయి ప్రణీత్ 15–5, 15–4తో కొరియా స్టార్ లీ డాంగ్ క్యూన్‌ను ఓడించాడు. మరోవైపు శ్రీకాంత్ 15–7, 15–10 తేడాతో కొరియాకే చెందిన సాన్‌వాన్ హోను చిత్తు చేశాడు. మరోవైపు పురుషుల డబుల్స్, మహిళల సింగిల్స్‌లోనూ బెంగళూరు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.



సౌతాఫ్రికా 262 ఆలౌట్



జోహెన్నస్‌బర్గ్: పాకిస్థాన్–దక్షిణాఫ్రికా మధ్య శుక్రవారం ప్రారంభమైన చివరి టెస్టులో తొలి రోజు బౌలర్ల హవా సాగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 262 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన పాకిస్థాన్ శుక్రవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 17 పరుగులు చేసింది. ఓపెనర్ ఇమాముల్ హక్ 10(బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. షాన్ మసూద్ (2), అజహర్ అలీ (0) పెవిలియన్ చేరారు. అంతకు ముందు సౌతాఫ్రికా కూడా తక్కువ స్కోరుకే ఆలౌటైంది. ఒంటరి పోరాటం చేసిన ఓపెనర్ ఐడెన్ మార్క్రామ్ 16 ఫోర్లతో 90 పరుగులు చేశాడు. హాషిం ఆమ్లా (41), బ్రియూన్ (49), జుబేర్ హంజా (41) తప్ప మిగతావారు విఫలమయ్యారు. పాక్ బౌలర్లలో ఫహీమ్ మూడు, అబ్బాస్, హసన్,ఆమేర్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే ఇప్పటివరకు కొత్తగా ప్రవేశపెట్టిన 147 ప్రత్యేక రైలు సర్వీసులకు అదనంగా మరో 56 రైళ్ళను కూడా ప్రకటించింది. రద్దీ ఎక్కువగా ఉండడంతో సర్వీసుల సంఖ్యను పెంచాల్సి వచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివరించారు. అయినా రద్దీ ఎక్కువగానే ఉండొచ్చని అంచనా వేసి చివరి ప్రయాణీకులకు సైతం ప్రయాణ సౌకర్యంకలిగే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భారతీయులకు అనువుగా హెచ్1–బి

వీసాలో మార్పులపై ట్రంప్

వాషింగ్టన్: హెచ్1–బి వీసా ప్రోగ్రాంలో కీలకమైన మార్పులు రానున్నాయని, వీటివల్ల భారతీయ ఐటి ప్రొఫెషనల్స్. ఐటి కంపెనీలు అత్యధికంగా లాభపడతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చెప్పారు. కొత్త విధానం ఈ వీసా విధానంలో సరళతను, స్పష్టతను తీసుకు వస్తుందని, అమెరికా పౌరసత్వానికి మరింత నేరు బాటగా ఉంటుందని ఆయన చెప్పారు. నిపుణులు అవసరమైన కొన్ని ఉద్యోగాలకు అమెరికా కంపెనీలు విదేశీ ఉద్యోగులను తీసుకోవడానికి ఈ హెచ్ 1–బి వీసా వీలు కల్పిస్తుంది. అయితే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన రోజునుంచీ ఈ వీసా విధానంపై పలు ఆంక్షలు విధించడమే కాకుండా, అమెరికా ఉత్పత్తిదారులు, లోకల్ ఉద్యోగులను ప్రోత్సహించే ' బై అమెరికా, హైర్ అమెరికా' విధానాన్ని ప్రకటించడం తెలిసిందే. అయితే అమెరికాలో ఉండడానికి, అంతేకాకుండా అమెరికా పౌరసత్వాన్ని పొందడానికి మరింత నేరు బాటగా ఉండే విధంగా హెచ్1–బి వీసా విధానంలో మార్పులు తీసుకు రానున్నాం' అని ట్రంప్ శుక్రవారం ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోనూ సిబిఐకి 'నో ఎంట్రీ'

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల బాటనే ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోంది. తమ రాష్ట్రంలో కేసుల దర్యాప్తునకు అనుమతినిస్తూ గతంలో ఇచ్చిన 'సమ్మతి' ఉత్తర్వులను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. గురువారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాస్తూ ఢిల్లీ ప్రత్యేక పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్‌కు ఇచ్చిన సమ్మతిని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీ ప్రత్యేక పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం1946 కింద సిబిఐ ఏర్పాటైంది. దీంతో, ఛత్తీస్‌గఢ్‌లో దాడులు నిర్వహించాలన్నా, దర్యాప్తు జరపాలన్నా సిబిఐ ఇక రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముందుగా అనుమతి తీసుకోవలసి ఉంటుంది.




మీ 'మన్ కీ బాత్' వినడానికి

దుబాయ్ వచ్చా

దుబాయ్: ప్రధాని నరేంద్ర మోడీపై రాహుల్ గాంధీ వ్యంగ్య బాణాలు రువ్వారు. "నేను దుబాయ్‌కు వచ్చింది నా 'మన్ కీ బాత్' చెప్పడానికి కాదు..మీ మన్ కీ బాత్ వినడానికి" అంటూ ఇక్కడి భారతీయ కార్మికులనుద్దేశించి రాహుల్ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా తొలి సారి యుఎఇకి వచ్చిన రాహుల్ గాంధీకి దుబాయ్ విమానాశ్రయంలో ప్రవాస భారతీయులు గురువారం ఆత్మీయ స్వాగతం పలికారు. యుఎఇలో కష్టపడుతూ భారతదేశానికే గర్వకారణంగా నిలిచిన భారతీయ కార్మికులను ఆయన అభినందించారు. ప్రతి మతం, రాష్ట్రం, కులం పేర్లకు మీరు వన్నెతెచ్చారంటూ ఆయన కీర్తించారు. ప్రధాని నరేంద్ర మోడీ రేడియో ద్వారా ప్రతి నెల నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, తాను ఇక్కడకు తన మనసులోని మాటను చెప్పడానికి రాలేదని, మీ మనసులో మాటను తెలుసుకోవడానికే వచ్చానని రాహుల్ చెప్పారు. దీనికి ముందు రాహుల్ ఇక్కడి వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు.

జెఫ్ కుబేర హోదా ఉఫ్!

ప్రేయసి కోసం భార్యకు అమెజాన్ వ్యవస్థాపకుడి అత్యంత ఖరీదైన భరణం





ఆమెజాన్



దాంపత్య జీవితంలో ఏదైనా కారణం చేత పొరపొచ్చాలు వస్తే సర్దుకోవడమో లేదా అది చివరకు విడాకులకు దారి తీయడమో కామన్. ఆ విడాకులు తీసుకున్న భార్యకు న్యాయస్థానాల ఆదేశాలతో జీవన భృతితో పాటు మరిన్ని భర్తకు చెందిన ఆస్తులు కట్టబెడుతూ తీర్పులు ఇస్తాయి. భర్తల కూడా అందుకు సహరించి విడాకులు తీసుకోవడం చూస్తుంటాం. దీంతో భర్త ఆస్తి కొంత కరిగిపోవడం సర్వసాధారణమే. కానీ ఇప్పుడు యావత్ ప్రపంచం ఒక ప్రత్యేక వ్యక్తి విడాకుల తంతు గురించి నోరెళ్లబెడుతోంది. ఆయన విడాకుల ఖరీదు అంతా ఇంతా కాదు.. ఏకంగా బిలియన్ డాలర్లతో కూడుకున్నది. భారత కరెన్సీలో అది నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలు. కొన్ని రాష్ట్రాల బడ్జెట్ దాని విలువ. ఇంత ఖర్చుకు వెనకాడకుండా భార్యకు విడాకులు ఇస్తున్న ఆ వ్యక్తి ఎవరంటే అమెజాన్ వ్యవస్థాపకుడు, ప్రపంచంలో అత్యంత కుబేరుడిగా పేరుగాంచిన జెఫ్ బెజోస్(54). ఈయన కొంత కాలంగా మాజీ న్యూస్ యాంకర్, హెలికాప్టర్ పైలట్, డాన్స్ షో హోస్ట్ లారెన్ సాంచెజ్(49)తో డేటింగ్ చేస్తున్నారు. ఈ సాంచెజ్ ఎవరో కాదు బెజోస్ స్నేహితుడు, హాలీవుడ్ టాలెంట్ ఏజెంట్ పాట్రిక్ వైట్‌సెల్ భార్య. సాంచెజ్‌తో కొంత కాలంగా వైట్‌సెల్ దూరంగా ఉంటున్నారు.

పలు చోట్ల జరిగిన ఫంక్షన్లు, పార్టీలు, ఈవెంట్లతో పాటు వారివారి ఆఫీసుల్లో తరచూ కలుసుకున్న బెజోస్, సాంచెజ్ చివరికి ప్రేమలో పడ్డారు. ఒక రోజు బెజోస్ తన మనసు విప్పేశాడు. సాంచెజ్‌కు ఇలా మెసేజ్ పెట్టాడు. 'నిన్ను శ్వాసించాలని ఉంది. నిన్ను నా బిగి కౌగిలిలో బంధించుకోవాలని ఉంది. నీ పెదాలను కిస్ చేయాలని ఉంది. ఐ లవ్ యూ.. నేను నీ ప్రేమలో ఉన్నాను' అన్నది ఆ మెసేజ్ సారాంశం. ఇంకేముంది సాంచెజ్ కూడా కరిగిపోయింది. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం బెజోస్ సంపద విలువ 137బిలియన్ డాలర్లు. అమెజాన్‌లో ఆయన సొంత షేర్లు 80మిలియన్లు. అంటే 16శాతం. బెజోస్ ప్రఖ్యాత వార్తా పత్రిక 'వాషింగ్టన్ పోస్ట్' ప్రొప్రయిటర్ కూడా. అయితే జెఫ్ తన భార్య మెకంజీతో ముందస్తు విడాకుల అవగాహనకు రాలేదని ప్రముఖ టాబ్లాయిడ్ టిఎంజడ్ పేర్కొంది. మొత్తానికి వారి బంధానికి మధ్యలో తెరదించుకోవాలని ఇరువురు స్పష్టంగా ఉన్నట్లు తెలిపింది. అయితే విడాకుల నేపథ్యంలో అమెజాన్ ఆస్తుల విభజన కొంత క్లిష్టతరమైన ప్రక్రియేనని అభివర్ణించింది. బెజోస్‌కు నలుగురు పిల్లలు.. వేలాది ఎకరాల భూమి ఉంది. దేశంలోనే వీరు అతిపెద్ద భూస్వాములుగా ఉన్నారు. ఏది ఏమైనా ఈ విడాకుల ప్రక్రియ ప్రపంచ కుబేరుల ర్యాంకులను తారుమారు చేయనుంది. విడాకుల ద్వారా మెకంజీ పొందబోయే 69బిలియన్ డాలర్లతో ఆమె ప్రపంచంలో అత్యంత సంపన్న మహిళగా అవతరించబోతున్నారు. తద్వారా బెజోస్ ఆస్తులు చీలిపోయి మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు

దోస్తు పెండ్లాంతో ప్రేమాయణం

బిల్‌గేట్స్(92.5బిలియన్ డాలర్లు) మరోసారి ప్రపంచ కుబేరుడిగా అవతరించబోతున్నారు. 2017 బెజోస్, బిల్‌గేట్స్ స్థానాన్ని ఆక్రమించిన సంగతి తెలిసిందే. ఇక సాంచెజ్ సంగతికి వస్తే 2005లో ఆమె వైట్ సెల్‌ను పెళ్లాడారు. ఈమెకు ఇద్దరు కొడుకులు. అంతకుముందు సాంచెజ్ మాజీ ఎన్‌ఎఫ్‌ఎల్ స్టార్ టోనీ గొంజాలెజ్‌ను వివాహమాడి ఆయన ద్వారా ఒక కొడుకును కన్నది.

బెస్ట్ ఆఫ్ లక్ : ట్రంప్

ఇదిలావుండగా జెఫ్ విడాకులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. భార్య మెకంజీతో విడాకుల తంతు సాఫీగా సాగిపోవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.



ప్రపంచంలో అత్యంత ఖరీదైన విడాకులు

అలెక్ వైల్డ్‌స్టీన్ — జోస్‌లిన్ వైల్డ్‌స్టీన్

వీరిలో అలెక్ ఫ్రెంచి–అమెరికన్ వ్యా పారవేత్త. 21ఏళ్ల ఆయన భార్య జోస్‌లిన్‌కు 1999లో విడాకులిచ్చారు. 2.5బిలియన్ డాలర్లు ఇచ్చి ఆమెను విడిపించుకున్నాడు. అంతేకాదు 13 ఏళ్ల పాటు 100మిలియన్ డాలర్లు కూడా ఇవ్వాల్సి వచ్చింది. తద్వారా ఆమెకు మొత్తం 3.8బిలియన్ డాలర్లు ముట్టజెప్పాల్సి వచ్చింది.

రూపర్ట్ మర్డోక్ — అన్నా టోర్వ్

మర్డోక్ మీడియా మొఘల్‌గా పేరుగాంచారు. జర్నలిస్టు అన్నా మారియాను వివాహమాడి 31ఏళ్లపాటు కలిసి ఉన్నారు. 1998లో వీరిద్దరు వేరయ్యారు. అందుకోసం మర్డోక్ ఆమెకు 1.7బిలియన్ డాలర్లు చెల్లించాడట.

బెర్నీ— స్లావికా

బెర్నీ ఫార్ములా వన్ ఎగ్జిక్యూటివ్. క్రొయేషియా మోడల్ స్లావికాకు 2009లో విడాకులు ఇచ్చారు. అం దుకు 1.2బిలియన్ డాలర్లు కట్టాడట. ఇందుకోసం ఇరువురే ఒక అగ్రిమెంట్‌కు వచ్చినట్లు సమాచారం.

స్టీవ్ — ఎలానీ విన్

వీరిద్దరూ లాస్‌వెగాస్‌లో కాసినో మొఘల్స్. రెండుసార్లు పెళ్లి చేసుకున్నారు. వీరి రెండో విడాకుల ఖరీదు 1బిలియన్ డాలర్లు. అంతకు ముం దు విడాకులకు స్టీవ్ కొంత ముట్టజెప్పినట్లు వార్తలున్నాయి.

హరోల్డ్ — అర్నాల్

హరోల్డ్ చమురు వ్యాపారి. అర్నాల్‌తో ఆయనకు తీవ్రమైన విభేదాలు వచ్చాయి. వీరి విడాకులు పంచాయతీ కొన్నాళ్ల పాటు సాగి చివరకు 974.8మిలియన్ డాలర్ల దగ్గర తెగిపో యింది.

అద్నాన్ ఖషోగ్గి — సొరయా

అద్నాన్ అరేబియాలో ఫేమస్ ఆయుధ వ్యాపారి. 1961లో బ్రిటన్ యువతి సాండ్రాను పెళ్లాడి ఆమెను ఇస్లాంలోకి మార్చాడు. సొరయాగా పేరు మార్చాడు. చివరకు వీరి పెళ్లి 2బిలియన్ డాలర్లకు పెటాకులయ్యింది.

దిమిత్రి — ఎలెనా

రష్యాకు చెందిన దిమిత్రి కుటుంబం శక్తివంతమైనది. ఎలెనాతో విభేదాలు తలెత్తడంతో కొద్ది రోజుల పాటు వీరి విడాకుల కేసు కోర్టులో నడిచింది. సుదీర్ఘమైన న్యాయపోరాటం తర్వా త 604మిలియన్ డాలర్ల వద్ద వీరి విడాకులయ్యాయి.

క్రెయిగ్ — వెండీ

క్రెయిగ్ సెల్‌ఫోన్ కంపెనీ అధినేత. వెండీ వార్తా పత్రిక పబ్లిషర్. వీరిద్దరికి ఒక సమయంలో ముడిపడి చివరకు విడాకులకు వరకు వెళ్లింది. 1997లో 460మిలియన్ డాలర్లకు సెటిల్ చేసుకుని వెండీ క్రెయిగ్ నుంచి విడిపోయింది.

అలోక్ రాజీనామా

బలిపశువును చేశారంటూ ఆవేదన



న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో బుధవారం మరోసారి సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అలోక్‌వర్మను మళ్లీ తప్పిస్తూ కేంద్రం గురువారం సాయంత్రం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఆయనను ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేసింది.దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అలోక్‌వర్మ అగ్నిమాపక డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతుల చేపట్టకుండానే తన పదవికి రాజీనామా చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల అత్యున్నత స్థాయి నిర్ణాయక కమిటీ ముందు తన వాదనను వినిపించేందుకు అవకాశమివ్వకపోవడమే కాకుండా తనను పదవినుంచి తప్పించేందుకు మొత్త వ్యవహారాన్ని తలకిందులు చేయడం ద్వారా సహజన్యాయాన్ని దెబ్బతీశారని ఆయన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. సిబిఐలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలు ఆందోళనకరంగా పరిణమించిన విషయం తెలిసిందే. ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాకు, అలోక్ వర్మకు మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకోవడం, అధికారులు కూడా రెండు వర్గాలుగా విడిపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో ఈ ఇద్దరు అధికారుల మధ్య విభేదాలు సిబిఐ పరువు తీసే విధంగా మారాయని భావించిన ప్రభుత్వం వారిని బలవంతంగా సెలవుపై పంపించడమే కాకుండా సిబిఐలోనే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎం నాగేశ్వర రావుకు తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ గత అక్టోబర్ 23వ తేదీ అర్ధరాత్రి కీలక నిర్ణయాలు తీసుకోవడం తెలిసిందే.తాను ఎలాంటి తప్పుచేయకపోయినా తనను బలవంతంగా సెలవుపై పంపడాన్ని అలోక్‌వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటుగా దీనిపై సివిసిని నివేదిక కోరింది. సివిసి తన నివేదికను సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఉన్నత స్థాయి ప్యానెల్‌ను ఏర్పాటు చేసి విధానాల ప్రకారం నిర్ణయాలు తీసుకోవలసిన వ్యవస్థలో అర్ధరాత్రి నిర్ణయాలు సరికాదంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ప్రధాని నరేంద్ర మోడీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎకె సిక్రిలతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ బుధ, గురువారాలు రెండు రోజుల పాటు చర్చించాక కేంద్రం గురువారం అలోక్‌వర్మను సిబిఐ డైరెక్టర్ పదవినుంచి తప్పిస్తూ కీలక నిర్ణయంతీసుకుంది.

సిబిఐ నాశనానికి ప్రయత్నాలు : అలోక్ వర్మ

న్యూఢిల్లీ: దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ సిబిఐని నాశనం చేయడానికి నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి ఉద్వాసనకు గురైన అలోక్ వర్మ ఆరోపించారు. తనను సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేయడంపై స్పందించిన వర్మ తన పట్ల శత్రుత్వాన్ని పెంచుకున్న ఒకే ఒక వ్యక్తి చేసిన "తప్పుడు, నిరాధార, దురుద్దేశపూరిత" ఆరోపణల ఆధారంగానే తనను బదిలీ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం సిబిఐ డైరెక్టర్‌గా తిరిగి విధుల్లో చేరిన వర్మను ఆ మరుసటి రోజే ప్రధాని మోడీ సారథ్యంలోని ఉన్నత స్థాయి కమిటీ పదవి నుంచి తొలగించింది. తన బదిలీ నిర్ణయంపై పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ప్రకటనలో వర్మ స్పందించారు. సిబిఐ స్వతంత్రతను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. "బయటి నుంచి ఒత్తిళ్లు లేకుండా సిబిఐ పనిచేయాలి. సిబిఐని నాశనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ దాని సమగ్రతను కాపాడేందుకు నేను ప్రయత్నించారు. తమ పరిధిలో లేనప్పటికీ కేంద్ర ప్రభుత్వం, సివిసి గత ఏడాది అక్టోబర్ 23న జారీచేసిన ఉత్తర్వులు అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. వీటిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది" అని వర్మ తెలిపారు.

వర్మ బదిలీలు రద్దు



న్యూఢిల్లీ: సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గాగురువారం రాత్రి పొద్దుపోయాక బాధ్యతలు చేపట్టిన ఎం నాగేశ్వర రావు సిబిఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ బుధ, గురువారాల్లో జరిపిన బదిలీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో 77 రోజుల నిర్బంధ సెలవు తర్వాత బుధవారం తిరిగి సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అలోక్ వర్మ తాను లేని సమయంలో సిబిఐలో జరిగిన బదిలీలన్నిటినీ రద్దు చేశారు. అంతేకాకుండా గురువారం తనను తొలగించడానికి కొన్ని గంటల ముందు వర్మ ఐదుగురు సిబిఐ అధికారులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాపై నమోదయిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు అధికారిగా ఎస్‌పి హోదా అధికారి మోహిత్ గుప్తాను నియమించారు. అప్పటివరకు ఈ కేసును దర్యాప్తు చేస్తున్న డిఎస్‌పి ఎకె బస్సీతో పాటుగా మరికొందరు అధికారులను కూడా బదిలీ చేశారు. అయితే ఈ బదిలీలన్నిటినీ రద్దు చేసిన నాగేశ్వర రావు ఈ నెల 8 వ తేదీ నాటి యథాతథ స్థితిని పునరుద్ధరిస్తున్నట్లు తన ఉత్తర్వులో పేర్కొన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

అస్థానాకు హైకోర్టులో చుక్కెదురు

ఎఫ్ఐఆర్ రద్దుకు నిరాకరణ

న్యూఢిల్లీ: సిబిఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ అస్థానాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి ఆరోపణలపై తనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. అంతేకాకుండా ఈ కేసులో దర్యాప్తును పదివారాల్లో పూర్తి చేయాలని సిబిఐని న్యాయమూర్తి నజ్మి వాజిరి ఆదేశించారు. మాంసం ఎగుమతిదారు మోయిన్ ఖురేషి కేసులోంచి తనను తప్పించడానికి ఓ మధ్యవర్తి ద్వారా రాకేశ్ అస్థానాకు లంచం ఇచ్చినట్లు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సానా సతీశ్ బాబు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అస్థానాతో పాటుగా సిబిఐ డిప్యూటీ డైరెక్టర్ దేవేంద్ర కుమార్, మధ్యవర్తి మనోజ్‌ప్రసాద్‌లపై ఎఫ్ఐఆర్ నమోదయింది. అయితే దీనిపై వారు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం అస్థానా, మిగతా ఇద్దరిపై నమోదయిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడానికి నిరాకరించింది. దర్యాప్తును పదివారాల్లో పూర్తి చేయాలని సిబిఐని ఆదేశించింది. అస్థానాపై గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సైతం రద్దు చేసింది.



పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లా శాంతినికేతన్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త అమర్త్యసేన్

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666